మానుషి (గత వారంలోని ఈ వారంలో విశేషాలు)

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

నిజామాబాద్

fb.com/vaartha Digital

Published from Nizamabad, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

26-10-2025 ఆదివారం సంపుటి: 31 సంచిక: 264 పేజీలు: 10+4 వెల: 8.00



రూ.4.9 కోట్ల బ్యాంకు ఫ్రాడ్ కేసులో ఏడుగురికి జైలుశిక్ష 2

భారత్ గొప్ప ప్రజాస్వామ్య దేశం
నోబెల్ విజేత మరియా మచాడో 5




శనివారం చాదర్‌ఘాట్‌లోని ఘటనాస్థలంలో పోలీసులు



డిసిపి చైతన్య (ఫైల్)

## నగరంలో కాల్పులు..
# ఉద్రిక్తత

'సెల్' దొంగలను ఛేజ్ చేసిన డిసిపి చైతన్య

వారు కత్తితో జరిపిన దాడిలో డిసిపికి గాయాలు

దొంగలపై మూడు రౌండ్లు కాల్పులు జరిపిన చైతన్య

గాయపడిన దొంగలు ఆసుపత్రికి తరలింపు

ఉమర్ అనే దొంగపై 25 కేసులు, రౌడీషీట్: సిపి సజ్జనార్



ఘటనాస్థలంలో గాయపడిన ఉమర్

**హైదరాబాద్,(అఫ్జల్‌గంజ్) అక్టోబరు 25, ప్రభాతవార్త:** సామాన్యులపైనే కాదు.. శాంతి భద్రతలను కాపాడుతున్న పోలీసులను లక్ష్యంగా చేసుకుని రౌడీలు, దొంగలు దాడులకు పాల్పడుతున్న ఘటనలు పెరుగుతున్నాయి. తాజాగా హైదరాబాద్ నగరంలో >>2

## ఎక్కడికక్కడ నిలిపివేత.. ఎసి స్లీపర్ బస్సులుసీజ్



బస్సులోపల పోలీసు తనిఖీలు

రాష్ట్ర వ్యాప్తంగా రవాణాశాఖ తనిఖీలు

పలుబస్సుల బుకింగ్స్ రద్దు

ఆర్టీసీ బస్సులకు పెరిగిన గిరాకీ

# ప్రైవేటు బస్సులపై కొరడా



శనివారం హైదరాబాద్‌లో ప్రైవేటు ట్రావెల్స్ పై పోలీసుల తనిఖీల దృశ్యం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు25:** కర్నూలులో ఏసీ స్లీపర్ బస్సు దగ్ధమై 20 మంది ప్రాణాలు బలితీసుకున్నా కూడా ప్రైవేట్ ట్రావెల్స్ యాజమాన్యాల తీరు మారడం లేదు. అధికారులు తనిఖీలు చేపడుతున్నారని అధికారికంగానే తెలిసినా కూడా నిబంధనలను ఉల్లంఘిస్తూనే బస్సులు నడుస్తున్నాయి. ఇది శనివారం నాడు అధికారులు చేపట్టిన తనిఖీల్లో తేటతెల్లం అయింది. ప్రయాణికుల భద్రతను కాదని నిబంధనలను ఉల్లంఘిస్తున్న ప్రైవేట్ స్లీపర్ ఏసీ బస్సులపై రవాణా శాఖ అధికారులు శనివారం దాడులు చేపట్టారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, మల్కాజ్‌గిరి తదితర పది జిల్లాల్లో జరిగిన తనిఖీల్లో >>2


ఔటర్‌పై తప్పిన ఘోర ప్రమాదం 3 బోల్తాపడిన ప్రైవేటు బస్సు


## కర్నూలు దుర్ఘటనలో తప్పెవరిది?

స్కిడ్ కావడంతో రోడ్డుపై పడిన బైక్

ఆ వాహనాన్ని ఢీకొట్టినా బస్సు ఆపని డ్రైవర్ 2

300 మీటర్లు బైక్‌ను ఈడ్చుకెళ్లడం వల్లే బస్సు ఇంజిన్‌లో మంటలు

లొంగిన ఇద్దరు డ్రైవర్లకు డ్రంకెన్ టెస్టుపై నోరు మెదపని పోలీసులు

మూడు రోజులు భారీ వర్షసూచన

ఈదురు గాలులు వీచే అవకాశం

## పలు జిల్లాలకు ఎల్లో, ఆరెంజ్ అలర్ట్‌లు



శనివారం హైదరాబాద్‌లో చెరువును తలపిస్తున్న రహదారులపై వైర్ల అవస్థలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబరు25:** తెలంగాణలో రాబోయే మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. ఈదురుగాలులతో కూడి తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. 26, 27, 28 తేదీల్లో ఉత్తర, ఈశాన్య జిల్లాల్లో భారీ వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉన్నట్లు తెలిపారు. ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఉత్తర, ఈశాన్య జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది అని వాతావరణ శాఖ హెచ్చరించింది. దక్షిణ తెలంగాణ జిల్లాలైన ఖమ్మం, మహబూబాబాద్, నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్‌లకు ఎల్లో హెచ్చరికలు జారీ చేశామన్నారు. ఈజిల్లాల్లో 7 సెం.మీ. నుంచి 12 సెం.మీ. వరకు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు. హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో శనివారం సాయంత్రం వర్షం కురిసింది. షేక్‌పేట, గచ్చిబౌలి, రాయదుర్గం, కుత్బుల్లాపూర్, గండి మైసమ్మ, దుండిగల్, బహదూర్‌పల్లి, సూరారం, కూకట్‌పల్లి, మూసాపేట్, జేఎన్టీయూ, నిజాంపేట, ఇంద్రానగర్, శ్రీకృష్ణనగర్, శ్రీనగర్‌కాలనీ, జూబ్లీహిల్స్, అమీర్‌పేట్, ఎస్ఆర్ నగర్, సనత్ నగర్, ఎర్రగడ్డ, ఖైరతాబాద్, పంజాగుట్ట, కోఠి, పాతబస్తీ, సికింద్రాబాద్, బోయిన్‌పల్లి, తిరుమలగిరి, అల్వాల్, ప్యాట్నీ, పారడైజ్, బేగంపేట్, మారేడుపల్లి, చిలకలగూడ, తార్నాక, ఓయూ క్యాంపస్, లాలాపేట్, హబ్సిగూడ, నాచారం, మల్లాపూర్, బహదూర్‌పల్లి, సూరారం, జీడిమెట్ల, గండిమైసమ్మ, దుండిగల్, బాలానగర్ తదితర ప్రాంతాల్లో మోస్తరు వర్షం పడింది. భారీగా కురిసిన వానతో నగరవాసులు తడిసి ముద్దయ్యారు. వివిధ పనులపై బయటకు వచ్చిన వాహనదారులు వర్షానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



శనివారం వీడియో కాన్ఫరెన్స్‌లో సిఇఒ

## రాష్ట్రంలో 'సర్'

కలెక్టర్లతో సిఇఒ సుదర్శన్ రెడ్డి విసి

లోపరహితంగా ఓటర్ల జాబితా

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు25:** రాష్ట్రవ్యాప్తంగా జరగనున్న ప్రత్యేక విస్తృత ఓటరు జాబితా సవరణ (స్పెషల్ ఇంటెన్సీవ్ రివిజన్–ఎస్ఐఆర్) కార్యక్రమంపై సన్నాహాలను ముఖ్య ఎన్నికల అధికారి సి.సుధర్శన్ రెడ్డి శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు (డిఈవో), నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారులు (ఇఆర్ఓ)తో సమీక్షించారు. ఈ సందర్భంగా సీఈఓ సుధర్శన్ రెడ్డి మాట్లాడుతూ, ప్రత్యేక విస్తృత సవరణలో భాగంగా చేపట్టాల్సిన అన్ని కార్యక్రమాలు నిర్ణీత గడువులో పూర్తిచేయాలని, ముఖ్యంగా టేబుల్ టాప్ వ్యాయామం వంటి పెండింగ్ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి >>2

## డిసిసి అధ్యక్షుల ఎంపికపై అధిష్ఠానం కసరత్తు

కెసి వేణుగోపాల్‌తో సిఎం రేవంత్‌రెడ్డి, డి.సిఎం భట్టి, పిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, ఇన్‌చార్జి మీనాక్షి భేటీ




శనివారం న్యూఢిల్లీలో ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్‌తో భేటీ అయిన సిఎం రేవంత్‌రెడ్డి, డి.సిఎం భట్టి,పిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, ఇన్‌చార్జి మీనాక్షి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబరు25:** తెలంగాణ రాష్ట్రంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుల నియామకంపై అధిష్ఠానం తీవ్ర కసరత్తు చేస్తోంది. జిల్లాల్లో బలమైన నేతలకే డిసిసి అధ్యక్ష బాధ్యతలు అప్పగించాలని కాంగ్రెస్ అధిష్ఠానం భావిస్తోంది. డిసిసి అధ్యక్షుల ఎంపిక కోసం అన్ని జిల్లాల నుంచి మూడేసి పేర్ల చొప్పున టిపిసిసి సేకరించి అధిష్ఠానానికి అందజేసింది. ఈ క్రమంలో శనివారం ఢిల్లీలో డీసీసీ అధ్యక్షుల నియామ కంపై ఎఐసీసీ ప్రధాన కార్యదర్శి కే.సి. వేణుగోపాల్‌తో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, ఎఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు వంశీచంద్ రెడ్డి, ఎఐసీసీ సెక్రటరీ విశ్వనాథన్ సమావేశమయ్యారు. ఈ సమావేశంలో రాష్ట్ర స్థాయిలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం, సంఘటన్ సృజన్‌అభియాన్ పురోగతి,జిల్లా స్థాయి నాయకత్వ మార్పులపై విశ్లేషణాత్మక >>2

## ఆధార్ లింక్ లేకుంటే జీతాలు బంద్

ప్రభుత్వం కీలక నిర్ణయం




**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబరు25:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆధార్ లింక్ చేయని ఉద్యోగుల జీతాలను నిలిపివేయాలని ఆర్థిక శాఖ నిర్ణయించింది. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల అక్టోబరు జీతాల చెల్లింపుపై ప్రభుత్వం శనివారం కీలక ఉత్తర్వులు విడుదల చేసింది. రాష్ట్ర ప్రభుత్వంలో పని చేస్తున్న ఉద్యోగులందరూ సెల్‌ఫోన్ నంబర్లు, ఆధార్ నంబర్లు నమోదు చేయకపోతే ఉద్యోగులకు జీతం చెల్లించొద్దని సర్కార్ నిర్ణయం తీసుకుంది. ఆర్థిక శాఖకు చెందిన ఐఎఫ్ఎంఐఎస్ పోర్టల్‌లో ఆధార్ వివరాలు అప్‌డేట్ చేయకపోతే అక్టోబరు జీతం కట్ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం హెచ్చరించింది. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరికీ ఈ నిబంధన వర్తిస్తుందని రేవంత్‌రెడ్డి సర్కార్ స్పష్టం చేసింది. అక్టోబరు 25వ తేదీ అర్ధరాత్రి లోపు ఆధార్ అప్‌డేట్ తప్పనిసరి అని తేల్చిచెప్పింది. ట్రెజరీ, వర్క్స్ అకౌంట్స్, పే అండ్ అకౌంట్స్, ప్రభుత్వ శాఖలు, యూనివర్సిటీలు, కార్పొరేషన్లు, సొసైటీలు అందరూ పాటించాలని కాంగ్రెస్ సర్కార్ ఆదేశాలు జారీ చేసింది. ఆధార్ లింక్ చేయని వారి అక్టోబరు జీతాలు నిలిపివేయాలని ఆదేశించింది. ఈ సర్క్యులర్‌పై ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా సంతకం చేశారు. ఈ ఆదేశాలని ఉల్లంఘిస్తే తీవ్రంగా వ్యవహరిస్తామని తెలంగాణ ప్రభుత్వం హెచ్చరించింది.అన్ని శాఖల్లో కలిపి శాశ్వత, తాత్కాలిక ఉద్యోగులు మొత్తం 10.14 లక్షల మంది ఉన్నారు. వారి పేర్లు, హోదా, ఆధార్, ఫోన్ నంబర్లు తదితర వివరాలన్నీ ప్రతి నెల 10వ తేదీ వరకు ఆర్థికశాఖ నిర్వహణ పోర్టల్ (ఐఎఫ్ఎంఐఎస్)లో నమోదు చేయాలని గత >>2

## ఇక 80 మార్కులకే ఇంటర్ వార్షిక పరీక్షలు

కొత్తగా ఎసిఇ గ్రూపు ప్రారంభం

**హైదరాబాద్, ప్రభాతవార్త, అక్టోబరు 25:** ఇంటర్మీడియట్‌లో ఇకపై 80 మార్కులకే వార్షిక పరీక్షలు జరగనున్నాయి. మరో 20 మార్కులు ఇంటర్నల్స్‌గా అమలు చేయనున్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం సైన్స్ విద్యార్థులకు కూడా ప్రాక్టికల్ పరీక్షలను నిర్వహించనున్నారు. కొత్తగా అకౌంటెన్సీ,కామర్స్, ఎకనామిక్స్(ఏసిఈ) గ్రూపును ప్రారంభించనున్నారు. ఇవన్నీ కూడా వచ్చే ఏడాది 2026-27 విద్యా సంవత్సరం నుంచి అమలు చేయాలని ఇంటర్ బోర్డు నిర్ణయించింది. దీంతో పాటు ఇంటర్ బోర్డులో తీసుకురానున్న పలు సంస్కరణల గురించి బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య శనివారం మీడియాకు తెలిపారు. ఇంటర్మీడియట్ విద్యలో సమూల >>2




# బస్సులపై కొరడా

>> మొత్తం 68 వాహనాలపై వీసీఆర్లు (వెహికల్ చెకింగ్ రిపోర్ట్) జారీ చేసి రూ.1.17 లక్షల కాంపౌండింగ్ ఫీజు వసూలు చేశారు. తనిఖీల్లో ఫైర్‌ఎక్స్టింగ్విషర్లు (అగ్నిమాపక యంత్రం), ఫస్ట్‌ఎయిడ్‌బాక్సులు లేకపోవడం, డ్రైవర్లు యూనిఫాం ధరించకపోవడం, అనుమతులను దుర్వినియోగం చేయడం, మల్టీటోన్ హారన్లు వాడటం, ప్రయాణికుల వాహనా ల్లో నిబంధనలకు విరుద్ధంగా సరుకులు రవాణా చేయడం వంటి ఉల్లంఘనలు బయటపడ్డాయి. ఈ తనిఖీల్లో నాలుగు బస్సులను అధికారులు సీజ్ చేశారు. హైదరాబాద్ నార్త్ జోన్లో 23, రంగారెడ్డి జిల్లాలో 14, సౌత్ జోన్లో 9, వెస్ట్ జోన్లో 9, ఈస్ట్ జోన్లో 6, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో 7 వీసీఆర్లు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రైవేట్ ట్రావెల్ ఆపరేటర్లు భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని రవాణా శాఖ హెచ్చరించింది. ఉల్లంఘనలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని జాయింట్ ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ రమేష్ పేర్కొన్నారు. రవాణా శాఖ తనిఖీల్లో టిఎస్ 12 యుఈ 1236 నంబర్ ఉన్న ప్రైవేట్ స్లీపర్ బస్సులో అనుమతించబడిన 23 సీట్లకు బదులుగా 29 సీట్లు ఏర్పాటు చేసినట్లు అధికారులు గుర్తించారు. అనుమతి లేకుండా అదనంగా అమర్చినందుకు వెంటనే చర్యలు తీసుకుని వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

**ఈ ఏడాదిలో 877 బస్సుల సీజ్**

ప్రయాణికుల భద్రతను కాదని నిబంధనలను ఉల్లంఘిస్తూ నడుస్తున్న ప్రైవేట్ స్లీపర్ ట్రావెల్స్ బస్సులపై రవాణ శాఖ అధికారులు రాష్ట్ర వ్యాప్తంగా దాడులు కొనసాగిస్తున్నారు. ఈ ఏడాది జనవరి 1 నుంచి అక్టోబర్ 25 వరకు జరిపిన తనిఖీల్లో 8,848 కేసులు నమోదు చేసి 877 బస్సులను స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో నిబంధనలకు విరుద్ధంగా నడిపిన ట్రావెల్స్ సంస్థల నుంచి అధికారులు రూ.2.28 కోట్లు కాంపౌండింగ్ ఫీజు, రూ.14.68 కోట్లు పన్నులు,జరిమానాల రూపంలో వసూలు చేశారు. మొత్తం వసూళ్లు 16.96 కోట్లు అని జెటిసి రమేశ్ తెలిపారు.

సాధారణంగా వీకెండ్ కావడంతో ప్రైవేట్ ట్రావెల్స్‌లో భారీగా బుకింగ్స్ ఉంటాయి. అయితే నిబంధనలు ఉల్లంఘిస్తున్న బస్సులపై ఆర్టీఏ చర్యలు ప్రారంభించింది. ఆంధ్రప్రదేశ్,తెలంగాణతో పాటు బెంగుళూరులోనూ ప్రైవేట్ ట్రావల్స్ బస్సుల తనిఖీలు,సీజ్‌లు కొనసాగుతున్నాయి. తెలంగాణ వారం రోజుల ఆర్టీఏ స్పెషల్ డ్రైవ్‌లు కొనసాగనున్నాయి. ఈ నేపథ్యంలో ప్రైవేట్ బస్సులు బుకింగ్స్ రద్దు చేస్తున్నాయి. ప్రయాణికులకు డబ్బులను రీఫండ్ చేస్తున్నాయి. దీంతో ఆర్టీసి బస్సులకు ఒక్కసారిగా గిరాకీ పెరిగినట్లు అధికారులు చెబుతున్నారు.

# రాష్ట్రంలో 'సర్'

>> నియోజకవర్గం, పోలింగ్ స్టేషన్ వారీగా పురోగతిని సమీక్షిస్తూ, ఖచ్చితమైన లోపరహిత ఓటర్ల జాబితా తయారీపై దృష్టి పెట్టాలని ఆయన సూచించారు. తదుపరి సమీక్షా సమావేశం నవంబర్ 1,2025న వీడియో కాన్ఫరెన్స్ రూపంలో నిర్వహించనున్నామని, అప్పటికి అన్ని పనులు పూర్తవ్వాలని ఆయన కలెక్టర్లను ఆదేశించారు. సమీక్షా సమావేశంలో అదనపు ముఖ్య ఎన్నికల అధికారి లోకేష్ కుమార్, ఉప ముఖ్య ఎన్నికల అధికారి హరి సింగ్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.ఇటీవల సుధర్శన్ రెడ్డి ఢిల్లీలో ప్రధాన ఎన్నికల కమిషనర్ ఆధ్వర్యంలో జరిగిన రెండు రోజుల జాతీయ సమావేశంలో పాల్గొన్నట్లు తెలిసింది. ఆ సమావేశంలో ఎన్నికల జాబితా నిర్వహణలో సాంకేతికత వినియోగం, పారదర్శకత పెంపు, ఓటర్ల సేవల మెరుగుదల ఉత్తమ పద్ధతుల అమలు వంటి అంశాలపై చర్చలు జరిగాయి. సీఈఓ సుధర్శన్ రెడ్డి మాట్లాడుతూ, రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పారదర్శకంగా, తప్పులేని, సమగ్ర ఓటర్ల జాబితాను సిద్ధం చేయడం ఎన్నికల శాఖ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

## ఆధార్ లింక్ లేకుంటే

# జీతాలు బంద్

>> నెలలో ఉత్తర్వులు జారీ చేసింది. కానీ, ఈ నెల 16వ తేదీ వరకు సగం మంది వివరాలు కూడా నమోదు చేయలేదు. ఈ క్రమంలోనే వివరాలివ్వని వారి జీతాలను ఈ నెల బిల్లులను నిలిపివేసింది. మిగిలిన వారు వెంటనే వివరాలు ఇవ్వాలని లేకపోతే ఇదే ట్రీట్‌మెంట్ అమలవుతుందని ఆర్థికశాఖ హెచ్చరించింది. ఉద్యోగుల సమగ్ర వివరాలన్నీ లేకపోవడంతో కొన్నిచోట్ల అక్రమాలు జరుగుతున్నాయని ప్రభుత్వానికి ఫిర్యాదులందుతున్నాయి. కొన్ని కార్యాలయాల్లో తాత్కాలిక ఉద్యోగులు మానేసినా,అనధికారికంగా సుదీర్ఘ సెలవులో వెళ్లినా వారి పేర్లతో వేతనాలు డ్రా చేస్తున్నారని విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పేరు,ఆధార్,సెల్ నెంబర్లతో పోల్చి చూస్తే ఎంత మంది ఉద్యోగులు ఉన్నారనే స్పష్టమైన వివరాలు అందుతాయని భావించి వివరాలు పంపాలని కోరగా పలు కార్యాలయాలు స్పందించడం లేదు.

# 33జిల్లాల్లో కోల్డ్ స్టోరేజీలు

## రూ.94 కోట్లతో 84 కోట్ల చేప పిల్లలను వదులుతున్నాం: మంత్రి వాకిటి శ్రీహరి

**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబర్ 25,ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాలో చేపలు నిల్వ చేయడానికి కోల్డ్ స్టోరేజ్ లు ఏర్పాటు కు డి.పి.ఆర్. రూపొందించనున్నట్లు రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్య,డైరీ అభివృద్ధి, క్రీడలు, యువజన శాఖ మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. మత్స్యకారులకు 100శాతం రాయితీతో చేపలు పంపిణీ కార్యక్రమాన్ని శనివారం మహబూబ్ నగర్ నియోజకవర్గం, హన్వాడ మండలం, ఇబ్రహీం బాద్ లోని హేమ సముద్రం దగ్గర మత్స్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈకార్యక్రమానికి మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కలెక్టర్ విజయేందిర బోయితో కలిసి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరై హేమ సముద్రంలో ఒక లక్ష 80 వేల చేపలు పిల్లలు పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర క్యాబినెట్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే మత్స్య శాఖకు బడ్జెట్ పెంచాలని కోరడం జరిగిందని,మార్చి నెలలో కేటాయించే బడ్జెట్ మళ్లీ వచ్చే మార్చిలో కేటాయింపులు జరుగుతాయని,కాని మంత్రిగా కోరిన వెంటనే 123 కోట్ల కేటాయింపు చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో గోదావరి, కృష్ణ నదుల మధ్యన ఉన్న అన్ని చెరువులలో ఎన్నడూ లేనివిధంగా రూ.94 కోట్ల విలువైన 84 కోట్ల చేప పిల్లలను సుమారు 26వేల చెరువుల్లో, 29 కోట్ల రూపాయల విలువైన 10 కోట్ల రొయ్యలను 300 నీటి వనరుల్లో విడుస్తున్నామని చెప్పారు. రాష్ట్రం లో మత్స్య పరిశ్రమపై ఆధారపడ్డ మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధి,ఉపాధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి అన్నారు. రాష్ట్రంలో మత్స్య రంగం పై ఆధారపడ్డ 5 లక్షల మత్స్యకారులు, మత్స్య సహకార సంఘాల సభ్యులకు ఆర్థికంగా అభివృద్ధి,ఉపాధి కల్పించేలా ఉచిత చేప పిల్లలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. రైతుల నుండి వడ్లను కొని బియ్యం తయారుచేసి చౌక ధర దుకాణాల ద్వారా పేదలకు కుటుంబంలో ఒక్కొక్కరికి 6 కిలోల సన్న బియ్యం పంపిణీ చేసిన విధం గానే చేపలను ఎండ బెట్టి పౌడర్ తయారీ చేసి పాఠశాలల పిల్లలకు ఆరోగ్యంగా ఉండేలా సరఫరాకు ఆలోచన చేసి అధ్యయనం చేస్తున్నట్లు తెలిపారు. గతంలో చిన్న సైజు చేపలు పంపిణీ చేసే వారని అన్నారు. పారదర్శకంగా చెరువు వద్ద చేపల సంఖ్య,ఖర్చు,మత్స్య సహకార సంఘం,ఎస్. ఐ పేర్లు,ఫోన్ నంబర్ లతో బోర్డ్ లు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.



## కర్నూలు దుర్ఘటనలో

# తప్పెవరిది?



డ్రైవర్ లక్ష్మయ్య (ఫైల్)

## స్కిడ్ కావడంతో రోడ్డుపై పడిన బైక్

### ఆ వాహనాన్ని ఢీకొట్టినా బస్సు ఆపని డ్రైవర్

### 300 మీటర్లు బైక్‌ను ఈడ్చుకెళ్లడం వల్లే బస్సు ఇంజిన్‌లో మంటలు

### తప్పు బైకర్‌పై నెట్టి ట్రావెల్స్‌ను కాపాడే యత్నం?

### బైకర్ మద్యం తాగాడంటున్న పోలీసులు

### లొంగిన ఇద్దరు డ్రైవర్లకు డ్రంకెన్ టెస్టుపై నోరు మెదపని పోలీసులు

**కర్నూలు, అక్టోబర్ 25, ప్రభాతవార్త :** బస్సు దగ్ధం సంఘటనలో డ్రైవర్ల తప్పులేదా.. కేవలం బైకర్ తప్పు మాత్రమేఉందా.. అనేవిషయం ప్రస్తుతం హాట్‌టాపిక్‌గా మారిం ది. బైక్ ను బస్సు ఢీకొనలేదని.. అప్పటికే బైక్ స్కిడ్ అయి రోడ్డుపై పడి ఉందని.. కర్నూలు జిల్లా పోలీసులు స్పష్టం చేశారు. దీంతో తప్పంతా బైకర్ దే అనే కోణంలో చర్చ జరుగుతోంది. బైక్‌ను గమనించకుండా డ్రైవ్ చేయడం డ్రైవర్ తప్పు కాదా అని చర్చ మరోవైపు ప్రారంభమైంది. రోడ్డుపై పడి ఉన్న బైక్‌ను ఢీ కొట్టిన వెంటనే బస్సు ఆపకపోవడం అసలు తప్పు కాదా అంటున్నారు. బయటపైకి దృష్టి మరలచడం ట్రావెల్స్ యాజమాన్యాన్ని కాపాడే ప్రయత్నమేనని ప్రజాసంఘాలు అంటు న్నాయి. వి కావేరి ట్రావెల్స్ బస్సు దగ్ధం కేసులో భిన్నస్వరాలు వినిపిస్తున్నాయి. శుక్రవారం తెల్లవారుజామున బస్సు మంటల్లో దగ్ధం కావడంతో19 మంది సజీవ దహనమయ్యారు. అక్కడే బైక్ శివశంకర్ కూడా చనిపోయాడు.

ఈ సంఘటనపై మొదట్లో రోడ్డుపై వెళ్తున్న బైకును బస్సు ఢీకొందన్నారు. ఆ సంఘటనలో బైక్ బస్సు కిందకు వెళ్లిపోయిందని, సుమారు 300 మీటర్లు బైక్ ను బస్సు ఈడ్చికెళ్ళిందన్నారు. తద్వారా మంటలు వేగాయని చెప్పారు. అయితే శనివారం రోజుకి ఆ విషయంలో కొంత మార్పు జరిగిం ది.ప్రమాదం జరగడానికి కారణం రోడ్డుపై బైక్ పడి ఉండడమేనం టున్నారు. కర్నూలుకు చెందిన శివశంకర్ అతని మిత్రుడు ఎర్రి స్వామి బస్సు ప్రమాదానికి కొద్దిసేపు ముందు అదే రోడ్లో వెళ్తూ బైక్ స్కిడ్ అయ్యి కింద పడ్డారు. ఆ ప్రమాదంలో శివశంకర్ మాత్రం అక్కడికక్కడే మృతి చెందాడని, ఎర్రి స్వామి స్వల్ప గాయాలతో బయటపడ్డాడని పోలీసులు ప్రకటించారు. ఆ క్రమంలో శివశంకర్ రోడ్డు పక్కన పడ్డాడని, బైక్ మాత్రం నడిరోడ్డులో పడిందని తెలిపారు. శివశంకర్ మృతి చెందాడని గుర్తించిన ఎర్రి స్వామి, తర్వాత బైకును పక్కకు తీద్దామనుకున్నాడు. అప్పటికే వి కావేరి ట్రావెల్స్ బస్సు బైక్ పై నుంచి వెళ్ళింది. సుమారు 300 మీటర్లు బైకును లాకెళ్ళింది. దీంతో మంటలు చెలరేగాయి. మంటలు చూసిన ప్రత్యక్ష సాక్షి మృతుడు శివశంకర్ మిత్రుడు ఎర్రి స్వామి అక్కడి నుండి పారిపోయాడు. ఈ విషయాన్ని బట్టి బస్సు డ్రైవర్ తప్పు లేదని బైక్ రోడ్డుపై పడడమే తప్పనే విధంగా చర్చ ప్రారంభమైంది. అయితే ఈ విషయంపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. రోడ్డుపై బైక్ పడి ఉంటే.. బస్సు ఆపడం.. లేదా పక్క నుంచి వెళ్లాలి కదా.. అనే వాదన వినిపిస్తుంది. అయితే బస్సు ఉన్న అతివేగం కారణంగా ఆ రెండు పనులు చేయలేక బైక్ పై బస్సు ఎక్కించాడు అంటున్నారు. అయితే కేవలం బైకును మాత్రమే ఢీకొట్టాడా.. బైక్ పై మనిషి ఉన్నాడా.. అనే విషయంపై స్పష్టత లేని డ్రైవర్ యాక్సిడెంట్ జరిగిందని భయపడ్డాడు. తప్పించుకునేందుకు బస్సు వేగం మరింత పెంచాడనే చర్చ జరుగుతోంది. బస్సు కింద ఉన్న బైక్ రోడ్డుకు రాసుకొని మంటలు వ్యాపించే వరకు బస్సును ఆపకపోవడం డ్రైవర్ దుర్మార్గమని స్థానికులు అంటున్నారు. బైక్ పై బస్సు ఎక్కిన వెంటనే 100 మీటర్ల లోపు బస్సును ఆపి ఉంటే.. మంటలు చెలరేగేవి కాదని, 19 మంది ప్రాణాలు నిలబడేవని అంటున్నారు. ఇక్కడ రోడ్డుపై బైక్ ఉన్నప్పటికీ బైక్ విషయంలో బస్సు డ్రైవర్ శ్రద్ధ తీసుకోకపోవడం ప్రమాదానికి అసలు కారణంగా పేర్కొంటున్నారు. అంతేగాక అతివేగం కారణంగా బస్సు కూడా కంట్రోల్ కాలేదని తెలుస్తోంది. ఇది ఇలా ఉండగా బైక్ నడిపిన శివశంకర్ మద్యం తాగాడని చర్చ జరుగుతుంది. ఇక్కడే స్థానికుల నుంచి మరో ప్రశ్న వినిపిస్తోంది. ప్రమాదం జరిగిన రెండు, మూడు గంటలలోపే డ్రైవర్లు పోలీస్ స్టేషన్ లో లొంగిపోయారని తెలుస్తోంది. డ్రైవర్లకు డ్రంకన్ టెస్టులు చేయించారా అని ప్రశ్నిస్తున్నారు. ఆ విషయంపై ఎలాంటి వివరాలు ఇప్పటి వరకు బయటకు రాలేదు. మొదట ఒక డ్రైవర్ మాత్రమే పోలీసులు అదుపులో ఉన్నారన్నారు. తర్వాత ఇద్దరు డ్రైవర్లు పోలీసులు అదుపులో ఉన్నారని ప్రకటించారు. కాగా ఇద్దరు డ్రైవర్లు ఆక్సిడెంట్ జరిగిన రెండు మూడు గంటల లోపే పోలీస్ స్టేషన్లో లొంగిపోయారని తెలుస్తోంది. వారికి డ్రంకన్ టెస్టులు చేయించి ఉంటే.. అసలు విషయాలు బయటకు వచ్చేవంటున్నారు. ఏది ఏమైనా ప్రమాదం జరిగిన మొదటి రోజు ట్రావెల్స్ బస్సు డ్రైవర్ ది పూర్తి తప్పిదమని.. రెండవ రోజు బైకర్ శివశంకర్ ది పూర్తి తప్పని చర్చ జరిగింది. అయితే నిపుణులు మాత్రం ప్రమాదానికి డ్రైవర్ బాధ్యత వహించాల్సి ఉంటుందని చెబుతున్నారు.

# డిసిసి అధ్యక్షుల ఎంపికపై అధిష్ఠానం కసరత్తు

>> చర్చలు జరిగాయి.ఇదే సమయంలో డిసిసి అధ్యక్షుల ఎంపికపై తీవ్ర కసరత్తు జరిగింది.ఈ నెలాఖరులోగా డిసిసి అధ్యక్షుల నియామకం జరిపేందుకు అధిష్ఠానం నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో డిసిసి అధ్యక్షుల నియామకంపై నేషనల్ అబ్జర్వర్లతో వన్ టు వన్ మీటింగ్ నిర్వహించినట్లు తెలుస్తోంది. కాగా కాంగ్రెస్‌లో కొత్తగా చేరిన డిసిసి అధ్యక్ష పదవులు కట్టబెట్టవద్దని అధిష్ఠానం సూత్ర ప్రాయంగా నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.కనీసంగా పార్టీలో 5 ఏళ్ల క్రితం చేరి ఉండాలని నిబంధన పాటించనున్నట్లు సమాచారం. మొత్తంగా సీనియారిటీ అధారంగానే డిసిసి అధ్యక్ష పదవులు అప్పగించాలని ప్రాథమికంగా నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే డిసిసి అధ్యక్ష పదవుల్లో ఉంటే భవిష్యత్తులో ఎమ్మెల్యేల టిక్కెట్ల ఎంపికలో కీలక పాత్ర వేసే అవకాశం ఉంటుందని ఆశావాహులు భావిస్తున్నారు. ఇదే క్రమంలో భవిష్యత్తులో ఎమ్మెల్సీ పదవులు లభించే అవకాశం ఉంటుందని యోచన చేస్తున్నారు. అయితే డిసిసి అధ్యక్ష పదవులు జిల్లాల్లోని కీలక నేతలందరినీ కలుపుకుపోయే వాళ్లకే అప్పగించాలని అధిష్ఠానం భావిస్తోంది. సీనియారిటీతో పాటు సిన్సియారిటీకి ప్రాధాన్యత ఇస్తున్నట్లు సమాచారం. నామినేటెడ్ పోస్టు కన్నా డిసిసి అధ్యక్ష పదవే కీలకమని ఆశావాహులు భావిస్తున్నారు. కాగా, వేణుగోపాల్‌తో సమావేశం ముగిసిన తర్వాత డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడుతూ పార్టీ సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించేందుకు తమను పార్టీ పెద్దలు పిలిచారని చెప్పారు. అందరం తమ అభిప్రాయాలను వేణుగోపాల్‌కు వివరించామన్నారు.

## వారం - వర్జ్యం

26-10-2025, ఆదివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
కార్తీకమాసం, దక్షిణాయణం
శరద్ ఋతువు, శుక్లపక్షం
పంచమి పూర్తి
జ్యేష్ఠ ఉ.10.47
వర్జ్యం : రా.12.21-2.08
దు.సా.4.04-4.50
ఉ.6.30-7.30, సా.6.30-7.00
రాహుకాలం - సా.4.30-6.00

## వార్తాఫలం

**మేషం :** సంఘంలో కీర్తి ప్రతిష్ఠలు పెరుగుతాయి. ప్రయాణాలు.

**వృషభం:** కుటుంబ విషయంలో కీలక నిర్ణయాలు తీసుకుంటారు.

**మిథునం:** స్త్రీలతో వివాదాలు లాభించవని గుర్తించండి. సోదరుల కలయిక.

**కర్కాటకం :** పారిశ్రామిక, రాజకీయరంగాలలోని వారికి అనుకూల కాలం.

**సింహం:**బంధువులతో ఏర్పడిన విభేదాలు పరిష్కారమవుతాయి. ప్రయాణాలు.

**కన్య :** ఉద్యోగాలలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు. విందు, వినోదాలు.

**తుల :** వృత్తి, వ్యాపారాలలో మార్పులు చోటు చేసుకుంటాయి. వస్తులాభం

**వృశ్చికం:** సహోద్యోగుల వలన నష్టములు వాటిల్లవచ్చు, తగు జాగ్రత్తలు పాటించింది.

**ధనుస్సు:** తప్పుకు తిరుగువాడు ధన్యుడు సుమతి అన్నారు. వివాదాలకు దూరంగా వుండండి.

**మకరం:** పెండింగ్ లోని కోర్టు వ్యవహారాలు చికాకు కలిగిస్తాయి.

**కుంభం:**అధిక శ్రమను పంచుకోవడానికి నమ్మకస్తులైన వారిని ఎన్నుకొని బాధ్యతలను అప్పగిస్తారు.

**మీనం :** జీవిత భాగస్వామి సలహాతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



హైదరాబాద్‌లోని చాదర్‌ఘాట్‌లో ఘటనాస్థలిని గురువారం పొద్దుపోయాక సందర్శించిన సిపి సజ్జనార్

# నగరంలో కాల్పులు.. ఉద్రిక్తత

>> ఓ ఇద్దరు సెల్‌ఫోన్ దొంగలు.. ఏకంగా సౌత్ ఈస్ట్ డీసీపీ చైతన్య కుమార్‌పై కత్తితో దాడి చేసేందుకు యత్నించారు. హైదరాబాద్ సీపీ కార్యాలయంలో శనివారం పోలీసు ఉన్నతాధికారులతో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ చైతన్య కుమార్ హాజరయ్యారు. సమావేశం ముగిసిన అనంతరం చైతన్య తిరిగి తన కార్యాలయానికి వస్తున్నారు. చాదర్‌ఘాట్ విక్టోరియా ప్లే గ్రౌండ్ వద్దకు రాగానే ఓ ఇద్దరు దొంగలు సెల్‌ఫోన్లను చోరీ చేసి పారిపోతున్నారు. ఆ సెల్‌ఫోన్ స్నాచర్స్‌ను గమనించిన డీసీపీ చైతన్య తన గన్‌మెన్‌ను అప్రమత్తం చేశారు. డీసీపీ, గన్‌మెన్ కలిసి ఆ ఇద్దరు దొంగలను పట్టుకునేందుకు యత్నించారు. ఈ క్రమంలో దొంగలు.. డీసీపీపై కత్తితో దాడికి యత్నించారు. దొంగలను గన్‌మెన్ అడ్డుకునేందుకు యత్నించాడు. కానీ తోపులాటలో గన్‌మెన్ కింద పడిపోయాడు. దీంతో అప్రమత్తమైన డీసీపీ చైతన్య..గన్‌మెన్ వద్ద ఉన్న వెపన్‌ను తీసుకుని దొంగలపై మూడు రౌండ్ల కాల్పులు జరిపాడు. కాల్పుల్లో మహ్మద్ ఉమర్ అన్సారీ అనే దొంగ చేయి, పొట్ట భాగంలో గాయాలయ్యాయి. తప్పించుకునే క్రమంలో నిందితుడు భవనంపై నుంచి విక్టరీ మైదానంలోకి దూకాడు. తీవ్రగాయాలతో కింద పడిపోయిన దొంగను పోలీసులు పట్టుకున్నారు. గాయాలకు గురైనవారిని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటన నేపథ్యంలో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది.

**ఘటనాస్థలిని పరిశీలించిన పోలీసు ఉన్నతాధికారులు**

కాల్పులు చోటు చేసుకున్న విక్టోరియా గ్రౌండ్ వద్ద పోలీసులు భారీగా మోహరించారు. ఘటనాస్థలిని సౌత్, సెంట్రల్ జోన్ డీసీపీలు స్నేహా మెహ్రా, శిల్పావళితో పాటు పలువురు సీఐలు, ఎస్సైలు పరిశీలించారు. దొంగతో జరిగిన తోపులాటలో డీసీపీ చైతన్య కుమార్‌కు స్వల్ప గాయాలయ్యాయి. దీంతో డీసీపి చైతన్యకు మలక్‌పేట ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు.

**రౌడీలు, స్నాచర్స్‌పై ఉక్కుపాదం మోపుతాం: సిపి సజ్జనార్**

చాదర్‌ఘాట్ కాల్పుల ఘటనలో ఇద్దరు దొంగలు గాయపడ్డారని హైదరాబాద్ సీపీ సజ్జనార్ తెలిపారు. ఘటనా స్థలిని పరిశీలించిన అనంతరం సజ్జనార్ మీడియాతో మాట్లాడారు. గాయపడి, పోలీసులకు చిక్కిన దొంగ ఉమర్‌పై 25 కేసులతో పాటు రౌడీషీట్ ఉందని సీపీ తెలిపారు. దొంగలను పట్టుకునే క్రమంలో డీసీపీ చైతన్య రెండు రౌండ్లు కాల్పులు జరిపారని చెప్పారు. సెల్ఫోన్ చోరీ చేసి పారిపోతున్న ఇద్దరు దొంగలను డీసీపీ చైతన్య, ఆయన గన్ మ్యాన్ గమనించి పట్టుకునేందుకు ప్రయత్నించారు. దొంగలు.. గన్‌మ్యాన్‌పై కత్తితో దాడికి పాల్పడ్డారు. ఈక్రమంలో గన్‌మ్యాన్, డీసీపీ చైతన్య కింద పడిపోయారు. వెంటనే తేరుకున్న డీసీపీ, గన్‌మెన్ దొంగలపై కాల్పులు జరిపారు. ఈ ఘటనలో ఇద్దరు దొంగలు గాయాలు కాగా, మరోకడు తప్పించుకొని పారిపోయాడు. గాయపడిన మహ్మద్ ఉమర్ అన్సారీ అనే దొంగకు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆసుపత్రికి తరలించామని, డిసిపి చైతన్య స్వల్ప అస్వస్థతకు గురయ్యారని వెల్లడించారు.గాయపడిన కానిస్టేబుల్ ఆస్పత్రిలో క్షేమంగా ఉన్నారని తెలిపారు.నిందితుడు మహ్మద్ ఉమర్ అన్సారీపై రెండు సార్లు పీడీ చట్టం కింద కేసులు నమోదయ్యాయి. 2016లో కామాటిపురా పోలీస్‌స్టేషన్‌లో నమోదైన పీడీ యాక్టు కేసులో ఏడాది జైల్లో ఉన్నాడు. 2020లో హుస్సేనీఆలమ్ పోలీస్‌స్టేషన్‌లో పీడీ యాక్ట్ కేసులో ఏడాదిపాటు చంచల్‌గూడ జైల్లో ఉండి బయటకు వచ్చిన తర్వాత కూడా ఉమర్ ప్రవర్తన మారలేదు. ఆ తర్వాత కాలాపత్తర్ పోలీస్‌స్టేషన్‌లో రెండు కేసులు నమోదయ్యాయి" అని సీపీ సజ్జనార్ తెలిపారు. పరారీలో ఉన్న మరో నేరస్తుడి కోసం గాలిస్తున్నామని తెలిపారు.ఈ ఘటనపై పూర్తి స్థాయిలో సమగ్ర దర్యాప్తు చేస్తామని ఉద్ఘాటించారు. మహ్మద్ ఉమర్ అన్సారీపై ఉన్న కేసులు, నేరాలు, అతనికి సహకరిస్తున్న వారిని గుర్తిస్తామని పేర్కొన్నారు. రౌడీలు, స్నాచర్స్ పై ఉక్కుపాదం మోపుతామని సీపీ సజ్జనార్ హెచ్చరించారు.

## రూ.4.9 కోట్ల బ్యాంకు ఫ్రాడ్ కేసులో

# ఏడుగురికి జైలు శిక్ష

## హైదరాబాద్ సిబిఐ కోర్టులో విచారణ, 20 యేళ్ల తర్వాత తీర్పు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబరు25:** హైదరాబాద్‌లోని కార్పొరేషన్ బ్యాంకులో సుమారు రూ.4.9 కోట్ల మోసానికి సంబంధించిన కేసులో సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం కీలక తీర్పు వెలువరించింది. బ్యాంకు మాజీ సీనియర్ మేనేజర్‌తో సహా ఏడుగురిని దోషులుగా నిర్ధారించి, వారికి జైలు శిక్ష విధించింది. ఈ విషయాన్ని సీబీఐ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. వివరాల్లోకి వెళితే... కార్పొరేషన్ బ్యాంక్ బంజారాహిల్స్ బ్రాంచ్‌లో అప్పటి సీనియర్ మేనేజర్‌గా పనిచేసిన టి. చంద్రకాంత్‌కు రెండేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.20,000 జరిమానా విధించారు. ఈ కేసులో రుణాలు పొందిన ప్రైవేటు వ్యక్తులైన వి.ఎన్.ఎస్.సి. బోస్, వి. రాజశ్రీ, కొండా శేఖర్ రెడ్డి, ఎన్.వి.పి. నంద కిశోర్, హెచ్. రాజశేఖర్ రెడ్డిలకు ఏడాది చొప్పున కఠిన కారాగార శిక్ష, రూ.55,000 జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు చెప్పింది. నకిలీ, కల్పిత పత్రాల ఆధారంగా రూ.4.9 కోట్ల విలువైన గృహ రుణాలను మంజూరు చేసి బ్యాంకును మోసం చేశారన్న ఆరోపణలపై సీబీఐ 2004 సెప్టెంబర్ 29న చంద్రకాంత్‌తో సహా 16 మందిపై కేసు నమోదు చేసింది. లోతైన విచారణ జరిపిన సీబీఐ, 2007 మార్చి 30న చంద్రకాంత్‌తో పాటు మరో 11 మందిపై ఛార్జిషీట్ దాఖలు చేసింది. నిందితులందరూ కుమ్మక్కై, బ్యాంకింగ్ నిబంధనలను ఉల్లంఘించి, తమ అధికారిక హోదాలను దుర్వినియోగం చేస్తూ తప్పుడు పత్రాలతో రుణాలు పొంది బ్యాంకుకు నష్టం కలిగించారని విచారణలో తేలింది. రెండు దశాబ్దాలకు పైగా సాగిన సుదీర్ఘ విచారణ అనంతరం, హైదరాబాద్‌లోని సీబీఐ కేసుల ప్రత్యేక న్యాయమూర్తి ఈనెల 24న తీర్పు వెలువరించి ఏడుగురిని దోషులుగా తేల్చారు. కాగా, ఘజియాబాద్‌లోని సీబీఐ ప్రత్యేక కోర్టు కూడా అక్టోబర్ 18న మరో బ్యాంకు మోసం కేసులో తీర్పు ఇచ్చింది. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నోయిడా ఎస్ఎస్ఐ బ్రాంచ్ మేనేజర్ మనోజ్ శ్రీవాస్తవకు నాలుగేళ్ల జైలు శిక్ష, రూ.30,000 జరిమానా విధించింది. 2007-09 మధ్యకాలంలో తన పదవిని దుర్వినియోగం చేసి బ్యాంకుకు నష్టం కలిగించారనే ఆరోపణలపై 2010లో ఆయనపై కేసు నమోదైంది.

# మద్యం టెండర్ల 'డ్రా'కు అనుమతి ఇచ్చిన హైకోర్టు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబరు25:** తెలంగాణ మద్యం టెండర్ల అంశంపై హైకోర్టులో వాదనలు ముగిశాయి. ఈ మేరకు కోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. టెండర్ల గడువు ఏ నిబంధన ప్రకారం పొడిగించారో చెప్పాలని హైకోర్టు ఆదేశించింది. వాదనలో భాగంగా టెండర్ల పొడిగింపుపై లిఖితపూర్వక వాదనలు ఇస్తామని అదనపు అడ్వకేట్ జనరల్ కోర్టుకు తెలిపారు. మద్యం టెండర్లకు సోమవారం యథావిధిగా డ్రా తీయవచ్చని కోర్టు పేర్కొంది. తుది తీర్పునకు లోబడే మద్యం దుకాణాల లైసెన్స్ కేటాయించాలని ఆదేశించింది. ఈ మేరకు ఈనెల 27న(సోమవారం) మద్యం టెండర్ల డ్రా నిర్వహణకు ఎక్సైజ్ శాఖ ఏర్పాట్లు చేస్తుంది. ఆ రోజు ఉదయం 11 గంటలకు జిల్లాల వారీగా డ్రా నిర్వహణ ప్రారంభం కానుంది. టెండర్ల గడువు పొడిగింపును సవాల్ చేస్తూ ఐదుగురు వ్యాపారులు న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. ఈ మేరకు విచారణ చేపట్టిన న్యాయస్థానం తీర్పును రిజర్వ్ చేసింది.

# ఇంటర్ వార్షిక పరీక్షలు

>> మార్పులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. పలు సంస్కరణలపై కీలక నిర్ణయం తీసుకున్నారు. వాటికి సంబంధించిన వివరాలను ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామ్స్(సీవోఈ) జయప్రద బాయి, జాయింట్ సెక్రటరీలు భీం సింగ్, జ్యోత్స్న రాణి, వసుంధరతోపాటు రమణకుమార్ కలిపి మీడియాకు వివరించారు. ఇకపై ఇంటర్మీడియట్‌లో థియరీ పరీక్షలను 80 మార్కులకే నిర్వహించనున్నారు. మిగిలిన 20 మార్కులను ఇంటర్నల్స్‌గా నిర్వహించనున్నారు. సబ్జెక్టులతోపాటు లాంగ్వేజెస్‌కి కూడా ఇదే విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించారు. ఇందుకఉ సంబంధించి సిలబస్‌లోనూ మార్పులు చేయనున్నారు. సిలబస్ మార్పులకు సంబంధించిన సబ్జెక్టుల నిపుణులతో నవంబర్ 1 నుంచి డిసెంబర్ 15 వరకు 45 రోజులపాటు కసరత్తు చేసి సిలబస్‌ను రూపొందించనున్నట్లు తెలిపారు. కొత్త సిలబస్‌కి సంబంధించిన పుస్తకాల ముద్రణను ఏప్రిల్ నెలాఖరు, మే మొదటి వారంలోగా పూర్తి చేసి విద్యార్థులకు పుస్తకాలను అందుబాటులోకి తీసుకురానున్నట్టు తెలిపారు. ఇప్పటి వరకు సెకండియర్ సైన్స్ విద్యార్థులకు మాత్రమే ప్రాక్టికల్ పరీక్షలను నిర్వహిస్తూ వస్తున్నారు. ఇకపై వచ్చే ఏడాది నుంచి మొదటి సంవత్సరం సైన్స్ విద్యార్థులకు కూడా ప్రాక్టికల్ పరీక్షలను నిర్వహించనున్నారు. ఇప్పటి వరకు అమలు చేసిన 30 మార్కులను మొదటి సంవత్సరంలో 15 మార్కులకు, రెండో సంవత్సరంలో 15 మార్కులకు ప్రాక్టికల్ పరీక్షలను నిర్వహిస్తారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బొటనీ, జువాలజీ సబ్జెక్టులకు ప్రాక్టికల్స్‌ను నిర్వహిస్తారు. ప్రస్తుతం ఇంగ్లీష్‌కి మాత్రమే అంతర్గత పరీక్షలు నిర్వహిస్తున్న నేపథ్యంలో వచ్చే ఏడాది నుంచి సంస్కృతం, తెలుగు, గణితం, ఇతర ఆర్ట్స్, కామర్స్ అన్ని సబ్జెక్టులకు ఇంటర్నల్ మార్కులు ఉంటాయి. కొత్తగా అకౌంటెన్సీ, కామర్స్, ఎకనామిక్స్(ఏసీఈ) గ్రూపును ప్రవేశపెట్టనున్నారు. వచ్చే ఏడాది నుంచి ఎంఈసీ గ్రూప్ విద్యార్థులకు సపరేట్‌గా మ్యాథ్స్(గణితం) ప్రశ్నాపత్రాన్ని రూపొందించాలని నిర్ణయించారు. ఇప్పటి వరకు ఎంపీసీ విద్యార్థులకు, ఎంఈసీ విద్యార్థులకే ఒకేరకమైన గణితం ప్రశ్నాపత్రాన్ని అమలు చేస్తుండగా.. వచ్చే ఏడాది నుంచి ఇందులో మార్పులు చేసి.. ఎంపీసీ విద్యార్థులకు వేరుగా.ఎంఈసీ విద్యార్థులకు వేరేగా ప్రశ్నాపత్రాన్ని రూపొందించాలని నిర్ణయించారు. వచ్చే ఏడాది నుంచి సిలబస్‌లోనూ మార్పులు తీసుకురానున్నారు. 2013-14లో గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బొటనీ, జువాలజీ సబ్జెక్టుల సిలబస్ మార్పు చేయగా.. 12 సంవత్సరాల తరువాత సైన్స్ సబ్జెక్టుల్లో మార్పులు చేస్తున్నారు. 2019-20లో హ్యుమానిటీస్ సబ్జెక్టుల్లో మార్పులు చేయగా 6 సంవత్సరా తరువాత ఇప్పుడు చేస్తున్నామని, అలాగే 2020-21 లాంగ్వేజెస్ సిలబస్‌లో మార్పులు చేయగా నాలుగేళ్ల తరువాత ఇపుడు మరోసారి సిలబస్‌లో మార్పులు చేస్తున్నట్టు తెలిపారు. ఈ ఏడాది 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఇంటర్ వార్షిక పరీక్షలను వచ్చే ఏడాది ఫిబ్రవరి 25 నుంచి ప్రారంభించాలని నిర్ణయించినట్టు ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య తెలిపారు. ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18 వరకు ఇంటర్ వార్షిక పరీక్షలు జరగనున్నాయి. ప్రాక్టికల్ పరీక్షలను ఫిబ్రవరి 3 నుంచి 20 వరకు నిర్వహించనున్నారు.

దక్షిణ మధ్య రైల్వే
Follow us on @SCRailwayindia
మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in పై ద.మ. రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను చూడవచ్చును.
టెండర్ నం. Y/SG/36/2025-26/22
తేది: 24.10.2025
భారత రాష్ట్రపతి తరపున సీనియర్ డివిజనల్ సిగ్నల్ & టెలికాం ఇంజనీర్, హైదరాబాద్ డివిజన్, దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్ వారు క్రింది పనులకు తేది 26.11.2025యొక్క 11.30 గం. వరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా బహిరంగ టెండర్లు కోరుతున్నారు.
క్ర.సం.: 01, టెండర్ నం.: Y/SG/36/2025-26/22, పని పేరు: హైదరాబాద్ డివిజన్ 1) IRISET వద్ద కంటెంట్ మేనేజ్‌మెంట్ శిక్షణ మరియు కోర్సుల డిజిటైజేషన్, IT మౌలిక సదుపాయాల పెంపుదల & 2) IRISET- పునర్నిర్మాణం మరియు టెలికాం ల్యాబ్స్ యొక్క అభివృద్ధిలు అనగా ప్రసారం, అవుట్‌డోర్ టెలికాం కంట్రోల్, ప్రయాణీకుల సౌకర్యాలు మరియు PA ల్యాబ్స్, సుమారు విలువ (రూ): 49269974.25, బయానా (రూ): 396400.
సీనియర్ డివిజనల్ సిగ్నల్ & టెలికాం ఇంజనీర్, హైదరాబాద్
A1693
PUB/1342
తదుపరి టెండరు నిబంధనలు/వివరములు మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్‌కు, దయచేసి వెబ్‌సైట్లు https://ww.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in చూడవచ్చును.

## వాణిజ్య ప్రయోజనాల కోసం చిరంజీవి పేరు, ఫొటోలు వాడొద్దు: సిటీ సివిల్‌కోర్టు



వాటి దుర్వినియోగంపై సిటీ సివిల్‌కోర్టును ఆశ్రయించిన మెగాస్టార్ చిరంజీవి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు 25:** ఏఐ వచ్చిన తరువాత సినిమా తారలు, ప్రముఖుల పేర్లు, గాత్రాలు, ఫొటోలు మార్ఫ్ చేస్తూ, వాటిని దుర్వినియోగం చేయడం పరిపాటి అయిపోయింది. ఈ నేపథ్యంలో పలువురు అగ్రనటులు న్యాయ స్థానాలను ఆశ్రయిస్తున్నారు. వారిలో అమితాబ్ బచ్చన్, రజనీకాంత్, నాగార్జున నుంచి ఐశ్వర్య రాయ్ వరకు ఎంతో మంది ఉన్నారు. తాజాగా అగ్రనటుడు చిరంజీవి సిటీ సివిల్ కోర్టును ఆశ్రయించారు. దీనితో ఆయనకు అనుకూలంగా న్యాయస్థానం తీర్పు వెలువరించింది. చిరంజీవి పేరు, ఫొటోలు అనుమతి లేకుండా వాడకూడదని ఆదేశించింది. ముఖ్యంగా చిరంజీవి పేరును వాణిజ్య ప్రయోజనాల కోసం వాడకూడదని కోర్టు స్పష్టం చేసింది. తదుపరి విచారణను అక్టోబర్ 27కు వాయిదా వేసింది. అంతేకాదు మెగాస్టార్, చిరు, అన్నయ్య పేర్లతో ఏఐ మార్ఫింగ్ డిజిటల్ వేదికలపై కోర్టు ఆంక్షలు విధించింది. ఈటీవీ, లాభాల కోసం చిరంజీవి పేరును దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. ఇప్పటికే చిరంజీవి పేరును, ఫొటోలు దుర్వినియోగం చేసిన 30 మందికి కోర్టు నోటీసులు జారీ చేసింది. ఏఐ మార్ఫింగ్, వాయిస్ సింథసైజ్‌తో తమ ప్రతిష్ఠ దెబ్బతింటోందని నటీనటులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా తమ పేరు ప్రఖ్యాతులకు భంగం కలుగుతోందని, ఆర్థికంగానూ నష్టపోతున్నామని వాపోతున్నారు. అందుకే పలువురు నటీనటులు దీనిని అరికట్టేందుకు న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నారు. ఇటీవల సీపీ సజ్జనార్‌ను కలిసిన చిరంజీవి, ఏఐ మార్ఫింగ్ గురించి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఇంతకు ముందు హిందీ అగ్ర నటీనటులు అమితాబ్‌బచ్చన్, అభిషేక్‌బచ్చన్, ఐశ్వర్యరాయ్‌బచ్చన్, అక్షయ్ కుమార్, హృతిక్‌రోషన్, కరణ్‌జోహార్, ఆశాభోస్లే కూడా ఇదే విషయంగా న్యాయస్థానాలు ఆశ్రయించారు. ఇక దక్షిణాది తారల విషయానికొస్తే ఇంతకుముందు అక్కినేని నాగార్జున, తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ కూడా ఇదేవిషయంగా కోర్టును ఆశ్రయించారు.



## తెలంగాణ లేజిస్లేచర్ స్టాండింగ్ కౌన్సిల్‌గా హైకోర్టు అడ్వొకేట్ తులసిరాజ్ గోకుల్ నియామకం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు 25:** తెలంగాణ లేజిస్లేచర్ స్టాండింగ్ కౌన్సిల్‌గా హైకోర్టు అడ్వొకేట్ తులసిరాజ్ గోకుల్ నియామకం అయ్యారు. వికారాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన తులసిరాజ్ గోకుల్ నిజాం కాలేజీ నుండి గ్రాడ్యుయేషన్‌ను, పడాల రామిరెడ్డి లా కాలేజీలో న్యాయ విద్యను పూర్తి చేశారు. 30 సంవత్సరాలుగా న్యాయవాదిగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ హైకోర్టుల్లో ప్రాక్టీస్ చేస్తున్నారు. రాజ్యాంగబద్ధమైన, శాసన వ్యవహారాల్లో నిష్ణాతుడుగా తులసిరాజ్ గోకుల్ అందరికీ సుపరిచితులు. లేజిస్లేచర్ స్టాండింగ్ కౌన్సిల్‌గా బాధ్యతలను స్వీకరించిన తులసిరాజ్ గోకుల్ శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్‌ను, శాసనపరిషత్ చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా తులసిరాజ్ గోకుల్‌కు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, లేజిస్లేటివ్ సెక్రటరీ వి.నరసింహాచార్యులు అభినందనలు తెలిపారు. హైకోర్టు న్యాయవాదిగా తులసిరాజ్ గోకుల్ అనుభవం, సలహాలు లేజిస్లేటివ్ పాలనా వ్యవహారాల్లో ఉపయోగపడతాయని తెలిపారు.

## సహకార రంగం నుంచే భారత్ ట్యాక్సీ ఆరంభం!

**న్యూఢిల్లీ, అక్టోబరు 25:** దేశంలో క్యాబ్ సేవల రంగంలో గుత్తాధిపత్యం చెలాయిస్తున్న ఓలా, ఉబర్‌లకు గట్టి పోటీ ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. భారత్ ట్యాక్సీ పేరుతో సహకార పద్ధతిలో ఓ సరికొత్త రైడ్ హెయిలింగ్ సర్వీస్‌ను అందుబాటులోకి తీసుకురానుంది. డ్రైవర్ల నుంచి ఎలాంటి కమీషన్లు వసూలు చేయకుండా, కేవలం సభ్యత్వ రుసుముతోనే ఈ సేవలు అందిస్తుంది. ప్రస్తుతం ఓలా, ఉబర్ సంస్థలు డ్రైవర్ల నుంచి ప్రతీ రైడ్‌పై 25 శాతం వరకు అధిక కమీషన్లు వసూలు చేస్తున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. అంతేకాకుండా, రద్దీ సమయాలు, ట్రిప్ రద్దుల పేరుతో ప్రయాణికులపై కూడా అధిక చార్జీల భారం మోపుతున్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ సమస్యలకు పరిష్కారంగా, డ్రైవర్లు, ప్రయాణికులు ఇద్దరికీ ప్రయోజనం చేకూర్చే లక్ష్యంతో కేంద్రం ఈ కొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. కేంద్ర సహకార శాఖ, జాతీయ ఈగవర్నెన్స్ విభాగం కలిసి భారత్ ట్యాక్సీని రూపొందించాయి. దీని కోసం రూ.300 కోట్ల మూలధనంతో సహకార్ ట్యాక్సీ కోఆపరేటివ్ లిమిటెడ్ అనే సంస్థను ఏర్పాటు చేశారు. ఈ విధానంలో డ్రైవర్లు కమీషన్లకు బదులుగా రోజువారీ లేదా నెలవారీ సభ్యత్వ రుసుము చెల్లిస్తే సరిపోతుంది. దీనివల్ల ప్రయాణ చార్జీలు పూర్తిగా వారికే దక్కుతాయి. ఈ సేవలను తొలుత పైలట్ ప్రాజెక్ట్‌గా నవంబర్ నుంచి ఢిల్లీలో 650 క్యాబ్‌లతో ప్రారంభించనున్నారు. ఆ తర్వాత డిసెంబర్‌లో ముంబై, పుణె, భోపాల్, జైపూర్ వంటి 20 నగరాలకు విస్తరిస్తారు. వచ్చే ఏడాది మార్చి నాటికి దేశంలోని అన్ని ప్రధాన నగరాల్లో భారత్ ట్యాక్సీని అందుబాటులోకి తీసుకురావాలని ప్రణాళికలు సిద్ధం చేశారు. 2030 నాటికి దేశవ్యాప్తంగా లక్ష మంది క్యాబ్ డ్రైవర్లను ఈ ప్లాట్‌ఫామ్‌తో అనుసంధానం చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.




### ప్రజాపాలనలో మేం ఏంచేశామో..

## పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో మీరేం చేశారో చర్చకు సిద్ధమా?

చర్చకు మాజీ సీఎం వస్తే.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రెడీ

నువ్వు వస్తే నేనూ వస్తా.. హరీశ్‌రావుకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ సవాల్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి వచ్చిన తర్వాత ప్రజాపాలనలో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజలకు మేమేమి చేశామో ఈ 10 యేండ్ల బిఆర్ఎస్ పాలనలో మీరేమి చేశారో చర్చకు సిద్ధమాని రాష్ట్ర సాంఘీక, గిరిజన, మైనార్టీ, సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్.. మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావుకు సవాల్ విసిరారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని మోహినిపురా శ్రీ వెంకటేశ్వరస్వామిని శనివారం దర్శించుకొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన టిపిసిసి చేనేత విభాగం చైర్మన్, మాజీ ఎంపిపి చైర్మన్ గూడూరి శ్రీనివాస్, టిపిసిసి సభ్యులు దరిపల్లి చంద్రంతో కలిసి విలేకరులతో మాట్లాడారు. హైదరాబాద్‌లోని 123 అడుగుల రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం ఎదుట చర్చపెడదాం చర్చకు మాజీ సిఎం వస్తే మా సిఎం రేవంత్‌రెడ్డి వస్తారని లేదా నీవు వస్తానంటే నేను వస్తాను సవాల్ విసిరారు. రాష్ట్ర కేబినెట్‌లో జరగని అంశాన్ని జరిగినట్లు అవహేళన చేస్తూ రాష్ట్ర మంత్రి వర్గాన్ని దండుపాళ్యం అని పోల్చుకుంటూ వ్యాఖ్యాలు చేయడం సిగ్గుచేటన్నారు. రాష్ట్ర కేబినెట్‌ను దండుపాళ్యంగా పోల్చుకుంటు హరీశ్‌రావు వ్యాఖ్యాలు చేయడం ఆయన విజ్ఞతకే వదిలివేస్తున్నామని తెలిపారు. హరీశ్‌రావు ఎమ్మెల్యేగా గెలుపకున్న కాంగ్రెస్ ప్రభుత్వం నిన్ను మంత్రిగా చేసిన విషయాన్ని మర్చిపోయావని ప్రశ్నించారు. అధికారంలో కోల్పోయిన 20 నెలల్లోనే హరీశ్‌రావు అక్కసు విషయం కక్కడం ఎందుకని ప్రశ్నించారు. 10 యేండ్లు అధికారంలో ఉండి ప్రజలకు ఒరగబెట్టిందేమి లేదని కాళేశ్వరం పేరిట వేసిన ఆర్థిక భారానికి కాంగ్రెస్ సర్కారు అప్పులు, మిత్తి కంటుకుంటూ పేదలకు రేషన్ కార్డులు, సన్న బియ్యం, ఇందిరమ్మ ఇండ్లు, 200 యూనిట్ల ఉచిత కరెంటు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తదితర సంక్షేమ పథకాలను అమలు చేయడం జరుగుతుందన్నారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసి తీరుతుందన్నారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల అమలులో కేంద్ర మంత్రులు పట్టించుకోవడం లేదన్నారు. హరీశ్‌రావు నీ భజన పరులతో నాపై అనుచిత వ్యాఖ్యాలు చేయించడం సిగ్గుచేటన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు గంప మహేందర్‌రావు, సాకి అనంద్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.




మీడియాతో మాట్లాడుతున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్

## కెనడాతో అన్ని వాణిజ్య చర్చలు రద్దు చేసిన ట్రంప్!



**ఒంటారియో, అక్టోబరు 25:** అమెరికా టారిఫ్స్ వ్యతిరేకిస్తూ కెనడా ఇచ్చిన ప్రకటనలు ట్రంప్‌ను ఆగ్రహానికి గురిచేసాయి. సుంకాలను వ్యతిరేకించే ప్రకటనల ప్రచారంలో మాజీ అధ్యక్షుడు రోనాల్డ్ రీగన్‌ను తప్పుగా చూపించారని ట్రంప్ ఆరోపించారు. ఈ యాడ్‌తో యూఎస్ కోర్టు తీర్పులను ప్రభావితం చేయడానికి ఉద్దేశించారని తప్పు పట్టారు. అందుకే కెనడాతో అన్ని వాణిజ్య చర్చలను రద్దు చేస్తున్నట్లు చెప్పారు. కెనడా మోసపూరితంగా టారిఫ్‌లకు వ్యతిరేకంగా ఒక ప్రకటనను చేసిందని రొనాల్డ్ రీగన్ ఫౌండేషన్ ప్రకటించింది. ఆ యాడ్ ఫేక్. అందులో అమెరికా మాజీ అధ్యక్షుడు రొనాల్డ్ రీగన్ టారిఫ్‌ల గురించి ప్రతికూలంగా మాట్లాడుతున్నట్లు ఉంది. అమెరికా సుప్రీంకోర్టు, ఇతర కోర్టుల నిర్ణయంలో జోక్యం చేసుకోవడానికి మాత్రమే కెనడా ఇలా చేసింది. అమెరికా జాతీయ భద్రత, ఆర్థిక వ్యవస్థకు సుంకాలు చాలా ముఖ్యమైనవి, వారు దారుణమైన ప్రవర్తన కారణంగా కెనడాతో అన్ని వాణిజ్య చర్చలు రద్దు చేసుకుంటున్నామని ట్రంప్ సోషల్ ట్రూత్ వేదికగా ప్రకటించారు. కెనడాలోని ఒంటారియో ప్రావిన్స్ ట్రంప్ టారిఫ్స్‌కు వ్యతిరేకంగా ప్రచారం ప్రారంభించింది. అందుకు ఒంటారియో ప్రావిన్స్ 75 మిలియన్ డాలర్లు ఖర్చు చేసింది. అయితే ఈ ఏడాది అక్టోబర్ 7న అమెరికా అధ్యక్షుడు ట్రంప్, కెనడా ప్రధాని మార్క్ కార్నీ ఇరుదేశాల మధ్య వాణిజ్యం, సరిహద్దు భద్రత గురించి చర్చలు జరిపారు. అయితే ఆ చర్చలు జరిగిన రెండు వారాల తర్వాత కెనడాతో అన్ని వాణిజ్య చర్చలను రద్దు చేస్తున్నట్లు ట్రంప్ ప్రకటించడం గమనార్హం.

### మహిమ గల చెంబు అంటూ

## వైద్యురాలి నుంచి రూ.1.50 కోట్లు కాజేసిన కేటుగాళ్లు

**హైదరాబాద్, అక్టోబరు 25, ప్రభాతవార్త:** ఓ వైద్యురాలిని నిలువునా మోసం చేశారు. తమ వద్ద మహిమ గల చెంబు ఉందంటూ.. వైద్యురాలి నుంచి రూ. 150 కోట్లు కాజేశారు కేటుగాళ్లు. ఈ ఘటన హైదరాబాద్ నగరంలో వెలుగు చూసింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ముగ్గురు వ్యక్తులు.. హైదరాబాద్‌కు చెందిన ప్రియాంక అనే వైద్యురాలిని సంప్రదించారు. తమ వద్ద రూ. 30 కోట్లు విలువ చేసే మహిమ గల చెంబు ఉందని, దాంట్లో డబ్బులు వేస్తే రెట్టింపు అవుతాయని నమ్మబలికారు. ఆమె కూడా వారి మాటలను నమ్మింది. దీంతో ఆ ముగ్గురు వ్యక్తులకు వైద్యురాలు రూ. 1.50 కోట్లు ఇచ్చింది. డబ్బు రెట్టింపుపై ప్రశ్నిస్తే వారి నుంచి సమాధానం లేదు. ఆరు నెలల గడుస్తున్నా వారి నుండి ఎటువంటి స్పందన లేకపోవడంతో, మోసపోయానని గ్రహించిన వైద్యురాలు ప్రియాంక పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.2,42,400 నగదు, కారు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను విశాఖపట్నం అరకులోయకు చెందిన పెందుర్తి శ్రీనివాస్, వనుము శ్రీనివాస్, కొర్రా బంగారాజుగా పోలీసులు గుర్తించారు.



## వీకెండ్ పార్టీపై కాల్పులు.. ఇద్దరు మృతి

### 13 మందికిపైగా తీవ్రగాయాలు

**నార్త్‌కరోలినా, అక్టోబరు 25:** అమెరికాలోని నార్త్ కరోలినా ఆగ్నేయప్రాంతంలో తుపాకీపేలుళ్లు భయాందోళనలు రేకెత్తించాయి. ఇద్దరు చనిపోగా మరో 11మంది తీవ్రగాయాల పాలయ్యారు. అనేక మంది ఇప్పటికీ విషమపరిస్థితుల్లోనే ఉన్నట్లు అధికారులు తెలిపారు. సౌత్‌కరోలినా సరిహద్దులోని మాక్స్‌టన్‌లో ఈ సంఘటన జరిగింది. నార్త్‌కరోలినా రోబెసన్ కౌంటీ షరీఫ్ బర్నిస్ విల్కిన్స్ మాట్లాడుతూ 13మందికిపైగా తుపాకీ బుల్లెట్లు తగిలాయన్నారు. హోమిసైడ్ దర్యాప్తు అధికారులు, మరికొందరు ఘటన ప్రాంతానికి వెళ్లామని మాక్స్‌టన్ శివార్లలో వీకెండ్‌పార్టీ జరుగుతోందని, అప్పుడే ఈ కాల్పులుజరిగినట్లు తెలిపారు. ఈ ఘటన జరగ్గానే 150 మందికిపైగా అక్కడ గుమికూడిన ప్రజలు పారిపోయారు. ఈ కాల్పులపై మరింత సమాచారం సేకరిస్తున్నామని పూర్తివివరాలు తర్వాత తెలియజేస్తామని కౌంటీ షరీఫ్ వెల్లడించారు. నార్త్‌కరోలినా, సౌత్‌కరోలినా సరిహద్దుల్లో తరచూ ఈ వీకెండ్‌పార్టీలు జరుగుతుంటాయి.

## సర్కార్‌కు జాతీయ ఎస్సీ కమిషన్ నోటీసులు

**హైదరాబాద్, అక్టోబరు 25, ప్రభాతవార్త :** జాతీయ షెడ్యూల్డ్ కాస్ట్ కమిషన్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి నోటీసులు జారీచేసింది. దౌర్జన్యాలు అత్యాచారాల నిరోధక చట్టం కింద షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల బాధితులకు నగదు సహాయం చెల్లించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. తాము ఇచ్చిన ఫార్మాట్‌లో బాధితుల వివరాలను, అందించిన సహాయాన్ని నోటీసు అందు కున్న 15 రోజుల్లోగా ఎన్‌సీఎస్‌సీ పోర్టల్/ పోస్ట్/ఈమెయిల్, లేదా వ్యక్తిగతంగా సమర్పించాలని ఆదేశించింది.

## పెద్దఅంబర్‌పేట ఔటర్‌పై తప్పిన ఘోరప్రమాదం

### అదుపుతప్పి బోల్తా పడిన ప్రైవేటు బస్సు

### ఎనిమిది మందికి గాయాలు

**హైదరాబాద్ (అబ్దుల్లాపూర్‌మెట్), అక్టోబరు 25, ప్రభాతవార్త :** బెంగళూరు జాతీయ రహదారిపై కర్నూల్ వద్ద జరిగిన ఘోర రోడ్డుప్రమాదం సంఘటన మరవకముందే నగర శివారులోని ఔటర్‌రింగ్ రోడ్డుపై మరో ప్రైవేటుబస్సు ప్రమాదానికి గురైంది. ఆర్టీఓ అధికారులు ఓ పక్కన ప్రైవేటు వాహనాల తనిఖీలను ముమ్మరంగా చేస్తుండగానే ఎనిమిది మంది ప్రయాణికులతోపాటు ఓ క్లీనర్, ఇద్దరు డ్రైవర్లతో కలిసి నగరం నుంచి గుంటూరుకు బయలుదేరిన బస్సు పెద్దఅంబర్‌పేట టోల్‌గేటుకు సమీపంలోకి రాగానే అదుపుతప్పి రోడ్డుకు చివరగా బిగించిన ఇనుప గోడలను ఢీకొట్టి బోల్తాపడింది. అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం....ఏపీలోని గుంటూరు, ఇతర ప్రాంతాలకు చెందిన షేక్ జాహిర్, ఆకుల గాయత్రి, కాస్తిక్ సుభాష్, ఎ. ప్రభాకర్, మోనిక, ప్రత్యూషలతో కలిసి బస్సు డ్రైవర్ ఆంజనేయరెడ్డి, మరో డ్రైవర్ శ్రీనివాస్‌తో పాటు ఓ కండక్టర్‌లు హైదరాబాద్ మియాపూర్ నుంచి ఓ ప్రైవేటు బస్సు (ఏపీ39 యూపీ 1963)లో 6 మంది ప్రయాణికులతో శనివారం ఉదయం 10.30లకు ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరుకు ఔటర్‌రింగ్‌రోడ్డు మీదుగా బయలుదేరారు.

మార్గమధ్యంలో పెద్దఅంబర్‌పేట ఔటర్‌రింగ్‌రోడ్డు టోల్‌ప్లాజాకు అతిసమీపంలోకి రాగానే వీరు ప్రయాణిస్తున్న బస్సు అదుపుతప్పి రోడ్డుకు చివరన అమర్చిన ఇనుప కంచెను ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ఘటన లో షేక్ జాహిర్, ఆకుల గాయత్రి, కాస్తిక్ సుభాష్, ఎ. ప్రభాకర్‌లకు తీవ్రగాయాలు, మోనిక, ప్రత్యూషలతోపాటు బస్సుడ్రైవర్ ఆంజనేయరెడ్డి, మరోడ్రైవర్ శ్రీనివాస్‌లకు స్వల్ప గాయాలు కావడంతో టోల్‌ప్లాజా సిబ్బంది, స్థానిక పోలీసుల సహాయంతో క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రులకు తరలించారు. ఔటర్‌పై ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అబ్దుల్లా పూర్‌మెట్ పోలీసులు, వన స్థలిపురం ట్రాఫిక్ పోలీసులు, ఫైర్‌సిబ్బంది క్రేన్ల సహాయంతో బోల్తా పడిన బస్సును బయటకు తీశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.




క్రేన్‌ల సహాయంతో బస్సును తీస్తున్న దృశ్యం

## అప్పల రాష్ట్రాలుగా టిజి, ఎపి

**హైదరాబాద్, అక్టోబరు 25, ప్రభాతవార్త :** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజలు అప్పుల ఊబిలో కూరుకుపోయినట్టు కేంద్ర గణాంకాలు వెల్లడిస్తున్నాయి. దేశంలోనే తొలి రెండు స్థానాల్లో వరుసగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు నిలిచాయి. కేంద్ర మంత్రిత్వ శాఖకు చెందిన నేషనల్ శాంపిల్ సర్వే ఆఫీస్ విడుదల చేసిన తాజా సర్వేలో తేలింది. 2020-21 లెక్కల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో 43.7 శాతం మంది, తెలంగాణలో 37.2 శాతం మంది అప్పులపై ఆధారపడినట్లు నివేదిక వెల్లడించింది. అలాగే కర్ణాటకలో 15 ఏళ్లకు పైబడిన జనాభాలో బ్యాంకింగ్ వ్యవస్థకు అనుసంధానం (ఫైనాన్షియల్ ఇంక్లూజన్) (95.9) కాగా, ఆ తర్వాత 92.3 మందితో ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో ఉంది. కర్ణాటకలో 23.2 మందిపైనే అప్పుల భారం ఉండగా, తెలంగాణలో 86.5 మందే ఫైనాన్షియల్ ఇంక్లూజన్ పరిధిలో ఉన్నారు.

## గృహహింస కేసులో తిరుపతికి చెందిన ఎన్నారై కాలిఫోర్నియాలో అరెస్టు



**కాలిఫోర్నియా, అక్టోబరు 25:** కాలిఫోర్నియాలో గృహ హింస కేసులో తిరు పతికి చెందిన ఎన్నారై జెస్వంత్ మనికొండ (36) అరెస్టయ్యారు. భార్యపై హింసకు పాల్పడినట్లు, కోర్టు జారీ చేసిన రక్షణ ఉత్తర్వును ఉల్లంఘించినట్లు ఆయనపై ఆరోపణలు ఉన్నాయి. బాధితురాలి ఫిర్యాదు మేరకు మిల్పిటాస్ పోలీస్ డిపార్ట్‌మెంట్ (ఎంపీడీ) అధికారులు, సాంటా క్లారా కౌంటీ డిస్ట్రిక్ట్ అటార్నీ కార్యాలయం సంయుక్తంగా దర్యాప్తు జరిపి జెస్వంత్‌ను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, భార్యను వేధించినందుకు జెస్వంత్‌పై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. పోలీసుల నివేదిక ఆధారంగా సాంటా క్లారా సుపీరియర్ కోర్టు నిందితుడిపై అరెస్ట్ వారెంట్ జారీ చేయగా, అనంతరం జెస్వంత్‌ను సాంటా క్లారా కౌంటీ మెయిన్ జైలుకు, ఆ తర్వాత ఎల్మ్‌వుడ్ కరెక్షనల్ ఫెసిలిటీకి తరలించారు. ఆ తరువాత నిందితుడికి బెయిల్ మంజూరైంది. ఈ కేసుపై ఎన్జీవో ప్రతినిధి తరుణి స్పందిస్తూ, బాధితుల భద్రత, గౌరవం, న్యాయ హక్కులు అత్యంత ముఖ్యమైన విషయాలని పేర్కొన్నారు. గృహ హింస కేసుల్లో పోలీసులు, కోర్టులు వేగంగా స్పందిస్తేనే సత్వర న్యాయం జరుగుతుందని అన్నారు. ఇటువంటి కేసుల్లో బాధితులు ఆలస్యం చేయకుండా ధృవీకరించబడిన సహాయ సంస్థలను సంప్రదించాలని సూచించారు. వలసదారుల సమాజాల్లో గృహ హింస బాధితులకు చట్టపరమైన సహాయం, రక్షణ వ్యవస్థలను పటిష్టం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

## యుపిఎస్ వద్దంటూ నవంబరు 25న చలో ఢిల్లీ

### ఎన్‌ఎంఒపిఎస్ సెక్రటరీ జనరల్ స్థితప్రజ్ఞ

**హైదరాబాద్, అక్టోబరు 25, ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగులకి అమలుచేయనున్న యునైటెడ్ పెన్షన్ స్కీమ్(యుపిఎస్) వద్దంటూ నవంబరు 25న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహించాలని నేషనల్ మూవ్‌మెంట్ ఫర్ ఓపిఎస్(ఎన్‌ఎంఒపిఎస్) నిర్ణయించింది. యుపిఎస్ వద్దంటూ, నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నేషనల్ మూమెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్ స్కీం ఆధ్వర్యంలో చలో ఢిల్లీ బహిరంగ సభ నవంబర్ 25 న జరపనున్నట్లు సంఘం సెక్రటరీ జనరల్ స్థితప్రజ్ఞ శనివారం మీడియాకు తెలిపారు.

స్థితప్రజ్ఞ మాట్లాడుతూ.. యుపిఎస్ అనేది ఒక విఫల పథకం అని, యుపిఎస్‌లో చేరడానికి ఇప్పటికే తేదీని మూడుసార్లు పొడిగించిందని, మూడు సార్లు సవరించిన ప్పటికీ కేవలం 3 నుండి 4 శాతం ఉద్యోగులు మాత్రమే యుపిఎస్‌ను ఎంచుకున్నారన్నారని గుర్తు చేశారు. ఛలో ఢిల్లీ నిరసన కార్యక్రమా నికి దేశవ్యాప్తంగా ఉన్న అన్ని రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగ, ఉపాధ్యాయులు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, రైల్వే, ఆర్డినెన్స్ మొదలైన శాఖల ఉద్యోగులందరూ భారీ సంఖ్యలో హాజరుకావాలని స్థితప్రజ్ఞ పిలుపు నిచ్చారు. అదేవిధంగా దేశవ్యాప్తంగా ఉపాధ్యాయులను ఆందోళన కలిగిస్తున్న టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(టెట్) పరీక్షపై రివ్యూ చేయాలని ఆర్‌టిఈ చట్టాన్ని సవరించాలన్న రెండు ప్రధాన డిమాండ్లతో చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో తెలంగాణ సిపిఎస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్, కోశాధికారి నరేష్‌గౌడ్ పాల్గొన్నారు.

## ఫలించిన మాజీమంత్రి హరీశ్‌రావు కృషి

### సొంతూళ్లకు చేరుకున్న 12 మంది జోర్డాన్ కార్మికులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు 25:** మాజీమంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు కృషి ఫలించింది. బతుకు దెరువు కోసం జోర్డాన్ వెళ్లి చిక్కుకున్న 12 మంది వలస కార్మికులు ఎట్టకేలకు సొంతూళ్లకు చేరుకున్నారు. జోర్డాన్లో వారు పనిచేసే కంపెనీకి పెనాల్టీతో పాటు, రవాణ ఖర్చును భరించి బాధితులను తెలంగాణాకు రప్పించ్చారు. శనివారం ఉదయం శంషాబాద్ ఎయిర్‌పోర్టులో దిగిన బాధితులు, నేరుగా హరీశ్ రావు ఇంటికి వెళ్లి కలిశారు. కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలకు ఎన్ని సార్లు తమ సమస్య చెప్పుకున్నా పట్టించుకోలేదని బాధితుల ఆవేదన వ్యక్తం చేశారు. తమను తిరిగి భారత దేశానికి తీసుకొచ్చిన హరీశ్ రావుకు, బీఆర్ఎస్ పార్టీకి జీవితాంతం రుణపడి ఉంటామని బాధితులు తెలిపారు. ఈ సందర్భంగా హరీశ్ రావు.. వారి కుటుంబ పరిస్థితులు, జోర్డాన్‌లో ఎదుర్కొన్న ఇబ్బందులు గురించి అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి ఆందోళన చెందవద్దని వారికి భరోసా ఇచ్చారు. రాష్ట్రంలోనే ఉండి ఉపాధి, ఉద్యోగ మార్గాలు ఆలోచించాలని సూచించారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనాల్లో జగిత్యాల, నిర్మల్, కామారెడ్డి, నిజామాబాద్, సిద్దిపేట జిల్లాల్లోని తమ తమ సొంతూళ్లకు చేరుకున్నారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. కేసీఆర్ ఆదేశాలతో జోర్డాన్ లో చిక్కుకున్న 12 మందిని స్వదేశానికి తిరిగి తీసుకువచ్చేందుకు కృషి చేశామన్నారు. బతుకు తెరువు కోసం, అప్పులు తీర్చడం కోసం జోర్డాన్, ఇజ్రాయిల్, గల్ఫ్ వంటి దేశాలకు వెళ్లి ఏజెంట్ల చేతుల్లో చిక్కుకొని ఎంతో మంది బతుకులు ఆగం అవుతున్నాయి. 12 మంది వలస కార్మికుల సమస్య తెలియగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లాం. స్పందించి వారికి సాయం అందించాలని కోరాం. మరో వైపు జోర్డాన్ లోని ఇండియన్ ఎంబసీ ఆఫీస్ కు వెళ్లి కార్మికులు అనేక సార్లు మొరపెట్టుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేసారు. అయినా స్పందన లేదు. అందుకే జోర్డాన్‌లో చిక్కుకున్న 12 మంది కోసం పెనాల్టీ కట్టి తిరిగి స్వదేశానికి తీసుకు వచ్చామని చెప్పారు. ఎంతోమంది ఉపాధి నిమిత్తం వివిధ దేశాల్లో అనేక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. మన పిల్లల్ని మనం కాపాడుకోవడం ప్రభుత్వాల బాధ్యత. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మొద్దునిద్ర పోతే బీఆర్ఎస్ పార్టీ 12 మందినీ కాపాడి స్వదేశానికి తీసుకువచ్చింది. కాగా, జోర్డాన్ వలస కార్మికుల సమస్య తన దృష్టికి రాగానే దాదాపు రెండు వారాల నుంచి వారిని స్వదేశానికి రప్పించేందుకు హరీశ్ రావు ఎంతో కృషి చేశారు. ఒకవైపు జోర్డాన్ వలస కార్మికుల సమస్యను రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ సహా మీడియా దృష్టికి తీసుకువెళ్లిన హరీశ్, మరోవైపు బీఆర్ఎస్ ఎంపీ సురేశ్ రెడ్డి ద్వారా భారత విదేశీ వ్యవహారాల శాఖ అధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళ్లారు. ఇంకోవైపు సంబంధిత కంపెనీ ప్రతినిధులతో చర్చలు జరిపారు. ఈ క్రమంలో పెనాల్టీ చెల్లించి వారిని తెలంగాణకు తీసుకు వెళ్లేందుకు కంపెనీ ఒప్పుకున్నది. దీంతో వలస కార్మికుల ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా చెల్లించాల్సిన మొత్తంతో పాటు, స్వదేశానికి రావడానికి అయ్యే విమాన టికెట్లను సైతం స్వయంగా హరీశ్ రావు భరించారు. ఎట్టకేలకు హైదరాబాద్ చేరుకున్న వారిని ప్రత్యేక వాహనాల్లో సొంతూళ్లకు తరలించారు.



హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో లిమిటెడ్
(మెట్రో రైల్ భవన్, రసూల్‌పురా, హైదరాబాద్)
ఇ-ప్రొక్యూర్‌మెంట్, సూపరింటెండింగ్ ఇంజనీర్
నిట్ నం: 05/HAML/Engg/SE/2025-26, (ఐటమ్ నం.1 to 4) తేది: 25.10.2025
పనులు: దారుల్‌షిఫా to చాంద్రాయణగుట్ట-కారిడార్-VIలో రోడ్ వెడల్పుకు ప్రభావిత ఆస్తుల పడగొట్టడం- HAML (4 నం.లు) ప్రారంభ తేదీ & సమయం: 25.10.2025, ముగింపు తేదీ & సమయం: 01.11.2025 మ.3.00 గం. వరకు. తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్ @https://tender.telangana.gov.in పై వీక్షించవచ్చును. లేదా SE, HAML ఫోన్ నం.040-23388588 సంప్రదించవచ్చును. సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో లిమిటెడ్
DIPR.No.9728-PP/CL/Advt/1/2025-26, తేది: 25.10.2025

నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్
వ్యవసాయం మరియు రైతాంగ సంక్షేమ విభాగం
వ్యవసాయం మరియు రైతాంగ సంక్షేమ మంత్రిత్వ శాఖ, GOI
రాజేంద్రనగర్, హైదరాబాద్-500030-తెలంగాణ, ఇండియా
టెలిఫోన్: 9140-24015374, టెలి-ఫ్యాక్స్: 9140-24015346
ఇ-మెయిల్: niphm@nic.in, http://niphm.gov.in
NIPHM
PGDPHM ప్రకటన
నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్ (NIPHM) హైదరాబాద్ ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం (PJTAU) తో సంయుక్తంగా ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌లలో ఒక సంవత్సరం పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.
ప్రాజెక్ట్ మరియు ఇంటర్న్‌షిప్ కాంపొనెంట్స్‌తో నైపుణ్య సంబంధిత ఓరియెంటెడ్ కోర్సులు, అత్యుత్తమ ప్లేస్‌మెంట్ అవకాశాలను అందిస్తున్నాయి.
అర్హత: వ్యవసాయం / హార్టికల్చర్‌లో గ్రాడ్యుయేట్‌లు క్రిమి కీటక చీడ సంహారక మందుల యాజమాన్యంలో స్పెషలైజేషన్ కొరకు M.Sc. కెమిస్ట్రీ గ్రాడ్యుయేట్‌లు దరఖాస్తు పెట్టుకోవచ్చు.
దరఖాస్తు పెట్టుకోవడానికి చివరి తేది: 31వ అక్టోబర్ 2025
దరఖాస్తు పెట్టుకోండి వద్ద: http://14.139.92.166/dips/register.aspx
వీక్షించండి: https://niphm.gov.in/pgdphm.index.html
CBC 01379/11/0006/2526 సం/- రిజిస్ట్రార్

ఒక పక్క వర్షాలు, మరోపక్కకొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడం, ఇంకో పక్క ముంపు బారినపడి దెబ్బతినగా, మిగిలిన పంటలకు మద్దతు ధరలురాకపోగా, తక్కువ ధరలకు కొనుగోలుచేయడంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో అన్నదాతల పరిస్థితి దయనీయంగా తయారయింది. భారీ వర్షాలతో పంటలు దెబ్బతినడం వల్ల పంటల కొనుగోళ్ల ప్రక్రియ ఆలస్యం అవుతోంది, అక్కడక్కడా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసినా వాటిల్లో తేమశాతం పేరుతో కొనుగోళ్లుచేయడం లేదు. పత్తి,మొక్కజొన్న,వరి వంటి ఖరీఫ్ పంటలకు నష్టం వాటిల్లుతోంది. పంటలు నీటిలో మునిగిపోవడం, శిలీంధ్రవ్యాధులు సంభవించడం, తెగుళ్ల పెరగడంవంటి సమస్యలవల్ల రైతులు నష్టపోతున్నారు.ఇప్పటికే పండించిన పంటలు కూడా తడిసిపోవడంతో, కొనుగోలు కేంద్రాల్లో నాణ్యత లేకపోవడం లేదా కొనుగోలు ధరలు తగ్గడంవంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. భారీవర్షాల కారణంగా పొలాల్లో నీరు నిలిచిపోవడంతో వరి,మొక్కజొన్న,పత్తి,సోయాబీన్, పప్పుధాన్యాలు వంటి పంటలు దెబ్బతింటున్నాయి. పంటలు తడిసిపోవడంవల్ల నాణ్యత తగ్గి,కొనుగోలు ప్రక్రియ ఆలస్యం అవుతోంది. కొన్నిసందర్భాల్లో,తడిసిన పంటలను తక్కువ ధరలకు కొనుగోలు చేస్తూ రైతులను దోపిడీ చేస్తున్నారు.పంట నష్టంతోపాటు,వ్యాపారులు, దళారులు తక్కువ ధరలకు కొనుగోలు చేస్తుండటంతో రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. పత్తికొనుగోళ్లకు సంబంధించి సీసీఐ పెట్టిన నిబంధనలు రైతులకు తీవ్ర ఇబ్బందులు గురిచేసేవిగా ఉన్నాయి. దీనికి తగినట్లుగా వాతవరణం మార్పులతో ఉన్న పంటలకు తెగుళ్ల వ్యాపిస్తున్నాయి.ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పంటలపై ప్రధానంగా పత్తిపై తీవ్ర ప్రభావంపడుతోంది. పత్తి,వరి పంటలు చేతికొచ్చే సమయంలో వర్షాలు పడడంతో తెగుళ్ల బారినపడి రైతులు నష్టపోతున్నారు. పంటల సాగు కోసం పెట్టిన ఖర్చులు కూడా వచ్చే అవకాశం లేదు.

# ఇంకెన్నాళ్లీ 'కష్టాల' సాగు

**సిహెచ్ వి వి రఘుబాబు**

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో ఖరీఫ్ రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. రెండు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు చేదికంది వచ్చిన పంటలు నీటి పాలవుతున్నాయి. రైతులు దిగుబడి రాక ఇబ్బందులు పడుతుంటే ప్రకృతి రైతుపై కక్ష కట్టినట్లు పంట చేతికొచ్చే దశలో అధిక వర్షాలు పడటంతో పంట మొత్తం దెబ్బతిని తీవ్రంగా నష్టపోతున్నామని రైతాంగం ఆవేదన వ్యక్తం చేస్తోంది. కోతకు సిద్ధమైన వరి, పత్తి, పంటలు ఈదురు గాలులు, భారీ వర్షాలతో నీటిలో మునిగి,రాశులైనవి తడిసి, కొన్ని నేలకు కరిచిన స్థితిలో ఉన్నాయి. రైతులకష్టం నీళ్లలో కలిసిపోతుండగా వారి ఆవేదన కన్నీటితో కటకటలాడుతోంది. కోతకు వచ్చిన వరి, మొక్కజొన్న, పత్తి తదితర పంటలు వర్షాలకు దెబ్బతిని పెట్టుబడులు సైతం నష్టపోతున్నారు. భారీవర్షాల వల్ల పంట నీట మునిగి, పత్తి కాయలు రంగు మారాయి. ఫలితంగా దిగుబడి తగ్గనుండగా జిల్లాలోకొనుగోలు కేంద్రాలు అందుబాటులో లేకపోవడం వల్ల పంటను అమ్ముకునేందుకు ఇబ్బంది తప్పడం లేదు. మూడు రోజులుగా కుండపోత వర్షాలు రైతుల కలలను కొట్టిపారేస్తున్నాయి. మెదక్,వరంగల్, సిద్ధిపేటలో భారీ వర్షంతో పత్తి మార్కెట్‌లో ఉన్న మొక్కజొన్న, వరి ధాన్యం తడిసి ముద్దయింది. చాలారోజుల కిందటే మార్కెట్‌కు మొక్కజొన్నలు, ధాన్యం తెచ్చినప్పటికీ కొనుగోలు చేయకపోవడంతో ధాన్యం మొత్తం తడిసిపోయింది. తేమ శాతం తక్కువగా ఉన్నప్పటికీ కొందరు వ్యాపారులు కొనుగోలు చేయడం లేదు. ఐకేపీ సెంటర్లలో ఆరబెట్టిన ధాన్యం వర్షంతో తడిసి నీటి పాలైంది. ఖమ్మంజిల్లాలో వర్షాలతో పత్తి పంటదెబ్బతింది. ఎకరాకు 50వేల రూపాయలు పెట్టుబడి పెడితే కనీసం 20 వేల రూపాయల పంటకూడా చేతికివచ్చే పరిస్థితి కనిపించడంలేదు. పత్తి తేమ ఉందని రూ.3,500కే అడుగుతున్నారు. ఎకరాకు రూ.50వేల చొప్పున పెట్టుబడి పెట్టగా, ఇప్పుడు భారీగా నష్టపోవాల్సి వస్తోంది. ఆదిలాబాద్ జిల్లాలో చేతికి వచ్చే మక్క, సోయా, మినుము, పెసరు వంటి పంటలు చేతికి వచ్చే సమయంలో వర్షం కురవడంతో నష్టంవాటిల్లింది. మూడు వారాల నుంచి పత్తి రావడం మొదలైనా ఏరేందుకు కూలీల కొరత ఉండడంతో చాలా మంది రైతులు పత్తి తీయకుండా అలాగే ఉంచారు. పంట చేతికొచ్చిన చోట పత్తిమొత్తం వర్షానికి తడిసి రాలిపోతోంది. కాయలోని పత్తి నల్లబారుతోంది. దీంతో కొన్ని చోట్ల రైతులు పత్తిఏరి రోడ్లపై ఆరబోస్తున్నారు.అయినా రంగు మారుతుండడంతో ఆందోళన చెందుతున్నారు. పంటను అమ్మకానికి తీసుకుపోతే సరైన మద్దతు ధరవస్తుందా? లేదా? అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.సిసిఐ కొనుగోలు కేంద్రాలు ఇంకా



పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయకపోవడంతో వర్షాలకు భయపడి గత్యంతరం లేక కొందరు రైతులు చెట్ల నుంచి తీసిన పత్తిని ప్రైవేట్లో అమ్ముకుంటున్నారు. మద్దతుధర రూ.8,200 ఉండగా రూ.2 వేల నుంచి రూ.వెయ్యి తక్కువకు ప్రైవేట్లో అమ్మి తీవ్రంగా నష్టపోతున్నారు.సకాలంలో సీసీఐ సెంటర్లను కూడా ఓపెన్ చేయకపోవడంతో నష్టపోవాల్సి వస్తోంది. ఇక ప్రస్తుతం కొన్ని జిల్లాల్లో కురుస్తున్న వర్షాలతో సోయాబీన్ పంట దెబ్బతింది. రాష్ట్రంలోని నిర్మల్, ఆదిలాబాద్ తదితర జిల్లాల్లో సోయాబీన్ తోటలు పుష్పించే,కోత దశలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు పంటను దెబ్బతీయడంతో రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. నిర్మల్, ఆదిలాబాద్‌లో వర్షాలతో సోయాబీన్ దెబ్బతిని దిగుబడి బాగా తగ్గింది. ఎకరానికి 5 నుండి 3 క్వింటాళ్లకు పడిపోయి రైతులు నష్టం పోయారు. సోయాబీన్‌కు కనీస మద్దతు ధరగా క్వింటాలుకు రూ.5,328గా నిర్ణయించగా, గత కొన్ని రోజులుగా పంట కోతలు కొనసాగుతుండటంతో వాటిని రూ.4,200 కూడా అమ్ముకుంటున్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజనులో 67.33 లక్షల ఎకరాల్లో వరి నాట్లు పడగా, తద్వారా 80 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి కానుంది. ఇందులో 62 శాతం మేర సన్న రకాలను రైతులు సాగు చేయగా, 42నుండి 45లక్షల టన్నులు దిగుబడి అవుతుందని అంచనా. సన్నాలకు క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ అందించాలని నిర్ణయించినా, గత రబీ సొమ్ము పెండింగ్ పడింది. ధాన్యం కొనుగోలు చేసి నెలలు అయినా ఇంత వరకూ రూ.500 చొప్పున రైతులకు బోనస్ చెల్లించకుండా బకాయిలు పడింది. ఈవిధంగా 74.23లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయగా, ఇందులోసన్నరకాలు దాదాపు23.20 లక్షల టన్నులకు బోనస్‌గా రూ.1,160 కోట్లు రైతులకు చెల్లించాల్సి ఉంది. ఇక పత్తికి సంబంధించి ఇప్పటికే కొనుగోళ్ల విషయంలో జాప్యం చేసిన సిసిఐ రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో సేకరణ ప్రారంభించింది. కొనుగోళ్ల జాప్యం చేయడంతో పాటు, కొత్తగా అమల్లోకి తెచ్చిన నిబంధనలు, ముడి పత్తిపై దిగుమతి సుంకాన్ని రద్దు చేయడం,కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం వంటి కారణాలు పత్తి రైతులకు టెర్రర్ పుట్టిస్తున్నాయి. పత్తిలో తేమ 12కన్నా ఎక్కువ శాతం ఉంటే కొనుగోళ్లకు అనుమతించబోమని తెలిపింది.తేమ శాతం 8 నుండి 12మధ్య ఉంటే ధర నిష్పత్తి ప్రకారం తగ్గుతుందని తెలిపింది.అలానే పొడవాటి దూదికి క్వింటాలుకు రూ.8,110, మధ్యస్థానికి రూ.7,710గా మద్దతు ధర ప్రకటించింది.ప్రధాన మార్కెట్లలో భారీగా పత్తి సరఫరా అవుతున్నప్పటికీ సిసిఐ మాత్రం కొనుగోళ్లను ప్రారంభించకపో వడంతో గత కొన్ని రోజులుగా వ్యాపారులు, దళారులదే ఇష్టారాజ్యమైంది. వరంగల్, జమ్మికుంట వంటి కీలక మార్కెట్లలో ప్రస్తుతం మండి ధరలు క్వింటాలుకు రూ.5,600-7,303 మధ్య ఉండగా, సగటున రూ.6,600 వరకు ఉన్నాయి. దీంతో రైతులు ఎకరానికి సుమారు రూ.10వేలనుండి రూ.15 వేల వరకూ నష్టపోతున్నారు. ఖరీఫ్‌లో పత్తి సాగు 43-44 లక్షల ఎకరాలు కాగా,నల్గొండ,ఆదిలాబాద్, వరంగల్ వంటి జిల్లాల్లో వర్షాలు పంటలను దెబ్బతీశాయి. దీనివలన అంచనా వేసిన దిగుబడి 29 లక్షల టన్నుల నుండి దాదాపు 25 లక్షల టన్నులకు తగ్గింది. ఇక 15నుండి 20శాతం పంటలో కాయతెగులు, రంగు మారడానికి కారణమైంది. తెలంగాణ, ఆంధ్రాలో కపాస్ కిసాన్ యాప్‌తో మారుమూలప్రాంతాల రైతులు ఇబ్బందులు పడుతున్నారు. టెలికాం నెట్‌వర్క్ కవరేజ్ సరిగా లేకపోవడం వల్ల యాప్‌లో నమోదు చేసుకోలేక, స్లాట్‌లను బుక్ చేసుకోలేకపోతున్నారు. గ్రామాల్లో సెల్‌ఫోన్ల నెట్‌వర్క్ కవరేజ్ సరిగా లేకపోవడం వల్ల పేరు, భూమి టైటిల్ వివరాలు, ఆధార్ నంబర్ నమోదు చేసుకోలేక స్లాట్ బుక్ చేసుకోలేకపోతున్నారు. దీంతో రైతులు ప్రైవేట్‌లో తక్కువ ధరలకు అమ్మాల్సి వస్తోంది. మార్క్‌ఫెడ్ అధ్వర్యంలో మొక్కజొన్న కొనుగోళ్లు కూడా సజావుగా సాగడం లేదు. కనీస మద్దతు ధర రూ.2,400 కాగా, వివిధ మార్కెట్లలో కొనుగోలు ధర రూ.1,800 నుండి రూ. 2 వేల వరకూ ఉంది. గత నెల మూడోవారం నుంచే రైతులు మార్కెట్లోకి తీసుకురావడం ప్రారంభించారు. అయితే ఇప్పటి వరకూ చాలా ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో దళారులు చెప్పిన రేటుకే అమ్ముకోవాల్సి వచ్చింది. రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలు నిజామాబాద్, కామారెడ్డి, కొత్తగూడెం తదితర జిల్లాలో మొక్కజొన్న రైతులను నిండా ముంచాయి. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 50వేలకు పైగా ఎకరాల్లో మొక్కజొన్న దెబ్బతింది. వర్షాలతో ఆరబోసిన మొక్కజొన్న పంట తడిసి ముద్దైంది. దీంతో మొక్కజొన్న పంట రంగు మారుతుంది.గింజ ఆరక ముందే నానడంతో గింజలకు మొలకలొచ్చే ప్రమాదం ఏర్పడింది. దీంతో పెట్టిన పెట్టుబడి వస్తుందో రాదోనని ఆందోళన చెందుతున్నారు. ●

# మూడో కృష్ణుడు!

కర్ణాటక

**ఎ.వి.వి ప్రసాద్**

కానున్నది కాకమానదన్నది వాస్తవమే అయినా, ఏం జరగబోతోంది?అనే ప్రశ్న తలెత్తినప్పుడు రాజకీయాల్లోనైతే అనేక ఊహాగానాలు వెల్లువెత్తుతూంటాయి. కర్ణాటకలో ఇప్పుడు కనిపిస్తున్నది అటువంటి దృశ్యమే. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పదవిలో కొనసాగుతారా? లేక రెండో కృష్ణుడో, మూడో కృష్ణుడో వేదిక మీదకు వస్తారా! అనే వాదనలు రాజకీయ వర్గాల్లో ముమ్మరంగా సాగుతున్నాయి. మరో నాలుగు రోజుల్లో నవంబరు లోకి ప్రవేశిస్తామన్నది గుర్తుకు రాగానే అందరిలో 2023లో వినిపించినమాటలే ప్రతిధ్వనిస్తున్నాయి. ఆ సంవత్సరం మేలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పుడు కొత్త సిఎం ఎంపిక విషయంలో చాలా నాటకీయ పరిణామాలే సంభవించాయి.సిద్ధరామయ్య,డికె శివకుమార్ మధ్య 'గట్టి పోరు' నడిచింది. కారణాలేమైనా, ఈసారి సిద్ధరామయ్య కంటే పార్టీ తనకే అవకాశమివ్వాలని శివకుమార్,ఆయన మద్దతుదారులు గొంతు వినిపించారు. అయితే అధిష్ఠానం మొత్తానికి వారిద్దరి మధ్య రాజీకుదిర్చి సిద్ధరామయ్యకే పట్టం కట్టింది.కానీ రెండున్నరేళ్ల తర్వాత ముఖ్యమంత్రి పీఠాన్ని డికెకు అప్పగించాలనీ,ఇద్దరూ అలా అధికారాన్ని పంచుకోవాలనీ సిద్ధరామయ్యకు అధిష్ఠానం నచ్చజెప్పినట్లు కూడా అప్పట్లో వినిపించింది. వాస్తవం కూడా అదే. అందుకు సిద్ధపడే సిద్ధరామయ్య పగ్గాలు చేతిలోకి తీసుకొన్నారు. ఈ విషయాన్ని డికె కూడా మధ్యమధ్యలో చాలాసార్లు తన అనుయాయుల ద్వారాగుర్తు చేస్తున్నారు కూడా. పద వులపై తనకు ఎలాంటి ఆశ లేదనీ, పార్టీ ఏం చెప్తే అది చేసే క్రమశిక్షణ గల సైనికుడననీ అంటూ ముఖ్యమంత్రి పీఠంపై తనకు ఎలాంటి ఆశలు లేవన్నట్లుగా ప్రచారం చేసుకొన్నారు.కానీ ఆయన అనుచరులు మాత్రం 'మా డికెయే ఇక సిఎం' అంటూ గత పదిహేను రోజులుగా ము మ్మర ప్రచారాన్ని సాగిస్తున్నారు. బీహార్‌ఎన్నికలు కాగానే కర్ణాటక నాయకత్వాన్ని పార్టీతనకు అప్పగిస్తుందనే ప్రచారం అనుచరుల ద్వారాచేయిస్తూ డికె సంచలనాలుసృష్టిస్తున్నారు. ఆయనే సిఎం అవుతారంటూ ఎమ్మెల్యేలుఇక్బాల్ అహ్మద్, రంగనాథ్,హెచ్‌సి బాలకృష్ణ, శివలింగే గౌడ తదితరులు బహిరంగ వ్యాఖ్యలు చేయడం కూడా గమనించవలసిన పరిణామం. మైసూరు దసరా ఉత్సవాల తర్వాత డికె మరింత చురుకుగా తన వ్యూహాన్ని అమలుచేస్తున్నారని కూడా వినిపిస్తోం ది.బెంగళూరు,ఇతర ప్రాంతాల్లో సుడిగాలి పర్యటనలు చేస్తూప్రజలతో నేరుగా చర్చలు జరపడం మరో ఆసక్తికర పరిణామం. రాష్ట్రాభివృద్ధికి తాను కట్టుబడి ఉన్నాననే హామీలు ఇస్తున్నారు. అవి నీతికి పాల్పడే అధికారులపై కఠిన చర్యలు తీసు కొంటానని హెచ్చరిస్తూ పాలనాపరమైన వ్యవహారాల్లోనూ శ్రద్ధ తీసుకొంటున్నారు. బెంగళూరు సిటీలో రహదారుల సమస్య ఇటీవలప్రభుత్వానికి పెద్దతల నొప్పిగా మారడంతోతాను పర్యటించిన ప్రతిచోటా ఆ సమస్య పరిష్కారానికి ప్రాధాన్యమిస్తున్నట్లుచెబుతున్నారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అనారోగ్య కారణాలతో ఇటీవల బెంగుళూరులో విశ్రాంతి తీసుకున్నప్పుడు డికె ఆయనను ప్రతిరోజూ కలుసుకొన్నారనీ, సిద్ధరామయ్య కంటే డికెనే ఎక్కువసార్లు ఖర్గేను కలిసారనీ పార్టీ వర్గాలు చెబుతున్నాయి.' ఇప్పటి దాకా వేచి ఉన్నారు కదా!బీహార్ ఎన్నికల తర్వాత అన్ని విషయాలలోను స్పష్టత వస్తుంది. పార్టీ పట్ల గల విధేయతకు ఫలితం కనిపిస్తుంది' అంటూ ఖర్గే డికెకు హామీఇచ్చినట్లు కూడావినిపిస్తోంది. దీనితో డికె అనుచరులు కూడా కొద్ది రోజులుగా చాలా ఉత్సాహంతో కనిపిస్తున్నారు. ఈ పరిస్థితిలో సిద్ధరామయ్య తనయుడు, ఎమ్మెల్సీ అయిన యతీంద్ర చాలా 'క్యాజువల్'గా మరో బాంబు పేల్చారు. తన తండ్రి రాజకీయ జీవితం చరమాంకంలో ఉన్నదనీ, ఆయన తర్వాత కేబినెట్ సహచరుడైన సతీష్ జర్కిహోళిముఖ్యమంత్రి అయితే బాగుంటుందనీ అనడం గత నాలుగు రోజులుగా రాజకీయ వర్గాల్లో కలకలం సృష్టిస్తోంది. గత బుధవారం ( 22,అక్టోబరు) ఆయన బెళగావిలో ఓ కార్యక్రమానికి హాజరైన పృుడు ఈ వ్యాఖ్యలు చేశారు. అప్పుడుజర్కిహోళి కూడా ఆయన వెంటఉండడంతో ఆ వ్యాఖ్యలకు మరింత ప్రాధాన్యం ఏర్పడింది. జర్కిహోళి ప్రస్తుతం పబ్లిక్ వర్క్స్ మంత్రిగా ఉన్నారు.ఆయనకు గతంలో కూడా మంత్రిగాచేసిన అనుభవం ఉంది. 2008నుంచి యెమకన్ మార్డి నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎస్టీ నాయకుడాయన. యతీంద్ర ఆ మాటలు తానుగా అన్నారో, అధిష్ఠానం అనిపించిందో తెలియదు కానీ, డికెకు చెక్ పెట్టడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని మాత్రం దీనితో స్పష్టమవుతోంది. డికెకు ముఖ్యమంత్రి పీఠం అందకుండా చేయడానికే కొత్తగా 'మూడో కృష్ణుడి'ని ప్రవేశపెడుతున్నారనే ప్రచారం కూడా జరుగుతోంది.అధికార మార్పిడి అంటూ జరిగితే అది డికె, జర్కిహోళిలో ఎవరివైపు మొగ్గు చూపుతుందనే చర్చజోరుగా సాగుతోంది. డికెకు పోటీగా మరో పేరు తెరపైకి రావడంతో అసలుఅధిష్ఠానం మదిలో ఏముందనేచర్చ కూడా సాగుతోంది. యతీంద్ర వ్యాఖ్యల తర్వాత ఖర్గే గాని,రాహుల్‌గాని ఎలాంటి అభిప్రాయం వ్యక్తం చేయకపోవడంతో కొత్త ఊహాగానాలు కూడా ఎక్కువయ్యాయి.కాంగ్రెస్ ఎంపి ఎల్ఆర్‌శివరామే గౌడ రెండు రోజులక్రితం అధిష్ఠానంతో మాట్లాడి వచ్చిన తర్వాత రాష్ట్రంలో తలెత్తిన రాజకీయ గందరగోళానికి త్వరలోనే తెరపడబోతోందంటూ చేసిన వ్యాఖ్యకూడా కలకలం సృష్టిస్తోంది. ఎవరి అభిప్రాయాలు ఎలాఉన్నా తుది నిర్ణయం అధిష్ఠానానిదే అనీ,తగిన సమయంలో తగిన నిర్ణయం వెలువడుతుందనీ ఆయన అనడం కొత్త ఊహాగానాలను రేకెత్తిస్తోంది. అందుకే రెండో కృష్ణుడా,మూడో కృష్ణుడా అనే చర్చకూడా ఎక్కువగానే జరుగుతోంది.ఏదిఏమైనా ఏదో జరగబోతోందనే విషయం స్పష్టమవుతోంది. అదిఏమిటో నవంబరులోకి రాగానే తేలిపోతుందన్నది ఎక్కువమంది మాట.యతీంద్ర, గౌడవ్యాఖ్యల తర్వాత ఊహాగానాలకు ఒకస్పష్టమైన రూపం ఏర్పడుతోంది. అది ఏమిటో త్వరలోనే తెలుస్తుంది. ●



సతీష్ జర్కిహోళి


# ఐయు సభ్యత్వం కోసం తహతహ!

దేశం

మాంటెనెగ్రో

**గన్ని మోహన్**

ఆగ్నేయయూరోప్ భాగంలో ఉన్న అతిచిన్న దేశం ఇప్పుడు ఐరోపా కూటమిలో చేరేందుకు ఉవ్విళ్లూరుతోంది. తమ దేశంపై ఇతర అగ్రరాజ్యాల పెత్తనాన్ని సహించలేని ఈ చిన్న దేశం మాంటెనెగ్రో 2028కల్లా యూరోప్‌లో సభ్యదేశంగా చేరేందుకు అవసరమైన అన్ని సంప్రదింపులు చేపట్టింది. ఆదేశ అధ్యక్షుడు జకోవ్ మిలటోవిక్ మాట్లాడుతూఇతర సరిహద్దు దేశాల నుంచి తమదేశంపై విష ప్రచారం జోరుగా సాగుతోందని విమర్శిస్తున్నారు. అంతేకాకుండా తమ దేశంపై రష్యా ప్రభావం ఎక్కువ కనిపిస్తున్నదన్న భావన పెరిగింది. ఎందుకంటే ఆదేశంలో పెట్టుబడులు పెట్టేవారిలో 80శాతానికిపైగా రష్యా ఇన్వెస్టర్లే ఉన్నారు.సెర్బియానుంచి 2006లో స్వతంత్రదేశంగా ఆవిర్భవించిన తర్వాత మాంటెనెగ్రో 2008లోనే ఈయూలో చేరేందుకు దరఖాస్తు చేసింది. ఇతరత్రా 12 దేశాలతో పాటు మాంటెనెగ్రో కూడా దరఖాస్తుల చేసిన దేశాల్లోఉంది. రెండేళ్ల తర్వాత అభ్యర్థి హోదాను సాధించింది. ఈయూలో చేరేందుకు అవసరమైన 33 చేరిక అంశాల్లో ఏడు పూర్తిచేసింది. మరో ఐదింటిని ఈ ఏడాది చివరికల్లా భర్తీచేసుకోగలమని ధీమాతో ఉంది. యూరోపియన్ సానుకూల రాజకీయ వేత్తలు, పాశ్చాత్య బాల్కన్లు తమపై చేస్తున్న ప్రచారం వల్లనే ఐరోపా కూటమిలో చేరడంలో జాప్యం జరుగుతోందని అధ్యక్షుడు మిలాటోవిక్ వాదనలకు తగినట్లుగానే జాప్యం జరుగుతూ వస్తోంది. అదేరకమైన ఒత్తిడి కూడా మాస్కోనుంచి మాంటెనెగ్రో ఎదుర్కొంటున్నది. ఐరోపాపై ఒత్తిడి తెస్తూ తన కొత్త సైబర్‌రిజర్వు అక్కడ మొహరించాలని ప్రాంతీయ హబ్ ఏర్పాటుకు నిధిని కేటాయించాలంటూ మాస్కో కొంత కాలంగా ఒత్తిడి తెస్తోంది. ఇప్పటికే రష్యా సరిహద్దు దేశాలను ఐరోపా కూటమిలో చేరడాన్ని తీవ్రంగా అభ్యంతరాలు చెపుతున్న రష్యా ఇప్పుడు మాంటెనెగ్రో చేరికపైనా పరోక్షంగా తన వ్యూహాలను అమలుచేస్తున్నది.దీనికితోడు ఆదేశ పార్లమెంటులో కూడా విభేదాలు వచ్చాయి.ఆరులక్షల మంది జనాభాకు మించిలేని ఈ చిన్న దేశంలో ఐరోపా సభ్యత్వంపై ఆదేశ పార్లమెంటులోనేభిన్న స్వరాలు లేచాయి. అలాగే పొరుగుననే ఉన్న క్రోయేషియానుంచి కూడా ఉద్రిక్తతలు ఎదుర్కొంటున్నది. కొన్ని యూరోపియన్ సభ్యదేశాలనుంచి కూడా కొన్ని సందేహాలు వ్యక్తం అవుతుండటంతో2028కల్లా ఈయూ సభ్యదేశంగా పూర్తిస్థాయికి రావడం సాధ్యమేనా అన్నభావన ఆదేశ ప్రజల్లో వ్యక్తంఅవుతోంది. ఇప్పటికే ఐరోపా కూటమిలో సంస్కరణలు అవసరం అని ఫ్రాన్స్‌లాంటి కొన్ని అగ్రరాజ్యాలు గొంతెత్తాయి.కొత్త సభ్యులను చేర్చుకునే ముందు ఈయూను సంస్కరించాల్సిందేనన్న వాదన కూడా బయలుదేరిన నేపథ్యంలో మాంటెనెగ్రో ఈయూలో చేరిక అనేది గడువులోపు సాధ్యం అవుతుందాఅన్న ప్రశ్నఉదయిస్తోంది. దీనికి తోడు రష్యాతో ఆర్థికసంబంధాలు కూడా ఎక్కువే ఉన్నాయి. మాంటెనెగ్రోలో పర్యటించే రష్యన్లు నెల రోజులపాటు వీసా ఫ్రీ ఎంట్రీ ఉంది. దేశ ఆర్థిక వ్యవస్థకు రష్యా ఇన్వెస్టర్లే సింహభాగం వాటాతో ఉన్నారు. యూరోపియన్ యూనియన్‌లో చేరిన చిట్టచివరి దేశం క్రోయేషియా. పదేళ్లక్రితమే ఈ చిన్నదేశానికి అనుమతి లభించింది. బ్రిటన్ వైదొలిగిన తర్వాత క్రోయేషియాకు స్థానం లభించింది.వాస్తవానికి12 దేశాలు 2014 నుంచే ఈయూలో సభ్యత్వం కోసం పరితపిస్తున్నాయి.భౌగోళికంగా చిన్నదేశాలు కావడం తమకు సరిహద్దు భద్రత కొరవడుతుండటంతో ఐరోపా కూటమిలాంటి పెద్ద ఖండంలో చేరితే తమ భద్రతకు భరోసా లభిస్తుందని, దీనితోడు ఆర్థికంగాను, వాణిజ్యపరంగాను ఎంతో లాభదాయకం అవుతుందన్నది వీటి ఉద్దేశ్యం.ముఖ్యంగా మాంటెనెగ్రోలో అయితే పూర్తిగా పర్యాటకరంగమే ప్రధాన ఆదాయవనరు.అందుకోసమే ఐరోపా దేశాల నుంచి ఎక్కువ మంది పర్యాటకులను ఆకర్షించడం ద్వారా దేశ ఆర్థికవృద్ధిని మరింత మెరుగుపరుచుకోవచ్చన్నది ప్రస్తుత అధ్యక్షుడి ఆలోచగా ఉంది. అటు సైబర్ సెక్యూరిటీ, రక్షణరంగ భద్రతతోపాటు ఆర్థిక, వాణిజ్యభద్రతకు కూడా ఐరోపాకూటమి అండగానిలుస్తుందన్న భావనతో ఈచిన్నదేశాలు చిరకాలంగా సభ్యత్వం కోసం పరితపిస్తున్నాయి. ఆగ్నేయ ఐరోపా ప్రాంతంలోని చిన్న పర్వతశ్రేణుల దేశంగా నిలిచిన మాంటెనెగ్రోకు పర్యాటకులు విరివిగా వస్తుంటారు. 2006నుంచి సెర్బియానుంచి స్వాతంత్ర్యం పొందిన తర్వాత తన కాళ్లపై నిలదొక్కుకుంటూ బాల్కన్ దేశాల్లో ఒకటిగా నిలిచింది. యునెస్కో ప్రపంచ వారసత్వ సంపద కలిగిన దేశాల్లోకూడా గుర్తింపు పొందిన ఈదేశం ఒకవిధంగా చెప్పాలంటే బాల్కన్ దేశంగానే భావిస్తారు.ప్రకృతి అందాలకు పెట్టిందిపేరు అయిన ఈచిన్నదేశంలోపర్యాటకరంగం వృద్ధిపైనే ఆదేశం ఎక్కువ ఫోకస్‌పెడుతుంది. ప్రత్యేకించి రష్యా నుంచి ఎదురవుతున్న విషప్రచారం అడ్డంకులను అధిగమించేందుకు రష్యాకు వ్యతిరేకంగా ఉన్నదేశాలతో కూడా జట్టు కడుతూ ఇతర ఈయూదేశాల మద్దతు కూడగడుతోంది. మొత్తం 12దేశాలు సభ్యత్వంకోసం అహరహం శ్రమిస్తున్న వాటిలో మాంటెనెగ్రో ముందు వరుసలో ఉంది. వీటికితోడు సరిహద్దుల్లో ఉన్న క్రోయేషియా, బోస్నియా,హెర్జెగోవినా,సెర్బియా, కొసావో, ఆల్బేనియా దేశాలనుంచి ఎదురయ్యే అడ్డంకులను కూడా అధిగమించాలి.అన్నింటికంటే ముందు రష్యాను ప్రసన్నం చేసుకోవాలి లేదా ఇతర అగ్రరాజ్యాల దన్నుతో అధిగమించిఅయినా ముందుకుసాగాలి. ఎగువ మధ్యాదాయ కేటగిరీ దేశంగాఉన్న ఈఆగ్నేయ ఐరోపాప్రాంతచిన్నదేశం అభివృద్ధిలోముందుకు దూసుకువెళ్లాలంటేఇయూ సభత్వం అనివార్యం అనే భావిస్తోంది. తక్కువ పన్నులు, సులభతర, జీవనశైలి ఉన్న ఈ దేశం ఎక్కువగా పర్యాటకం,సేవల రంగంపైనే ఆధారపడిఉంది. 80శాతంఐరోపా దేశాలనుంచే వస్తున్న పర్యాటక రంగం మరింత అభివృద్ధి చెందాలంటే ఐరోపా శాశ్వతసభ్యత్వం అనివార్యం అనేఈచిన్న దేశంభావిస్తోంది.అయితే అనుకున్న లక్ష్యంమేరకు 2028నాటికి ఈయూలో చేరేవిధంగా చేరడమనేది ప్రస్తుత అధ్యక్షుడు జకోవ్ మిలాటోవిక్‌కుసవాళ్లతో కూడిన ప్రయాణమే అనిచెప్పకతప్పదు. ●



జకోవ్ మిలటోవిక్

# గతి తప్పుతున్న ప్రాంతీయ పార్టీలు!

**కైలసాని శివప్రసాద్**


దేశంలో 8 జాతీయ పార్టీలు, 58 ప్రాంతీయ పార్టీలు, 2763నమోదు కాబడి గుర్తింపు లేని రాజకీయ పార్టీలున్నాయి. గత కొద్ది సంవత్సరాలుగా జాతీయ పార్టీలపై దేశ ప్రజలలో విశ్వాసం సన్నగిల్లుతుంది అనేది నిర్వివాదాంశం. దీంతో దేశవ్యాప్తంగా ప్రాంతీయ పార్టీల ప్రభావం అధికమైపోయింది. జాతీయ రాజకీయాలను శాసించే స్థాయికి ప్రాంతీయ పార్టీలు అభివృద్ధి చెందడం గమనార్హం. గత కొద్దికాలంగా కేంద్రంలో ఏర్పాటుచేస్తున్న సంకీర్ణ ప్రభుత్వాలలో ప్రాంతీయ పార్టీలు చాలా కీలకంగా మారాయి. ప్రాంతీయ పార్టీలు కొత్తగా పుట్టుకొచ్చినవి కావు. శిరోమణి అకాలీదళ్, ఎఐఎంఐఎం, ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్, జమ్ము కాశ్మీర్ నేషనల్ కాన్ఫరెన్స్ లాంటి అనేకప్రాంతీయ పార్టీలు దేశానికి స్వాతంత్రం రాక ముందే ఆవిర్భవించాయి. స్థానిక రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు, ఆశయాలకు ప్రతినిధులుగా వ్యవహరిస్తూ స్థానిక సమస్యలు,సంస్కృతులకు ప్రాంతీయ పార్టీలు అత్యధిక ప్రాధాన్యం ఇస్తూ ఉంటాయి. ఈ పరిణామాలతో దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాలలో ప్రాంతీయ పార్టీలకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. ప్రాంతీయ పార్టీల ఆధిక్యంతో తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ లాంటి అనేక రాష్ట్రాలలో జాతీయ పార్టీలు ఉనికినే కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. ప్రాంతీయ పార్టీలు స్థానిక రాష్ట్ర ప్రజల ప్రయోజనాలు, ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తుండడమే వాటికి ప్రజలలో ఆదరణ ఎక్కువగా లభిస్తూ ఉందనడానికి ప్రధాన కారణంగా చెప్పవచ్చు. ప్రాంతీయ పార్టీల ప్రభావాన్ని తట్టుకుని రాష్ట్రాలలో మనుగడ సాగించేందుకు జాతీయ పార్టీలుకూడా ప్రస్తుత పరిస్తితులలో ఆయా రాష్ట్రాలలో ఉన్న స్థానిక సమస్యలపై దృష్టికేంద్రీకరించవలసిన పరిస్తితి ఏర్పడింది. అదే విధంగా సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది ప్రాంతీయ పార్టీలే అనడంలో ఎటువంటి సందేహం లేదు. 1983లో తెలుగుదేశం పార్టీ మొట్ట మొదటి పర్యాయం అధికారం చేపట్టినప్పుడు అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు అమలుచేసిన రెండురూపాయలకే కిలోబియ్యం లాంటి అనేక సంక్షేమ కార్యక్రమాలు అప్పట్లో దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించాయి. రామారావు అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలు అనేక రాష్ట్రాలలోని అనేక ప్రాంతీయ పార్టీలతో పాటూ జాతీయపార్టీలకు కూడా మార్గదర్శకంగా మారడం గొప్పపరిణామం. శిరోమణి అకాలీదళ్, ఎఐఎంఐఎం, జమ్ముకాశ్మీర్ నేషనల్ కాన్ఫరెన్స్,ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్, మిజో నేషనల్ ఫ్రంట్, మహారాష్ట్రవాది గోమంతక్ పార్టీ, జెఎంఎం, డిఎంకె, అన్నా డిఎంకె లాంటి ప్రాంతీయ పార్టీలు తెలుగుదేశం పార్టీ కంటే మునుపేఆవిర్భవించాయి. అయినా దేశంలో సంక్షేమ కార్యక్రమాలను ఆచరణలోకి తెచ్చింది మాత్రం తెలుగుదేశం పార్టీనే అని కచ్చితంగా చెప్పవచ్చు.1971 ఎన్నికల సమయంలో అప్పటి కాంగ్రెస్ పార్టీ అధినేత్రి ఇందిరా గాంధీ గరీబీ హటావోదేశ్ బచావో (పేదరికాన్ని నిర్మూలించండి దేశాన్నికాపాడండి) అనే నినాదంతో దేశవ్యాప్తంగా హడావిడి చేసి ఆ ఎన్నికల్లో ఘన విజయం సాధించింది. అధికారంలోకి వచ్చిన నాలుగు సంవత్సరాల తరువాత 1975లో అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ దేశంలో పేదరిక నిర్మూలన కొరకు 20 సూత్రాల కార్యక్రమం ప్రారంభించారు. దానివలన నామమాత్రా సత్ఫలితాలు కూడా వెలువడిన దాఖలాలు లేవు. 20 సూత్రాల కార్యక్రమం దేశంలో ప్రారంభమై 50సంవత్సరాలు దాటినా ప్రజల పేదరికం కేంద్రంగా రాజకీయాలు చేస్తూ దేశంలోని ప్రాంతీయ, జాతీయ పార్టీలన్నీ ఇప్పటికీ మనుగడ సాగిస్తూ ఉండడం చూస్తే దేశంలో ఇంకా పేదరికం ఎంత బలంగా ఉందో సులభంగా అర్థం చేసుకోవచ్చు. అదేవిధంగా పాలనా సంస్కరణలకు పెద్దపీట వేయడం కూడాప్రాంతీయ పార్టీలు ఆయా రాష్ట్రాలలోని స్థానిక ప్రజల మన్ననలు పొందడానికి ఒక కారణంగా భావించవచ్చు. వాస్తవంగా సంక్షేమ కార్యక్రమాలు,పాలనా సంస్కరణలకు బీజం వేయడమేకాదు ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకూ ప్రాంతీయ పార్టీలు అత్యధిక ప్రాధాన్యమిస్తాయి.కానీ ఇదంతా ఒకప్పటి మాట. ప్రస్తుతం ప్రాంతీయ పార్టీలు ప్రజాస్వామ్య వ్యవస్థను ఎటు తీసుకు



పోతున్నాయో అంతు చిక్కడంలేదు. ఎన్నికల సమయంలో ఆచరణ సాధ్యంకాని అసాధారణ హామీలు ప్రజలకు ఇచ్చి అధికారంలోకి వచ్చేందుకు ప్రాంతీయ పార్టీలన్నీ ప్రయత్నిస్తున్నాయి.హామీలు ఇచ్చేముందు రాష్ట్ర ఆదాయాన్ని, ఖర్చులనుఈప్రాంతీయ పార్టీలు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. అదేవిధంగా తాము ఇచ్చే హామీలు ప్రజలకు నిజంగా అవసరమా?లేదా?అని ఏమాత్రం పరిగణిలోకి తీసుకోవడంలేదు. ప్రాంతీయ పార్టీలు అధికారమే ప్రమావధిగా విచ్చలవిడిగా ప్రజలకు తాయిలాలు హామీలుగా ఇస్తూ ఉన్నాయి. అడ్డూ అదుపులేకుండా ఇచ్చిన హామీలతో అధికారంలోకి వచ్చిన ప్రాంతీయ పార్టీలు ప్రజలకు తాము ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు అష్ట కష్టాలు అనుభవిస్తూ అప్రజాస్వామిక పద్దతులకు తెరదీస్తున్నాయి. ఆడంబరాలకు, ప్రచార ఆర్భాటాలకు, నిరూపయోగమైన హామీలకు విచ్చల విడిగా ఖర్చు చేస్తూ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మారుస్తున్నాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు, రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్లు సకాలంలో చెల్లించలేకున్నాయి. ఆఖరికి ఉద్యోగులు పొదుపు చేసుకునే సిపియస్ మొత్తాన్ని కూడా ఇతర కార్యక్రమాలకు మళ్లించే స్థాయికి ప్రభుత్వాలు దిగజారిపోతున్నాయి. బడ్జెట్‌ను నిర్దిష్ట ప్రణాళికా బద్దంగా ఉపయోగించుకోకుండా అడ్డదిడ్డంగా ఉపయోగించుకుంటున్నాయి. పాత అప్పులతో ఎఫ్.ఆర్.బి.ఎం పరిమితిమించుతూ ఉండడంతో కొత్త అప్పులు పొందేందుకు ప్రభుత్వాలు అనేక అడ్డదారులు వెతుకుంటున్నాయి. కార్పొరేషన్ల ద్వారా అప్పులు చేయడమే కాకుండా రాష్ట్ర దీర్ఘకాలిక ఆదాయాన్ని, రాష్ట్ర ఆస్తులను ఇష్టానుసారం కుదువ పెడుతున్నాయి. ఈ పరిణామాలతో రాష్ట్రాలు కోలుకోలేని విధంగా అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాయి. సుదీర్ఘ కాలంగా ప్రాంతీయపార్టీల పాలనలో ఉన్న రాష్ట్రాలు సంక్షేమం, అభివృద్ధిపేరుతో అధిక మొత్తంలో అప్పులు చేసినా అక్కడి ప్రజల జీవితాలలో ఏమైనా మార్పులు వచ్చాయా అంటే అదీ జరగడంలేదు. ఆ రాష్ట్రాలలో పేదరికం, నిరుద్యోగం నామమాత్రంగానైనా తగ్గిన దాఖలాలు లేవు. అదేవిధంగా విద్య, వైద్యం, వ్యవసాయ అవసరాలకు ప్రజలు పడే కష్టాలుకూడా ఏమాత్రం తగ్గినట్లు కనిపించడంలేదు. గ్రామాలు కూడా ఏమాత్రం అభివృద్ధి లేకుండా నిర్మానుష్యంగానే ఉన్నాయి. దీని ప్రకారం ఈ ప్రభుత్వాలు చేసే సంక్షేమ కార్యక్రమాలు, నగదు బదిలీలు, ఉచితాలు కేవలం ప్రజలకు ఉపశమనం మాత్రమే కలిగిస్తాయని స్పష్టంగా తెలుస్తుంది. ఉచితంగా విద్య, వైద్యం, ఉపాధి, ఉద్యోగం, వ్యవసాయ అవసరాలతో పాటూ పేదలకు గృహ సౌకర్యం కల్పించినప్పుడే కదా పేదరికం తగ్గి ప్రజల జీవితాలు, గ్రామాలు కళకళలాడేది.గతంలో సంక్షేమం పేరుతో ఉచితాలుపంచేందుకు జాతీయపార్టీలు పూర్తిగా వ్యతిరేకంగా ఉండేవి. కానీ ప్రాంతీయ పార్టీల ప్రాభవాన్ని తట్టుకుని రాష్ట్రాలలో పాగావేసేందుకు ప్రాంతీయ పార్టీలను మించి కాంగ్రెస్, బిజెపి లాంటి జాతీయపార్టీలు కూడా ఉచితహామీలు ఇస్తూఉండడం గమనార్హం. ఇటీవల కర్ణాటక, తెలంగాణా రాష్ట్రాలలో జరిగిన సాధారణ ఎన్నికల సమయంలో కాంగ్రెస్, బిజెపి జాతీయ నాయకకత్వం పోటీలు పడీ ఉచిత హామీలు ఇచ్చిన వైనం ఇంకా ప్రజలకు కళ్ళలో మెదులుతూనే ఉంది. రాష్ట్ర, జాతీయ రాజకీయాలలో పరిపాలనలో సుదీర్ఘ అనుభవం కలిగి విజనరీ నాయకులుగా పేరు తెచ్చుకున్న కొంత మంది నాయకులు మొదట్లో ఉచితాలపై అయిష్టంగా ఉండేవారు. కానీ ఇటీవలి కాలంలో వారు కూడా పోటీలు పడీమరీ అలివికాని ఉచిత హామీలు స్వయంగా ఇస్తూఉండడం ఆశ్చర్యకరం.గతంలోప్రజాస్వామ్య వ్యవస్థకు పునాదులుగా ప్రాంతీయ పార్టీలు వ్యవహరించేవి. కేంద్రంలో అధికారంలో ఉన్నజాతీయ పార్టీలు అమలు చేసే అప్రజా స్వామిక పద్దతులపై గతంలో ప్రాంతీయ పార్టీలు అలుపెరుగని పోరాటం చేసేవి.కానీ ఇటీవలి కాలంలో ప్రాంతీయ పార్టీలే అప్రజాస్వామిక పద్దతులలో పెద్దఎత్తున పార్టీ పిరాయింపులకు ఎర్ర తివాచీ పరుస్తూ ఉన్నాయి. దీంతో ప్రాంతీయ పార్టీలు కేంద్రప్రభుత్వాలని నిలదీసే అవకాశాన్ని కోల్పోతూవున్నాయి. అదేవిధంగా గతంలో ప్రజలకు సేవ చేయాలని సదుద్దేశ్యంతోనే నూరు శాతం రాజకీయాలలోకి వచ్చేవారు.ప్రాంతీయ పార్టీలు స్వీయ నియంత్రణతో ప్రజల ధనానికి ట్రస్టీలుగా భావించి ప్రజాధనం వృధాచేయకుండా, ప్రజా ప్రయోజనాల కొరకు చిత్తశుద్ధితోపాటు పడినప్పుడే ప్రజలకు, ప్రజాస్వామ్య వ్యవస్థకు, రాష్ట్రాలకు, దేశానికి నిజంగా మంచి చేకూరుతుంది. ●

# భారత్ ఒక గొప్ప ప్రజాస్వామ్యదేశం

## నోబెల్ గ్రహీత మరియా కొరినా మచాడో ప్రశంసలు



**కారకాస్, అక్టోబరు 25:** నోబెల్ శాంతి బహుమతి గ్రహీత, వెనిజులా ప్రజాస్వామ్య ఉద్యమకారిణి మరియా కొరినా మచాడో భారత్‌పై ప్రశంసల వర్షం కురిపించారు. భారత్ ఒక 'గొప్ప ప్రజాస్వామ్యం' అని, ప్రపంచంలోని అనేక దేశాలకు 'ఒక ఉదాహరణ' అని కొనియాడారు. వెనిజులాలో ప్రజాస్వామ్యం పునరుద్ధరింపబడిన తర్వాత భారత్‌తో అన్ని రంగాల్లో సంబంధాలను బలోపేతం చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నామని, భారత్ తమకు గొప్ప మిత్రదేశం కాగలదని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. త్వరలోనే ప్రధాని నరేంద్ర మోదీతో మాట్లాడాలని ఆశిస్తున్నానని, స్వేచ్ఛాయుత వెనిజులాలో ఆయనకు ఆతిథ్యం ఇవ్వాలనుకుంటున్నానని తెలిపారు. గత 15 నెలలుగా అజ్ఞాతంలో ఉన్న ఆమె మీడియా ప్రత్యేక ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యంగా భారత్ ఎన్నో దేశాలకు, తరాలకు ఆదర్శంగా నిలిచింది. ఇది చాలా గొప్ప విషయం. ప్రజాస్వామ్యాన్ని ఎప్పుడూ తేలికగా తీసుకోకూడదు, దానిని నిరంతరం బలోపేతం చేసుకోవాలి. ప్రపంచంలోని ఎన్నో దేశాలు మీ వైపు చూస్తున్నాయని ఆమె అన్నారు. తాను భారత్‌ను మనస్ఫూర్తిగా ఆరాధిస్తానని, తన కుమార్తె కొన్ని నెలల క్రితమే భారత్‌ను సందర్శించిందని, అక్కడి సంస్కృతిని ఎంతో ఇష్టపడిందని ఆమె చెప్పారు. మహాత్ముడి అహింసాయుత పోరాటం తనకు స్ఫూర్తి నిచ్చిందని, శాంతియుతంగా ఉండటం బలహీనత కాదని గాంధీ ప్రపంచానికి చాటిచెప్పారని ఆమె పేర్కొన్నారు. వెనిజులాలో నెలకొన్న రాజకీయ సంక్షోభం గురించి మాట్లాడుతూ, 2024 జులై 28న జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో తమ కూటమి ఘన విజయం సాధించినప్పటికీ, నికోలస్ మదురో ప్రభుత్వం ఫలితాలను తారుమారు చేసిందని ఆమె ఆరోపించారు. విపక్షాల అభ్యర్థిగా ప్రైమరీ ఎన్నికల్లో నేను 93 శాతం ఓట్లతో గెలిచాను. కానీ, నియంతృత్వ ప్రభుత్వం నన్ను పోటీ చేయనీయకుండా నిషేధం విధించింది. దాంతో, ఓ దౌత్యవేత్త మా తరఫున నిలబడ్డారు. మేము 70 శాతం ఓట్లతో గెలిచాం. దీనికి సంబంధించిన 85 శాతం ఓటింగ్ పత్రాలను డిజిటలైజ్ చేసి ఆధారాలుగా సేకరించాం. మేం గెలిచిన తర్వాత చర్చల ద్వారా అధికార మార్పిడికి మదురోకు అవకాశం ఇచ్చినా ఆయన నిరాకరించారు. ఆ తర్వాత దేశ చరిత్రలోనే అత్యంత దారుణమైన అణచివేతకు పాల్పడ్డారు. వేలాది మంది అమాయకులు అదృశ్యమయ్యారు. మహిళలు, చిన్నారులపై చిత్రహింసలకు పాల్పడ్డారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. వెనిజులాలో ప్రజాస్వామ్య పునరుద్ధరణ పోరాటంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తమకు ప్రధాన మిత్రుడని మచాడో అభివర్ణించారు. అమెరికా, లాటిన్ అమెరికా, యూరప్ దేశాల మద్దతుతో ఏర్పడుతున్న అంతర్జాతీయ కూటమితో మదురో పాలనకు చరమగీతం పాడే సమయం ఆసన్నమైందని ఆమె అన్నారు. వెనిజులాలో నేరపూరిత సోషలిస్టు పాలన అంతమైన తర్వాత ఇంధనం, మౌలిక వసతులు, టెలికం వంటి రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు భారత కంపెనీలకు గొప్ప అవకాశాలు ఉంటాయని ఆమె అభిప్రాయపడ్డారు.

# బురఖా వేసుకుని మాముందునుంచే తప్పించుకున్నాడు

## బిన్‌లాడెన్‌పై అమెరికా సిఐఎ అధికారి సంచలన వ్యాఖ్యలు

**వాషింగ్టన్, అక్టోబరు 25:** అమెరికాను వణికించిన అల్ ఖైదా చీఫ్ బిన్ లాడెన్ గురించి సీఐఏ మాజీ అధికారి జాన్ కిరియాకో ఒక సంచలన సంఘటన తెలిపారు. 2001 సెప్టెంబర్ 11న అల్ ఖైదా టెర్రరిస్టులు విమానాలను హైజాక్ చేసి అమెరికాలోని ట్విన్ టవర్స్ ను కూల్చివేసిన సంగతి తెలిసిందే. ఈ దాడి తర్వాత అమెరికా బలగాలు అల్ ఖైదా చీఫ్ ఒసామా బిన్ లాడెన్ కోసం వేట మొదలు పెట్టాయి. అమెరికా బలగాలను ముఖ్యంగా సీఐఏను ముప్పుతిప్పలు పెట్టిన లాడెన్ చివరకు 2011 మే 2న పాకిస్థాన్ లోని అబోట్టాబాద్ లో హతమయ్యాడు. ట్విన్ టవర్స్ ను కూల్చివేసిన పదేళ్ల తర్వాత లాడెన్ ను అమెరికా బలగాలు తుదముట్టించాయి. అయితే,లాడెన్ అంతకుముందే తమకు పట్టుబడేవాడని, త్రుటిలో తప్పించుకున్నాడని జాన్ కిరియాకో చెప్పారు. 2001 సెప్టెంబర్ 11న ట్విన్ టవర్స్ కూల్చివేత తర్వాతి నెలలో అంటే అక్టోబర్ లోనే ఆఫ్ఘనిస్థాన్ లోని టోరాబోరా కొండల్లో అల్ ఖైదా స్థావరాన్ని సీఐఏ బలగాలు చుట్టుముట్టాయని వివరించారు. ఆ సమయంలో



బిన్ లాడెన్ కూడా అక్కడే ఉన్నాడని చెప్పారు. లాడెన్ కదలికలపై పక్కాగా నిఘా పెట్టి టోరాబోరా కొండల్లో అతడిని పట్టుకోవడమో లేక హతమార్చడమో చేసేందుకు ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళ్లామని వివరించారు.

అల్‌ఖైదా కూడా తమకు కౌంటర్‌గా కుయుక్తులు పన్నిందని, అందులో మొదటగా తమ సానుభూతిపరుడిని మా వద్దకు పంపించిందని జాన్ కిరియాకో చెప్పారు. ఆఫ్ఘనిస్థాన్ లో లాడెన్ కోసం వేటాడుతున్న క్రమంలో తమకు స్థానిక భాషలు తెలిసిన అనువాదకుడి అవసరం ఏర్పడిందన్నారు. ఇందుకోసం తాము నియమించుకున్న స్థానికుడు అల్ ఖైదా సానుభూతిపరుడేనని తర్వాత తెలిసిందన్నారు. టోరాబోరా కొండలను చుట్టుముట్టిన తర్వాత టెర్రరిస్టుల నుంచి తమకు ఓ ప్రతిపాదన వచ్చిందన్నారు. తమ వద్దనున్న మహిళలు, పిల్లలను క్షేమంగా బయటకు పంపించాక తాము లొంగిపోతామని టెర్రరిస్టులు చెప్పారని, ఇందుకోసం సాయంత్రం దాకా వేచి ఉండాలని ప్రతిపాదించారని వివరించారు. తమకు అనువాదకుడిగా పనిచేసిన వ్యక్తి ఈ ప్రతిపాదనకు అధికారులను ఒప్పించాడన్నారు. తీరా సాయంత్రం మసక చీకట్లలో మహిళలతోపాటు బిన్ లాడెన్ కూడా ఓ బురఖా ధరించి తమ పక్క నుంచే వెళ్లిపోయాడని జాన్ కిరియాకో వివరించారు. నాడు అల్ ఖైదా టెర్రరిస్టుల ప్రతిపాదనకు ఒప్పుకోకుంటే లాడెన్ ను 2001లోనే తుదముట్టించే వాళ్లమని కిరియాకో తెలిపారు.



## ఎంట్రీ, ఎగ్జిట్‌లో ఫొటోలు

# అమెరికాలో మరో కొత్త రూల్

**న్యూఢిల్లీ, అక్టోబరు 25:**వలసల నియంత్రణ దిశగా ట్రంప్ యంత్రాంగం మరో నిర్ణయం తీసుకుంది. అమెరికాయేతర పౌరులు దేశం వీడే లేక దేశంలోకి అడుగుపెట్టే సమయంలో అధికారులు వారి ఫొటోలు తీయనున్నారు. గ్రీన్‌కార్డుదారుల తో పాటు వలసదారులందరికీ ఈ కొత్త నిబంధన వర్తించనుంది. ఫెడరల్ రిజిస్టర్‌లో తాజాగా ఈ నిబంధనలను ప్రచురించారు. వాటి ఆధారంగా ఏ మార్గంలో అయినా దేశాన్ని వీడే, దేశంలోకి అడుగుపెట్టే వారి ఫొటోలు, డేటా సేకరణను యూఎస్ కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ పెంచనుంది. ఫేక్ ట్రావెల్ పేపర్లను గుర్తించేందుకు, జాతీయ భద్రతను బలోపేతం చేసేందుకు డిసెంబర్ 26 నుంచి ఈ నిబం ధనలను అమలు చేయనుంది. వివిధ మార్గాల్లో ఇమ్మిగ్రేషన్ చట్టాల నుంచి తప్పించుకోవడానికి ప్రయత్నించేవారిని, వీసా గడువు ముగిసిన తర్వాత కూడా దేశంలోనే ఉంటున్నవారిని గుర్తించేందుకు వీలవుతుందని ట్రంప్ యంత్రాంగం భావిస్తోంది. ఇక, 2021 లోనే ఈ కొత్త నియంత్రణలు ప్రతిపాదించగా ఇప్పుడు పూర్తిస్థాయిలో సాంకేతికత ఉపయోగించి అక్రమవలసదారులకు చెక్ పెట్టనున్నారు. కాగా మేక్ అమెరికా గ్రేట్ అగైన్ అంటూ జాతీయవాదాన్ని బలంగా వినిపిస్తోన్న ట్రంప్ హెచ్ 1 బి వీసాలకు సంబంధించి నిబంధనలు విధించారు. వాటి వార్షిక రుసుమును ఒకేసారి లక్ష డాలర్లకు పెంచేసి సంచలనం సృష్టించారు. అనంతరం పలు సవరణలు చేశారు. ఈ వీసా వ్యవస్థనుసరిదిద్దడానికి, అమెరికన్లకు ప్రాధాన్యం ఇవ్వడానికి అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ లక్ష డాలర్ల ఫీజు నిర్ణయంతీసుకున్నారని వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లివిట్ వెల్లడించిన సంగతి తెలిసిందే.

# రాజస్థాన్‌లో భారీగా బంగారం నిక్షేపాలు



**జైపూర్, అక్టోబరు 25:** దేశంలో అత్యధిక ఖనిజ సంపద కలిగిన రాష్ట్రాల్లో ఒకటైన రాజస్థాన్, ఇప్పుడు బంగారు నిల్వలపరంగా ఇన్వెస్టర్ల దృష్టిని ఆకర్షిస్తోంది. రాష్ట్రంలోని గిరిజన ప్రాంతమైన బన్స్‌వారా జిల్లాలో భారీగా బంగారు నిక్షేపాలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ ఆవిష్కరణతో బన్స్‌వారా దేశానికి కొత్త స్వర్ణ రాజధానిగా మారే అవకాశం ఉంది. జిల్లాలోని ఘటోల్ తెహసీల్ పరిధిలోని కంకారియా గ్రామంలో ఈ నిల్వలను గుర్తించారు. ఇప్పటికే ఇక్కడ ఉన్న భుకియా, జగ్‌పురా గనుల తర్వాత ఇది మూడో అతిపెద్ద బంగారు గనిగా నిలవనుంది. భూగర్భ శాస్త్రవేత్తలు జరిపిన సర్వేల ప్రకారం, కంకారియా ప్రాంతంలో దాదాపు 3 కిలోమీటర్ల మేర బంగారు ఖనిజం విస్తరించి ఉన్నట్లు బలమైన ఆధారాలు లభించాయి. ఈ ప్రాంతంలో మొత్తం 940.26 హెక్టార్ల విస్తీర్ణంలో 113.52 మిలియన్ టన్నుల బంగారు ఖనిజం ఉండవచ్చని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ఈ ఖనిజాన్ని శుద్ధి చేసిన తర్వాత సుమారు 222.39 టన్నుల స్వచ్ఛమైన బంగారం లభించవచ్చని నిపుణులు చెబుతున్నారు. రాజస్థాన్‌లో ఇప్పటివరకు వెలుగు చూసిన అతిపెద్ద బంగారు నిల్వల్లో ఇది కూడా ఒకటి కావడం గమనార్హం. కంకారియాగారా ప్రాంతంలో బంగారంతో పాటు రాగి, నికెల్, కోబాల్ట్ వంటి ఇతర విలువైన ఖనిజాలు కూడా లభించే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అన్ని అనుమతులు లభించి, మైనింగ్ కార్యకలాపాలు ప్రారంభమైతే, భారతదేశంలో బంగారం తవ్వకాలు జరిపే అతికొద్ది రాష్ట్రాల జాబితాలో రాజస్థాన్ కూడా చేరుతుంది. భవిష్యత్తులో దేశం మొత్తం బంగారం డిమాండ్‌లో 25 శాతం వరకు ఒక్క బన్స్‌వారా జిల్లా నుంచే సరఫరా చేసే సామర్థం ఉందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఇదిలా ఉండగా, గతంలో భుకియా జగ్‌పురా మైనింగ్ బ్లాక్‌ల కోసం ప్రభుత్వం నిర్వహించిన వేలంలో గెలిచిన సంస్థ.. అవసరమైన హామీ మొత్తాన్ని జమ చేయడంలో విఫలమైంది. దీంతో ప్రభుత్వం ఆ లైసెన్స్‌ను రద్దు చేసింది. ప్రస్తుతం ఈ బ్లాక్‌ల కోసం మళ్లీ టెండర్ల ప్రక్రియ పూర్తి కాగా, నవంబర్ 3న బిడ్లను తెరవనున్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి అత్యధిక రెవెన్యూ వాటాను చెల్లించే సంస్థకు మైనింగ్ లైసెన్స్‌ను కేటాయించనున్నారు.

# వైద్యురాలి ఆత్మహత్యలో హౌస్ ఓనర్ కుమారుడు అరెస్టు

**సతారా, అక్టోబరు 25:**మహారాష్ట్రలోని సతారాలో వైద్యురాలి ఆత్మహత్య కేసులో ప్రధాన నిందితుల్లో ఒకడైన ప్రశాంత్ బంకర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. డాక్టర్ అద్దెకు ఉంటున్న ఇంటి యజమాని కుమారుడే ఈ ప్రశాంత్ బంకర్. అరెస్ట్ అనంతరం అతడిని వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్లు అధికారులు తెలిపారు. మరోవైపు, అత్యాచారం ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీస్ సబ్‌ఇన్‌స్పెక్టర్ (పీఎస్‌ఐ) గోపాల్ బదోనే పరారీలో ఉన్నాడు. బీడ్ జిల్లాకు చెందిన డాక్టర్ సంపద ముండే (28), ఫల్టాన్‌లోని ఓ ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్నారు. గురువారంరాత్రి ఆమె ఓ హోటల్ గదిలో విగతజీవిగా కనిపించారు. ఘటనాస్థలంలో లభించిన సూసైడ్ నోట్‌లో, పీఎస్‌ఐ గోపాల్ బదౌనే గత ఐదు నెలలుగా తనపై అనేక సార్లు అత్యాచారం చేశాడని ఆమె ఆరోపించారు. ఇంటి యజమాని కొడుకు ప్రశాంత్ బంకర్ తనను మానసికంగా తీవ్ర వేధింపులకు గురిచేశాడని ఆమె పేర్కొన్నారు. పోలీసులు ఆమె అరచేతిపై రాసి ఉన్న నోట్‌ను కూడా ఫోరెన్సిక్ విశ్లేషణకు పంపారు. పోలీసుల దర్యాప్తు ప్రకారం పీఎస్‌ఐ గోపాల్‌తో కుమ్మక్కై ప్రశాంత్ బంకర్ డాక్టర్‌ను మానసికంగా వేధించాడు. అద్దె గదిని ఖాళీ చేయాలంటూ పలుమార్లు బెదిరింపులకు పాల్పడ్డాడు. డాక్టర్ ఆరోపణలు చేసిన పోలీసు అధికారులతో ప్రశాంత్‌కు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని దర్యాప్తులో తేలింది. ఈ ఘటనపై పోలీసులు అత్యాచారం, ఆత్మహత్యకు ప్రేరేపించడం వంటి సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. మృతురాలి కుటుంబ సభ్యులు సంచలన ఆరోపణలు చేస్తున్నారు. తప్పుడు పోస్ట్‌మార్టం నివేదికలు తయారు చేయాలని ఆమెపై రాజకీయ, పోలీసు ఒత్తిళ్లు వచ్చాయని వారు ఆరోపించారు. ఈ విషయంపై ఆమె డీసీపీకి ఫిర్యాదు చేస్తూ లేఖ రాసినా ఎవరూ పట్టించుకోలేదు. ఆమెకు న్యాయం జరగాలని ఆమె బంధువు ఒకరు తెలిపారు. ప్రస్తుతం ప్రశాంత్‌బంకర్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు, పరారీలో ఉన్న పీఎస్‌ఐ గోపాల్ బదానే కోసం ప్రత్యేకబృందాలతో గాలింపు ముమ్మరం చేశారు.

# మాతోకూర్చుని భోజనం చేసినవారే ద్రోహం చేసారు

## నాలుగోసీటు బిజెపి గెలుపుపై సిఎం ఒమర్ అబ్దుల్లా

**శ్రీనగర్, అక్టోబరు 25:** జమ్మూకశ్మీర్‌లో ఇటీవలే జరిగిన రాజ్యసభ ఎన్నికల ఫలితాలపై ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా సంతృప్తి, అసంతృప్తి రెండూ వ్యక్తం చేశారు. నాలుగు స్థానాల్లో మూడింటిని నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ) గెలుచుకోవడం సంతోషంగా ఉన్నప్పటికీ, మిత్రపక్షాల దగా కారణంగా ఒక సీటును బీజేపీకి కోల్పోయామని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీనగర్‌లో విలేకరులతో ఒమర్ అబ్దుల్లా మాట్లాడుతూ నాలుగు సీట్లనూ గెలుచుకోవడానికి నేషనల్ కాన్ఫరెన్స్ అన్ని విధాలా ప్రయత్నించింది. కానీ, చిరకాలంగా మాతో కూటమిలో ఉన్న కొందరు మిత్రులు చివరి నిమిషంలో మాకు ద్రోహం చేశారని ఒమర్ అన్నారు. మాతో కూర్చుని, మాతో కలిసి భోజనం చేసిన వాళ్లే చివరికి బీజేపీ వైపు నిలబడటం దురదృష్టకరం. నేను వారి పేర్లు చెప్పదలుచుకోలేదు, ప్రజల ముందు వారే దోషులుగా నిలబడ్డారని ఆయన వ్యాఖ్యానించారు. ముఖ్యంగా హంద్వారా ఎమ్మెల్యే సజ్జాద్ లోన్ ఓటింగ్‌కు దూరంగా ఉండాలని నిర్ణయించుకోవడం బీజేపీ అవకాశాలకు స్పష్టంగా మేలు చేసిందని సీఎం పేర్కొన్నారు. ఆయన కొన్ని కారణాల వల్ల ఓటు వేయకూడదని నిర్ణయించుకున్నారు, కానీ ఆయన చర్య పరోక్షంగా బీజేపీకి లాభం చేకూర్చిందని ఒమర్ వివరించారు. ఈ సందర్భంగా ఎన్‌సీ అభ్యర్థులకు మద్దతుగా నిలిచిన కాంగ్రెస్, స్వతంత్ర శాసనసభ్యులకు ఒమర్ అబ్దుల్లా కృతజ్ఞతలు తెలిపారు. నేషనల్ కాన్ఫరెన్స్‌కు చెందిన ఒక్క ఓటు కూడా వృథా కానందుకు నేను సంతృప్తిగా ఉన్నానని ఆయన అన్నారు. తమ పార్టీ అభ్యర్థులకు ఓటు వేసిన ప్రతి ఒక్కరికీ, ఇతర పార్టీల సభ్యులతో సహా అందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. ఎన్‌సీ నుంచి కొత్తగా ఎన్నికైన రాజ్యసభ సభ్యులు పార్లమెంటులో కీలక ప్రజా సమస్యలను లేవనెత్తుతారని ఆయన తెలిపారు. జమ్మూకశ్మీర్‌కు పూర్తి రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలన్న డిమాండ్‌ను వారు పార్లమెంటులో బలంగా వినిపిస్తారు. అలాగే, ఈ ప్రాంత ప్రత్యేక హోదాకు సంబంధించి మా అసెంబ్లీ ఆమోదించిన తీర్మానాన్ని ముందుకు తీసుకెళతారని ఒమర్ స్పష్టం చేశారు.



మరోవైపు, వినూత్నమైన ఉద్యానవన కార్యక్రమాల ద్వారా కశ్మీర్ లోయలో పర్యాటక సీజన్‌ను పొడిగించినందుకు ఫ్లోరికల్చర్ విభాగాన్ని సీఎం ప్రశంసించారు. కశ్మీర్‌లో వేసవి తర్వాత పూలు పూయవనే అపోహ ఉండేది. తులిప్ గార్డెన్‌తో పర్యాటక సీజన్‌ను ముందుగా ప్రారంభించి, గుల్‌ఎదావూద్ గార్డెన్‌తో పొడిగించడం ద్వారా పర్యాటకాన్ని గణనీయంగా పెంచవచ్చని మేము గ్రహించామని చెబుతూ, ఇందుకు కృషి చేసిన తోటమాలి, అధికారులందరినీ ఆయన అభినందించారు.

# బాలీవుడ్ సింగర్‌పై లైంగిక వేధింపుల కేసు నమోదు



**ముంబయి, అక్టోబరు 25:** ప్రముఖ బాలీవుడ్ గాయకుడు, సంగీత దర్శకుడు సచిన్ సంఘ్వీపై లైంగిక దాడి కేసు నమోదైంది. ఓ గాయని ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముంబైలోని విలే పార్లే పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి, కెరీర్‌లో సాయం చేస్తానని చెప్పి తనను శారీరకంగా, మానసికంగా వేధించాడని బాధితురాలు తన ఫిర్యాదులో ఆరోపించారు. బాధితురాలు, సచిన్ సంఘ్వీకి గతేడాది సోషల్ మీడియా ద్వారా పరిచయం ఏర్పడింది. 2024 ఫిబ్రవరి నుంచి 2025 జూలై వరకు తామిద్దరూ రిలేషన్‌షిప్‌లో ఉన్నామని, ఆ సమయంలో తనను తీవ్రంగా వేధించాడని ఆమె పేర్కొన్నారు. పెళ్లి ప్రస్తావన తెచ్చిన తర్వాత సచిన్ తనను దూరం పెట్టడం మొదలుపెట్టాడని, తమ సంబంధం గురించి బయటకు చెబితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని బెదిరించాడని ఆమె ఆరోపించారు. అంతేకాకుండా, బలవంతంగా తనకు అబార్షన్ చేయించాడని కూడా ఫిర్యాదులో తెలిపారు. గత కొంతకాలంగా తీవ్ర మానసిక ఒత్తిడికి గురవడంతో పాటు, కుటుంబ సభ్యుల నుంచి వస్తున్న ఒత్తిడి కారణంగా ఈ ఏడాది ఆగస్టులో పోలీసులను ఆశ్రయించినట్లు బాధితురాలు వెల్లడించారు. ఈ ఆరోపణలపై సచిన్ సంఘ్వీ తరఫు న్యాయవాది ఆదిత్య మిథే స్పందించారు. నా క్లయింట్‌పై చేసిన ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవి. ఈ కేసులో ఎలాంటి పస లేదు. సచిన్‌ను చట్టవిరుద్ధంగా నిర్బంధించి, ఆ తర్వాత బెయిల్‌పై విడుదల చేశారు. అన్ని ఆరోపణలను మేము కోర్టులో తిప్పికొడతామని ఆయన పేర్కొన్నారు. మరోవైపు, బాధితురాలి తరఫు న్యాయవాది మాట్లాడుతూ, మా క్లయింట్‌కు న్యాయవ్యవస్థపై పూర్తి నమ్మకం ఉంది. నిందితుడు ఎంతటి పలుకుబడి ఉన్న వ్యక్తి అయినా చట్టం తన పని తాను చేసుకుపోతుంది. న్యాయం జరిగేంత వరకు పోరాడతామని తెలిపారు. ఈ కేసు విచారణలో ఉన్నందున మరిన్ని వివరాలు వెల్లడించలేమని అన్నారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



# విశ్వాసం కోల్పోతున్న యుఎన్

## విదేశాంగమంత్రి జైశంకర్

**న్యూఢిల్లీ, అక్టోబరు25:** ఐక్యరాజ్యసమితి పని తీరును విదేశాంగ మంత్రి జైశంకం తప్పుపట్టారు. యునైటెడ్ నేషన్స్‌పై తీవ్ర విమర్శలు చేసిన ఆయన ఆ సంస్థ గ్రిడ్‌లాక్ అయ్యిందన్నారు. ఏకపక్షంగా వ్యవహరిస్తోందన్నారు. ప్రాతినిధ్యం మరిచిపోయిందన్నారు. ఉగ్రవాదం, ప్రపంచ ప్రగతిపై నిర్ణయాలు తీసుకోవడం విఫలమైన ఆ సంస్థ తన విశ్వాసాన్ని కోల్పోయినట్లు పేర్కొన్నారు. ఐక్యరాజ్యసమితిలో బలమైన దేశంగా భారత్ ఉందన్నారు. కానీ ఆ ప్రపచ సంస్థ ప్రస్తుతం సంక్షోభంలో ఉందన్నారు. చట్టబద్ధమైన, ప్రభావంతమైన పనితీరును వ్యవహరించడం లేదని విమర్శించారు. ఐక్యరాజ్యసమితిలో అంతా సవ్యంగా లేదన్న విషయాన్ని గ్రహించాలని జైశంకర్ తెలిపారు. ఆ సంస్థ తీసుకుంటున్న నిర్ణయాలు.. సభ్య దేశాలకు నిదర్శనంగా లేదన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సమస్యలను కూడా ఆ సంస్థ పరిష్కరించడం లేదన్నారు. యూఎన్‌లో జరుగుతున్న చర్చలన్నీ ఏకపక్షంగా సాగుతున్నాయని, ఆ సంస్థ పని విధానం గ్రిడ్‌లాక్ అయ్యిందన్నారు. ఐక్యరాజ్యసమితిలో సంస్కరణలను నిలిపివేశారని, దానికి తోడు ఇప్పుడు ఆర్థిక సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయన్నారు. యూఎన్ భద్రతా మండలిలో మార్పులు చేయాలని, భారత్‌తోపాటు జపాన్, జర్మనీ, బ్రెజిల్ దేశాలకు పర్మనెంట్ సభ్యత్వాన్ని ఇవ్వాలని జైశంకర్ గుర్తు చేశారు. ఉగ్రవాదసంస్థలపైనా కానీ, ఆ దేశాలకు అండగా ఉన్న దేశాలపై చర్యలు తీసుకోవడంలో యూఎన్ విఫలమైందన్నారు. పెహల్గామ్‌లో ఉగ్రదాడికి పాల్పడిన పాకిస్థాన్‌పై ఆంక్షలు విధించకుండా చైనా అడ్డుకుంటోందని ఆరోపించారు.

# లాలూ, రబ్రీ సర్కారు వస్తే మళ్లీ ఆటవిక పాలనే

## కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ధ్వజం



**పాట్నా, అక్టోబరు 25:** బీహార్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో సీనియర్ బిజెపి నాయకుడు, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తన మాటల జోరు పెంచారు. శనివారం ఖగారియాలో ఎన్నికల ప్రచార సభలో మాట్లాడిన షా.. ప్రతిపక్ష కూటమిపై దుమ్మెత్తిపోశారు. ప్రతిపక్ష మహాఘట్‌బంధన్‌కు ఓటేస్తే ఆటవిక పాలనను కొనితెచ్చుకున్నట్లేనని ఓటర్లను హెచ్చరించారు. ఎన్డీయే సర్కారు బిజెపిని అభివృద్ధిపథంలో నడిపించిందని అమిత్‌షా అన్నారు. మళ్లీ అధికార కూటమినే గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో ఆటవిక పాలన కావాలో, అభివృద్ధి పాలన కావాలో మీరే తేల్చుకోవాలని అన్నారు. లాలూ, రబ్రీదేవీల సర్కారు వచ్చిందంటే.. దాంతోపాటు జంగిల్‌రాజ్ కూడా వస్తుందని వ్యాఖ్యానిం చారు. ఎన్డీ యెను గెలిపిస్తే అభివృద్ధి చెందిన బీహార్‌ను చూస్తారని చెప్పారు. ఎన్డీయే కూటమి ఐదుగురు పాండవులతో కూడిన కూటమి అని, ఈ కూటమిని గెలిపిస్తే రాష్ట్రంలో అన్నీ విజయాలేనని షా అన్నారు. ఈ మహాఘట్‌బంధన్, లఠ్‌బంధన్‌లు రికార్డు స్థాయిలో అవినీతికి పాల్పడ్డాయని షా ఆరోపిం చారు. 'వాళ్లు బీహార్‌ను అభివృద్ధి చేస్తారా?' అని ప్రశ్నించారు. నయాపైసా కూడా అవినీతికి పాల్పడని నరేంద్రమోడీ, నితీశ్‌కుమార్‌లతో బీహార్ అభివృద్ధి సాధ్యమని చెప్పారు.

# పురుషుడిపై మేల్‌నర్స్ లైంగికదాడి: యేడాదిజైలు, రెండు కొరడా దెబ్బల శిక్ష

**సింగపూర్‌సిటీ, అక్టోబరు 25:** సింగపూర్‌లోని ఓ ఆసుపత్రిలో స్టాఫ్‌మేల్ నర్సుగా పనిచేస్తున్న భారతీయుడు దారుణానికి పాల్పడ్డాడు. పురుషుడిపై లైంగిక వేధింపులకు పాల్పడిన కేసులో అతడిని దోషిగా తేల్చిన స్థానిక కోర్టు ఒక సంవత్సరం రెండు నెలల జైలు శిక్షతో పాటు రెండు కొరడా దెబ్బలశిక్ష విధిస్తూ శుక్రవారం తీర్పు వెలు వరించింది. 34 ఏళ్ల ఏలిపె శివ నాగు సింగపూర్‌లోని రాఫెల్స్ ఆసుపత్రిలో మేల్ నర్సుగా పనిచేస్తున్నాడు. ఈఏడాది జూన్ 18న ఆసుపత్రిలో చేరిన తన తాతను చూసేందుకు వచ్చిన ఓవ్యక్తిపై అతడు లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితుడు పేషెంట్ టాయిలెట్‌ను ఉపయోగిస్తుండగా శివనాగు గమనించాడు. ఆ తర్వాత, డిస్‌ఇన్‌ఫెక్ట్ చేస్తాననే నెపంతో బాధితుడి వద్దకు వెళ్లి, చేతికి సబ్బు రాసుకుని అతడిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని డిప్యూటీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ యూజీన్ ఫువా కోర్టుకు తెలిపారు.

# సంక్షిప్తంగా..

## ఆర్జేడిలోకి మళ్లీ రావడం కంటే చావే మంచిది: తేజ్ ప్రతాప్



**పాట్నా, అక్టోబరు 25:** బీహార్ మాజీ మంత్రి, ఆర్జేడి చీఫ్ లాలూప్రసాద్ యాదవ్ పెద్ద కుమా రుడు తేజ్ ప్రతాప్‌యాదవ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆర్జేడిలోకి తిరిగి రావడం కంటే మర ణాన్నే ఎంచుకుంటానని అన్నారు. పార్టీతో కుటుంబం నుంచి బహిష్కరణకు గురైన తేజ్ ప్రతాప్‌యాదవ్ జనశక్తి జనతాదళ్ పార్టీని స్థాపించారు. 2015లో తొలిసారి అసెంబ్లీ ఎన్ని కల్లో గెలిచిన మహువా స్థానం నుంచి ఆయన పోటీ చేస్తున్నారు. కాగా, శుక్రవారం పిటిఐకి తేజ్ ప్రతాప్‌యాదవ్ ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆర్జేడికి తిరిగి వెళ్తారా? అన్న ప్రశ్నకు ఆయన సూటిగా సమాధానమిచ్చారు. 'ఆ పార్టీకి తిరిగి రావడం కంటే నేను మరణాన్ని ఎంచుకుంటా. అధికారం చేపట్టాలన్న ఆకలి నాకు లేదు. నైతిక సూత్రాలు, ఆత్మగౌరవం నాకు అత్యున్నతమైనవి' అని అన్నారు.

## యతీంద్ర అలా అనలేదు: సిఎం సిద్దరామయ్య



**బెంగళూరు, అక్టోబరు 25:** కర్ణాటకలో ముఖ్య మంత్రి మార్పు అంశంపై కొద్ది కాలంగా చర్చ జరుగుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య తనయుడు, ఎమ్మెల్సీ యతీంద్ర ఇటీవల చేసిన వ్యాఖ్యలు సొంత పార్టీ వర్గాల్లో కలకలం రేపుతున్నాయి. దీనిపై సిద్ధరామయ్య తొలిసారిస్పందించారు. యతీంద్ర వ్యాఖ్యలను వక్రీకరించారని తెలిపారు. 'అసలు ఏమి చెప్ప దలచుకున్నావని యతీంద్రను నేను అడిగాను. తన సిద్ధాంతాల గురించే చెప్పాలని అనుకు న్నట్టు యతీంద్ర తెలిపాడు. ఫలానా వ్యక్తి సిఎంకావాలని యతీంద్ర అనలేదు' అని సిద్ధరామయ్య వివరించారు. బెళగావి జిల్లాలో ఇటీవల జరిగిన ఒక కార్యక్రమంలో యతీంద్ర మాట్లాడుతూ తన తండ్రి రాజకీయకెరీర్ చివరి దశలో ఉందన్నారు. ఈ పరిస్థి తిలో బలమైన, ప్రగతిశీల భావ జాలం ఉన్ననాయకుడు కావాలని, ఆయనకు సిద్ధరామయ్యమార్గదర్శకంగా ఉంటారని చెప్పారు. సతీష్ జార్కిహోళికి ఆలక్షణాలు ఉన్నాయని చెప్పారు.

## లైంగికదాడిని ప్రతిఘటించిన యువతి హత్య

**పుణె, అక్టోబరు 25:** పుణెలో 20 ఏళ్ల యువతిపై అత్యాచారానికి యత్నించి, ఆమె ప్రతిఘటించడంతో కిరాతకంగా హత్య చేసిన ఘటనలో పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు. హవేలీ తాలుకాలోని ఉరులి కాంచన్‌కు చెందిన దినేశ్ సంజయ్ పటోలే(26) ఈ దారుణానికి పాల్పడినట్టు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. కోరెగావ్ ముల్ గ్రామానికి చెందిన బాధితురాలు ఈ నెల 14న రాత్రి 7:30గంటల సమయంలో రోడ్డు పక్కన శవమై కనిపించింది. ఆమె తలపై గాయంఉండటంతో ఆమె సోదరుడి ఫిర్యాదు మేరకు ఉరులి కాంచన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. లోకల్ క్రైమ్‌బ్రాంచ్‌కు చెందిన ఇన్స్‌పెక్టర్ అవినాశ్ శిలింకర్, ఉరులి కాంచన్ పోలీస్ స్టేషన్ ఇన్స్‌పెక్టర్ సచిన్ వాంగ్డే నేతృత్వంలోని బృందాలు దర్యాప్తు చేపట్టాయి.

## జర్నలిస్టులను కత్తులతో పొడిచి చంపిన దుండగులు

**ప్రయాగరాజ్, అక్టోబరు 25:** ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో దారుణం చోటుచేసుకుంది. లక్ష్మీ నారాయణ్ సింగ్ అలియాస్ పప్పు సింగ్ (54) అనే జర్నలిస్టును దుండగులు అత్యంత కిరాతకంగా నరికి చంపారు. నగరంలోని ఓ హోటల్ సమీపంలో గురువారం ఈ ఘటన జరిగింది. మృతుడు హైకోర్టు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు అశోక్ సింగ్‌కు మేనల్లుడు. పప్పు సింగ్‌పై కత్తులతో దాడిచేసిన నిందితులు ఆయన మెడ,పొట్ట,చేతులపై విచక్షణా రహితంగా పొడిచారు. ఆయన శరీరంపై 24కు పైగా లోతైన గాయాలయ్యాయి. తీవ్ర రక్తస్రావంతో కుప్పకూలిన ఆయన్ను వెంటనే స్వరూప్ రాణి నెహ్రూ ఆసుపత్రికితరలించారు. అయితే అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

## ఇద్దరు బాలీవుడ్ నటులపై చీటింగ్‌కేసు



**లక్నో, అక్టోబరు 25:** ప్రముఖ బాలీవుడ్ నటులు శ్రేయస్ తల్పడే, అలోక్ నాథ్ చిక్కుల్లో పడ్డారు. ఉత్తరప్రదేశ్‌లో ఒక భారీపెట్టుబడి మోసం కేసులో వీరిద్దరితోపాటు మరో 22 మందిపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. లోని అర్బన్ మల్టీస్టేట్ క్రెడిట్‌అండ్ థ్రిఫ్ట్ కోఆపరేటివ్ సొసైటీ పేరుతో జరిగిన ఈ మోసంలో నటులు బ్రాండ్ అంబాసిడర్లుగా వ్యవహరించారు. భాగ్‌పత్‌కు చెందిన బబ్లీ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ సొసైటీ ఏజెంట్లు గ్రామీణ ప్రాంతాల్లో పర్యటించి, తాము సేకరించే డిపాజిట్లపై భారీ లాభాలు వస్తాయని, ప్రజలను నమ్మిం చారు. శ్రేయస్‌తల్పడే, అలోక్‌నాథ్‌వంటి ప్రముఖ నటులు ఈసంస్థకు ప్రచారం చేస్తుండటంతో చాలామంది వీరిమాటలు నమ్మి లక్షల్లో పెట్టుబడులుపెట్టారు. ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో సుమారు 500మంది నుంచి రూ.5కోట్లకు పైగా వసూలుచేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

# ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులకు యూనిఫామ్!

## ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిన ఇంటర్ విద్యాశాఖ

## ప్రతి విద్యార్థికి రెండు జతలు ఇవ్వాలని ప్రతిపాదన

## సర్కార్ ఆమోదిస్తే వచ్చే యేడాది నుంచి అమలయ్యే అవకాశం

**హైదరాబాద్, అక్టోబరు 25, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులకు యూనిఫామ్‌తో కనిపించనున్నారు. అదేంటీ ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులకు యూనిఫామ్స్‌ను ప్రభుత్వం నిర్ణయించలేదు కదా.. అటువంటప్పుడు వారు యూనిఫామ్స్‌తో ఎలా కనిపిస్తారని అనుకుంటున్నారా? రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులకు కూడా యూనిఫామ్స్‌ను అమలు చేయాలని ఇంటర్ విద్యా శాఖ యోచిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని గవర్నమెంట్ జూనియర్ కాలేజీల్లోనూ ఒకేరకమైన డ్రెస్‌కోడ్‌తో యూనిఫామ్స్‌ను సిద్ధం చేయాలని అధికారులు యోచిస్తున్నారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను ఇంటర్ విద్య శాఖ ప్రభుత్వానికి పంపించినట్టు తెలుస్తోంది. రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదివే విద్యార్థులకు ప్రతి యేడాది రెండు జతల యూనిఫామ్స్ ఇవ్వాలని ఇంటర్ విద్య శాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించినట్టు తెలుస్తోంది. ఇప్పటికే రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదివే విద్యార్థులకు పూర్తిగా ఉచిత విద్యను అందిస్తున్న ఇంటర్ విద్య శాఖ.. ఇకపై తమ విద్యార్థులకు ఉచితంగా యూనిఫామ్స్‌ను అందించాలని.. అలా చేస్తే ప్రస్తుతం చేరుతున్న వారికంటే ఎక్కువ మంది విద్యార్థులు గవర్నమెంట్ జూనియర్ కాలేజీల్లో చేరే అవకాశం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. అలాగే యూనిఫామ్స్ అందజేస్తే విద్యార్థులు హాజరుశాతం కూడా పెరుగుతుందని అధికారులు అంచనావేస్తున్నారు. కాలేజీకని చెప్పి ఇంట్లో నుంచి వస్తున్న మగ విద్యార్థుల్లో కొందరు కాలేజీ రాకుండా చిల్లరగా తిరుగుతున్నారని.. యూనిఫామ్స్‌ను కనుక విద్యార్థులకు పంపిణీ చేసినట్టయితే వారు యూనిఫామ్‌తో బయటకనపడితే ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులని తెలుస్తుందని.. దీంతో భయపడి తప్పకుండా కాలేజీకి వస్తారనే అంచనాలో అధికారులున్నట్టు తెలుస్తోంది. అంతేకాకుండా యూనిఫామ్‌ను ఇస్తే విద్యార్థులు తమకు కూడా డ్రెస్ కోడ్ ఉందని, యూనిఫామ్ ధరించి ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీలకు చెందిన విద్యార్థుల మాదిరిగా భావించి కాలేజీకి రెగ్యులర్‌గా వచ్చే అవకాశం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. రాష్ట్రంలో 430 ప్రభుత్వ జూనియర్ కాలేజీలున్నాయి. వాటిల్లో సుమారు 1,41,000 విద్యార్థులు చదువుతున్నారు. వీరందరికీ రెండు జతల యూనిఫామ్స్ ఇవ్వాలని ఇంటర్ విద్య శాఖ ప్రతిపాదనలు పంపించినట్టు తెలుస్తోంది. విద్యార్థులకు రెండు జతల యూనిఫామ్స్‌ను అందజేస్తే ఏడాదికి ఎంత మేరకు ఖర్చు అవుతుందనే విషయాన్ని కూడా లెక్కలు వేసి ప్రభుత్వానికి సమర్పించినట్టు సమాచారం. ప్రభుత్వం ఇంటర్ విద్య శాఖ ప్రతిపాదనలను ఆమోదిస్తే.. ఇందుకు సంబంధించిన పనులను ప్రారంభించి వచ్చే ఏడాది నుంచి లేదంటే 2027-28 నుంచి అమలు చేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

# 10 ప్రభుత్వ జూనియర్ కాలేజీలకు కొత్త భవనాల నిర్మాణం

## రూ. 117.30 కోట్లు ఖర్చు.. పిఎంజెవికె పథకంలో నిర్మాణం చేపట్టనున్న ఇంటర్ విద్యాశాఖ

**హైదరాబాద్, అక్టోబరు 25, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని 10 ప్రభుత్వ జూనియర్ కాలేజీలకు కొత్త భవనాలను నిర్మించనున్నారు. ఇందుకోసం రూ. 117.30 కోట్లు ఖర్చు కానుంది. ఇందుకు సంబంధించిన నిధులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఖర్చు చేయనున్నాయి. మైనారిటీలు ఎక్కువగా నివాసం ఉండే ప్రాంతాల్లో కొనసాగే ప్రభుత్వ జూనియర్ కాలేజీలకు నూతన భవనాలను నిర్మించనున్నారు. ప్రధాన మంత్రి జన్‌వికాస్ కార్యక్రమ్(పిఎంజివికె) పథకంలో భాగంగా ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో నూతన భవనాలను నిర్మించనున్నారు. ఇందులో భాగంగా 60 శాతం కేంద్రం నిధులను ఇవ్వనుండగా.. మరో 40 శాతం నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వనుంది. రాష్ట్ర ప్రభుత్వ వాటాగా రూ. 46.92 కోట్లను ఖర్చు చేయనుండగా.. కేంద్రం రూ. 70.38 కోట్లను సాయంగా అందించనుంది. 10 ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో 4 కాలేజీలు హైదరాబాద్ జిల్లాలో ఉండగా ఒకటి నల్గొండ, ఒకటి ఆదిలాబాద్, రెండు నిర్మల్, ఒకటి మహబూబ్‌నగర్, ఒకటి నిజామాబాద్ జిల్లాల్లో ఉన్నాయి.

# వెనుకబడిన సుగంధ ద్రవ్యాల సాగు

## చింతపండుకు సైతం దిగుమతే గతి

## ఉద్యాన శాఖలో ప్రణాళికా లోపం

**హైదరాబాద్, అక్టోబరు 25, ప్రభాతవార్త:** సుగంధ ద్రవ్యాల సాగులో తెలంగాణ వెనుకబడపోయింది. ఉద్యాన శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా రాష్ట్రంలో సుగంధ ద్రవ్యాల సాగుపై రైతులు ముందుకు రావడం లేదు. దీంతో రాష్ట్రంలో ప్రధానంగా చింతపండు, అల్లం, వెల్లుల్లి, ధనియాలు, జీలకర్ర తదితర మసాలా దినుసులకు కొరత ఏర్పడింది. ఎండు మిర్చి, పసుపు సాగులో మాత్రం రాష్ట్రం అగ్రగామిగా ఉన్నా, చివరకు చింత పండును సైతం దిగుమతి చేసుకోవాల్సిన దుస్థితి తప్పడం లేదు. రాష్ట్రంలో ప్రతి రోజు సగటున ఒక్కొక్కరు 21.21 గ్రాముల సుగంధ ద్రవ్యాలను వినియోగిస్తున్నట్లు ఉద్యాన అధికారుల అంచనా. ఇలా రోజుకు 731 టన్నులు డిమాండ్ ఉండగా, ఏటా 2.63 లక్షల టన్నులు అవసరం ఉంటుందని అంచనా. చింతపండు, అల్లం, వెల్లుల్లి, ధనియాలు, జీలకర్ర, ఆవాలు, మిరియాలు తదితర సుగంధ ద్రవ్యాలు 1.78 లక్షల టన్నులు అవసరం ఉన్నది. ఈ డిమాండ్‌కు సరిపడా పంట రావాలంటే రాష్ట్రంలో 1.09 లక్షల ఎకరాల్లో ఈ పంటలు సాగుచే యాల్సి ఉంటుందని అధికారిక లెక్కలు వెల్లడిస్తున్నాయి. రాష్ట్రంలో లవంగాలు, యాలకులు, దాల్చిన చెక్క, జాపత్రి, జీలకర్ర వంటి విలువైన సుగంధ ద్రవ్యాలను ఇతర రాష్ట్రాలు, దేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. కానీ చింతపండు, అల్లం, వెల్లుల్లి, ధనియాల వంటివాటిని కూడా దిగుమతి చేసుకోవాల్సి వస్తున్నది. ఈ విధంగా ఏటా 61,564 టన్నుల చింతపండును దిగుమతి చేసుకుంటున్నారు. అలాగే రాష్ట్రంలో అల్లం 2,103 ఎకరాల్లో సాగవుతూ తద్వారా 20,489 టన్నుల ఉత్పత్తి అవుతోంది. అయితే అల్లం వినియోగం మాత్రం 68,419 టన్నులుగా ఉంది. ఈ లెక్కన రాష్ట్రంలో సాగైనది పోను ఇంకా 47,930 టన్నుల మేర ఇతర రాష్ట్రాల నుంచి వస్తోంది. ఇక వెల్లుల్లి విషయానికి వస్తే 27 ఎకరాల్లో మాత్రమే సాగవుతూ, 148 టన్నులు ఉత్పత్తి అవుతుండగా, వినియోగం మాత్రం 39,417 టన్నుల మేర ఉంటోంది. ధనియాలు రాష్ట్రం వ్యాప్తంగా 13,532 టన్నుల వినియోగం ఉండగా, 4,971 ఎకరాల్లో మాత్రమే సాగవుతోంది. తద్వారా 2,431 టన్నులు ఉత్పత్తి జరుగుతోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో దాదాపు లక్ష ఎకరాల్లో సుగంధ ద్రవ్యాల సాగు చేయాల్సిన అవసరం ఉందని అంచనా. ఇందుకు ఉద్యాన శాఖ అధికారులు ప్రోత్సహం కల్పించి సుగంధ ద్రవ్యాల సాగు విస్తీర్ణాన్ని పెంచేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# వేసవి విద్యుత్ కోసం ముందస్తు చర్యలు

## విద్యుత్ శాఖ ముఖ్యకార్యదర్శి మిట్టల్

**హైదరాబాద్, అక్టోబరు 25, ప్రభాతవార్త :** రాష్ట్రంలో వచ్చే వేసవిలో గరిష్ట డిమాండ్ 19 వేల మెగావాట్లకు మించే అవకాశం ఉన్న దృష్ట్యా దాన్ని అధిగమించేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ సూచించారు. హైదరాబాద్‌లో శనివారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ఈ ఏడాది గరిష్ట డిమాండ్ 17162 మెగావాట్లకు చేరినా దాన్ని అధిగమించి విద్యుత్ సరఫరాలో ఎక్కడా ఓవర్ లోడింగ్ సమస్యలు తలెత్తకుండా చేశారన్నారు. ఇదే విధంగా వేసవి ప్రారంభానికి ముందే లైన్ల మరమ్మతులు, కొత్త ట్రాన్స్ ఫార్మర్ల ఏర్పాటు, ఇతర అభివృద్ధి పనులన్ని డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని స్పష్టం చేశారు. వచ్చే ఏడాది భారీ డిమాండ్ నేపథ్యంలో ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్ పరిధిలో 103 నూతన సబ్ స్టేషన్ల ఏర్పాటు, ట్రాన్స్కో పరిధిలో పవర్ ట్రాన్స్ ఫార్మర్ల సామర్థ్యం పెంచుతున్నట్లు తెలిపారు. జెన్కో పరిధిలోని విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ల ఓవర్ హాలింగ్ దాదాపు అన్ని యూనిట్లలో పూర్తయ్యిందని చెప్పారు.



బిటిపిఎస్, కెటిపిఎస్ ఓవర్ హాలింగ్ త్వరలో పూర్తి చేయనున్నారని వెల్లడించారు. మరి కొద్ది నెలల్లో యాదాద్రి థర్మల్ లోని అన్ని యూనిట్లు అందుబాటులోకి రావడంతో మొత్తం 4000 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందన్నారు. కాగా థర్మల్ ప్లాంట్లకు అవసరమైన బొగ్గు అందుబాటులో ఉండేలా అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. వినియోగదారులకు మెరుగైన, పారదర్శక సేవలు అందించేందుకు ట్రాన్స ఫార్మర్ల, ఫీడర్లలో ఆటోమేషన్ విధానం తేవాలని చెప్పారు.

ఎలక్ట్రిక్ వెహికల్ ఛార్జింగ్ స్టేషన్ లకు ఇస్తున్న రాయితీలను ప్రభుత్వ సంస్థలు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసేలా అవగాహనా కల్పించాలన్నారు. హైదరాబాద్‌ను ఇవి హబ్‌గా మార్చడంలో విద్యుత్, రెడ్కో సంస్థలు పనిచేయాలని తెలిపారు. ఈ సమావేశంలో ట్రాన్స్కో, జెన్కో, ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్, సింగరేణి సిఎండిలు కృష్ణ భాస్కర్, హరీష్, బలరాం, ఫరూఖీ, వరుణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీఅచ్యుతా ఆగ్రోస్‌లో రూ.3.82 కోట్ల ధాన్యం మాయం

## 17 వాహనాలపై మోటారువాహనాల చట్టం ప్రయోగం

## మైనింగ్ అక్రమాలపై 8 కేసులు నమోదు.. రాష్ట్రవ్యాప్తంగా విజిలెన్స్ తనిఖీలు

**హైదరాబాద్, అక్టోబరు 25, ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా విజిలెన్స్ ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారులు శనివారం తెల్లవారుజాము వరకు వివిధ ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. శుక్రవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, వరంగల్ యూనిట్ అధికారులు ములుగు జిల్లాలోని మల్లంపల్లిలో ఉన్న శ్రీఅచ్యుత ఆగ్రో ఇండస్ట్రీస్ అనే రైస్‌మిల్లులో తనిఖీలు మొదలు పెట్టారు. ఆ రైస్‌మిల్లులో స్టాక్ తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. 2024-25 రబీ సీజన్‌కు సంబంధించిన 4780.80 క్వింటాళ్ల ధాన్యం, 2022-23 రబీ వేలం ధాన్యం 11191.26 క్వింటాళ్లు, మొత్తం 15972.06 క్వింటాళ్ల ధాన్యం రైస్ మిల్లులో లేదని వారు గుర్తించారు. నల్లబజారు పట్టించిన ధాన్యం విలువ రూ.మూడు కోట్ల 81లక్షల57వేల ,251 ఉంటుందని విజిలెన్స్ అధికారులు ప్రకటించారు. శ్రీ అచ్యుతా ఆగ్రోస్ రైస్ మిల్లరుపై ఇసి చట్టం ప్రకారం అవసరమైన చర్యలు తీసుకోవ డానికి ములుగు జిల్లా పౌర సరఫరాల అధికారికి విజిలెన్స్ ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారులు సూచిం చారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, హైదరాబాద్ రూరల్ యూనిట్ శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం తెల్లవారు జామున వరకు ఆకస్మిక రూట్ తనిఖీలు విస్తృతంగా చేశారు. మైనింగ్ శాఖ, రవాణా శాఖ విభాగాల అధికారులతో కలిసి రంగారెడ్డి జిల్లాలోని శంషాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు వద్ద నిర్వహించిన ఆకస్మిక తనిఖీలలో మోటారు వాహనాల చట్టం కింద 17 వాహనాలపై కేసులు నమోదు చేశారు. అలాగే గనులు మరియు ఖనిజాల చట్టం కింద 8 కేసులు నమోదు చేశారు. వసూలు చేసిన మొత్తం పన్ను సుమారు రూ.6,27,349 జరిమానా వసూలు చేశారు.



# ఎంజిఎం ఘటనలపై ఆరోగ్య మంత్రి దామోదర రాజనర్సింహా సీరియస్

## సూపరింటెండెంట్‌పై వేటుకి ఆదేశం

**హైదరాబాద్, అక్టోబరు 25, ప్రభాతవార్త:** వరంగల్‌లో ఉన్న ఎంజీఎం ప్రభుత్వాసుపత్రిలో జరుగుతున్న వరస సంఘటనలపై ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా సీరియస్ అయ్యారు. నిర్లక్ష్యం వ్యవహారించినహాస్పిటల్ సూపరింటెండెంట్‌పై వేటు వేయాలని అధికారులను ఆదేశించారు. సూపరింటెం డెంట్‌తోపాటు నిరక్ష్యంగా వ్యవహరిస్తున్న డాక్టర్లు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశిం చారు. ఎంజిఎం హాస్పిటల్‌ను గాడిన పెట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శికి మంత్రి సూచించారు. ప్రతివారం ఎంజీఎంపై సమీక్ష చేసి తనకు నివేదిక సమర్పించాలని డీఎంఈని మంత్రి ఆదేశించారు. అలాగే ఎంజీఎంలో గత కొన్నేళ్లుగా పాతుకు పోయిన ఉద్యోగుల వివరాలు సేకరించి, వారి పనితీరుపై సమగ్ర నివేదిక సమర్పించాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

# ఎసిబి వలలో సహకార సంఘాల డిప్యూటీ రిజిస్ట్రార్




**నస్పూర్, అక్టోబరు 25, ప్రభాతవార్త:** మంచిర్యాల జిల్లా సహకార సంఘాల డిప్యూటీ రిజిస్ట్రార్ రాథోడ్ భిక్కు లంచం తీసుకుంటూ ఆదిలాబాద్ ఏసీబీ అధికారుల వలలో చిక్కాడు. శనివారం ఉదయం మంచిర్యాల పట్టణంలోని ఆయన అద్దె ఇంటిపై ఏసీబీ అధికారుల బృందం దాడి నిర్వహించింది. రాథోడ్ భిక్కు ప్రస్తుతం మంచిర్యాల జిల్లా సహకార సంఘాల డిప్యూటీ రిజిస్ట్రార్‌గా, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా ఇన్‌చార్జిగా కూడా విధులు నిర్వహిస్తున్నారు. ఫిర్యాదుదారుడికి అనుకూలంగా వ్యవహారం చేయడం కోసం రాథోడ్ ముందుగా 7 లక్షల రూపాయలు లంచంగా డిమాండ్ చేశాడు. పలుమార్లు అభ్యర్థించడంతో మొత్తం 5 లక్షల రూపాయలకు ఒప్పుకున్నాడు. తొలి విడతగా 2 లక్షల రూపాయలు తీసుకుంటుండగా ఏసీబీ అధికా రులు పట్టుకున్నారు. ఏసీబీ ఆదిలాబాద్ డీఎస్పీ జి. మధు తెలిపిన వివరాల ప్రకారం గతంలో ఓ ఉద్యోగి సస్పెండ్ అయ్యాడు. అతడిని సస్పెన్షన్ నుంచి తిరిగి ఉద్యోగంలోకి తీసుకోవడం, జీవో 44 ప్రకారం వేతన సవరణల చేయడం, 2023 ఏప్రిల్ నుంచి పెండింగ్‌లో ఉన్న జీతాలు చెల్లించడం, సస్పెన్షన్ కాలానికి సంబంధించిన భత్యాలు మంజూరు చేయడం, విచారణ నివేదికపై చర్యలు తీసుకోకుండా ఉండేందుకు లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. దాడి అనంతరం నిర్వహించిన రసాయన పరీక్షలో రాథోడ్ కుడిచేయి వేళ్లు, లంచం డబ్బు తాకిన బనియన్ భాగం పాజిటివ్‌గా తేలిందని ఏసీబీ అధికారులు తెలిపారు. రాథోడ్ భిక్కును అరెస్టు చేసి కరీంనగర్ ఏసీబీ ప్రత్యేక న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచినట్లు, కేసు దర్యాప్తు కొనసాగుతున్నదని అధికారులు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు లంచం అడిగితే ప్రజలు నిర్భయంగా ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు కాల్, 9440446106 నెంబర్‌కు వాట్సాప్ ద్వారా సమాచారం ఇవ్వవచ్చు. ఎవరైనా లంచం అడిగితే ఈ సెల్ నంబర్ 9154388963లో సంప్రదించవచ్చు. ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచుతామని ఏసీబీ డీఎస్పీ జి. మధు తెలిపారు.

# ఇంటర్ పరీక్షల్లో ఇంటర్నల్ మార్కుల నిర్ణయం ఆత్మహత్యాసదృశం

## జిజెఎల్ఎ రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి

**హైదరాబాద్, అక్టోబరు 25, ప్రభాతవార్త:** వచ్చే యేడాది నుంచి ఇంటర్మీడియట్ విద్యా మండలి.. ఇంటర్ వార్షిక పరీక్షల్లో ఇంటర్నల్ మార్కులను అమలు చేయాలని తీసుకున్న నిర్ణయం ఇంటర్మీడియట్ విద్యా వ్యవస్థకు, ఇంటర్ విద్యార్థులకు ఆత్మహత్యా సదృశ్యమని ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి మధుసూదన్ రెడ్డి విమర్శించారు. ఇంటర్మీడియట్ విద్యా వ్యవస్థ 1969-70 విద్యా సంవత్సరం నుంచి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రారంభించబడి నప్పటి నుండి దేశంలోనే అత్యున్నత మైన ప్రమాణాలతో కొనసాగుతుందన్నారు. ఇంతటి ఘన చరిత్ర కలిగినది ఇంటర్ విద్యా మండలి.. దేశ వ్యాప్తంగా సిబిఎస్ఈ పుస్తకాలతో పోటీ పడే విధంగా గణిత శాస్త్రం, వృక్ష శాస్త్రం, జంతుశాస్త్రం దేశం లోనే అత్యున్నత విద్యా ప్రమాణాలు సొంతం చేసుకుందన్నారు. కొఠారీ కమిషన్ సిఫారసులకి అనుగుణంగానే 10+2+3 విధానాన్ని రాష్ట్రంలో ఆవిష్కరించిన ఘనత దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకి దక్కుతుందన్నారు. దేశంలోనే అత్యున్నత మైన ప్రమాణాలతో నిర్వహించేటువంటి ఐఐటి, ఎన్ఐటి కళాశాలల పరీక్షలు, ఎంసెట్ పరీక్షలకు కూడా స్వీయ తర్ఫీదును పొంది సీట్లు సాధించేలా చేసిన ఘనత ఇంటర్మీడియట్ విద్యా మండలికి ఉందన్నారు. ఇప్పుడు ఎలాంటి చర్చ లేకుండా.. ఇటు విద్యార్థుల అభిప్రాయాలుగానీ, అధ్యాపకుల అభిప్రాయాలుగానీ, యాజమాన్యం అభిప్రా యాలుగానీ.. ఆఖరికి తల్లిదండ్రుల అభిప్రాయా లు పరిగణనలోకి తీసుకోకుండా కేవలం ఫలితాల పెంపు అనే దురాలోచనతో ఇంటర్మీడియట్ విద్యా మండలి 20 మార్కులు ఇంటర్నల్‌కి, 80 మార్కులు ఎక్స టర్నల్ కి అనెటువంటి విధంగా పరీక్షా విధానాన్ని పుస్తకాల తయారీని చేపట్టడానికి తీసుకున్న నిర్ణయాన్ని తమ సంఘం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. వివిధ రాష్ట్రాలలో ఉన్నటువంటి పరిస్థితులు, ప్రమాణాలు వాటిని ఆసరాగా చేసుకుని ఈ నిర్ణయం తీసుకోవడంతో ఇంటర్మీడియట్ విద్యా మండలి ఒక పెద్ద తప్పుకు శ్రీకారం చుట్టిందన్నారు. దక్షిణాది రాష్ట్రాలైన కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాలలో ఇంట ర్నల్ మార్కుల సిస్టం ఉన్నమాట వాస్తవమని.. కానీ ఆయా రాష్ట్రాలు జాతీయ స్థాయిలో సాధిస్తున్నటువంటి ప్రవేశ పరీక్షల ఉత్తీర్ణతలు మనకంటే చాలా తక్కువగా ఉన్నాయన్న విషయాన్ని ఇంటర్మీడియట్ విద్యా మండలి విస్మరించడం సిగ్గుచేటన్నారు. గత 30 సంవత్సరాలుగా సగటున ఫస్ట్ ఇయర్‌లో 50శాతం, సెకండ్ ఇయర్‌లో 65 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులైన సందర్భాన్ని ప్రస్తావించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇంటర్మీడియట్ విద్య కార్పొరేటీకరణ జరిగిన నేపథ్యంలో కార్పొరేట్ శక్తుల ప్రాబల్యం కారణంగా ప్రాక్టికల్ పరీక్షలే ఒక ప్రహసనంగా మారిన సందర్భంలో .. ఇపుడు 20 శాతం ఇంటర్నల్ మార్కులు విద్యార్థులకు కల్పించడం అంటే.. ఇంటర్మీడియట్ విద్యా పరీక్షల నిర్వహణను ఆయా కార్పొరేట్, ప్రైవేట్ సంస్థలకు అప్పనంగా అప్పజెప్పడమేనని మధుసూదన్ రెడ్డి మండిపడ్డారు.



బిసి ప్రతినిధులతో మాట్లాడుతున్న బిసి జెఎసి చైర్మన్, ఎంపి ఆర్.కృష్ణయ్య

# జనాభా ప్రకారం రిజర్వేషన్లకు సవరణ జరగాలి

## పార్టీలన్నీ ఏకాభిప్రాయంతో ముందుకు రావాలి

## బిసి జెఎసి చైర్మన్, ఎంపి ఆర్ కృష్ణయ్య

**హైదరాబాద్, అక్టోబరు 25 ప్రభాతవార్త:** జనాభా ప్రకారం విద్య, ఉద్యోగ రిజర్వే షన్లతోపాటు స్థానిక సంస్థల రిజర్వేషన్లకు రాజ్యాంగ సవరణ జరగాలని బిసి జెఎసి చైర్మన్, ఎంపి ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. శనివారం బీసీభవన్‌లో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శులు కుండా ప్రవీణ్ గౌడ్, బాణాల అజయ్ తదితర నేతలు కృష్ణయ్యను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'రిజర్వేషన్ల సమస్యకు ప్రతిసారి వ్యతిరేక తీర్పులు వస్తున్నాయి. దీనికి రాజ్యాంగ బద్ధత కల్పించడమే శాశ్వత పరిష్కారమన్నారు. స్థానిక సంస్థల రిజర్వేషన్ల విషయంలో మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో కూడా బీసీలకు వ్యతిరేకంగా తీర్పులు వచ్చాయి' అన్నారు. స్థానిక సంస్థలలో బీసీలకు ఇచ్చిన రిజర్వేషన్లకు రాజ్యాంగబద్ధ, చట్టబద్ధత, న్యాయబద్ధత ఉంది. గతంలో సుప్రీంకోర్టు అనేకసార్లు తీర్పులలో జనాభా లెక్కలు ఉంటే దాని ప్రకారం రిజర్వేషన్లు పెంచవచ్చని తీర్పు చెప్పారని గుర్తుచేశారు. కులగణన చేపట్టాలని ప్రధానమంత్రి మోడీ అంగీకరించడం ధైర్య సహసాలలో కూడుకున్న అంశం. కులగణన వివరాలు వచ్చిన తర్వాత అన్ని రంగాలలో బీసీలకు విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాల్లో వాటా ఇవ్వడానికి సిద్ధపడే ఈ నిర్ణయం తీసుకున్నారన్నారు.

'బిసి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వే షన్లు కల్పించాలి. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ మాదిరిగా బిసిలకు 'బిసి యాక్టు'ను పార్లమెంట్‌లో తీసుకరావాలి. స్థానిక సంస్థలలో 42 శాతం రిజర్వేషన్ల సాధనకై రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం ఉధృతం చేయాలని ఆయన బిసి వర్గాలకు పిలుపునిచ్చారు.

# కుట్ర చేసి నన్ను బిఆర్ఎస్ నుంచి బయటకు పంపారు

## నా దారి నేను వెతుక్కుంటున్నా : కవిత

## అమరవీరుల కుటుంబాలకు ఇంకా న్యాయం జరగలేదని వ్యాఖ్య

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు 25:** ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తన రాజకీయ భవిష్యత్ కార్యాచరణను ప్రకటించారు. బీఆర్ఎస్ పార్టీకి దూరమైన తర్వాత ప్రజల్లోకి వచ్చిన ఆమె నిజామాబాద్ కేంద్రంగా జాగృతి జనం బాట కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ, తనను కుట్రపూరితంగా పార్టీ నుంచి బయటకు పంపారని, ఇప్పుడు తన దారి తాను వెతుక్కుంటున్నానని సంచలన వ్యాఖ్యలు చేశారు. శనివారం నిజామాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో కవిత మాట్లాడుతూ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. 'గత 20 ఏళ్లుగా కేసీఆర్ నాయకత్వంలో, బీఆర్ఎస్ పార్టీ కోసం అంకితభావం తో పనిచేశాను. 27 ఏళ్ల వయసులోనే తెలంగాణ ఉద్యమంలోకి అడుగుపెట్టాను. ఎన్నో అవమానాలు ఎదురైనా ఓపికతో భరించాను', అని గుర్తు చేసుకున్నారు. నిజామాబాద్‌లో తన ఓటమి వెనుక పెద్ద కుట్ర జరిగిందని ఆరోపించిన కవిత, 'ఏం జరిగిందో బీఆర్ఎస్ కార్యకర్తలు ఆలోచించాలి. జరిగిన కుట్ర గురించి పిల్లల్ని అడిగినా చెబుతారు' అని వ్యాఖ్యానించారు. ఇకపై తన ప్రయాణం ప్రజలతోనే అని స్పష్టం చేసిన కవిత, తన భవిష్యత్ ప్రణాళికలను వివరించారు. తెలంగాణ వచ్చి పదేళ్లు గడిచినా అమరవీరుల కుటుంబాలకు సరైన గౌరవం, న్యాయం దక్కలేదు. వారి కోసం పోరాడాల్సిన అవసరం ఉంది. ఈ జనం బాటలో భాగంగా మేధావులు, విద్యార్థులు, రైతులు సహా సమాజంలోని అన్ని వర్గాల ప్రజలతో మాట్లాడతాను. అందరి భాగస్వామ్యంతో ఆత్మగౌరవంతో కూడిన అభివృద్ధి సాధించడమే నా లక్ష్యం అని తెలిపారు. యాత్ర ప్రారంభానికి ముందుగా ఉదయం నాంపల్లిలోని అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించి, అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం కోసం 1,200 మంది ప్రాణత్యాగం చేశారని, కానీ అధికారంలోకి వచ్చాక వారి కుటుంబాలకు అనుకున్నంత మేర న్యాయం చేయలేకపోయామని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. 'కేవలం 500 మంది అమరవీరుల కుటుంబాలకు మాత్రమే ఉద్యోగాలు ఇవ్వగలిగాం. ఉద్యమకారులకు కొన్నిచోట్ల రాజకీయంగా నామమాత్రపు పదవులు దక్కాయి కానీ, వారికి జరగాల్సినంత న్యాయం జరగలేదు. ఎంపీగా ఉన్నప్పుడు పార్టీ అంతర్గత వేదికలపై ఈ విషయం ప్రస్తావించినా, వారి కోసం గట్టిగా కొట్లాడలేకపోయాను. అందుకే ఇప్పుడు బహిరంగంగా క్షమాపణ చెబుతున్నాను' అని ఆమె అన్నారు. అమరవీరుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున ఆర్థిక సహాయం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు..సామాజిక



తెలంగాణ సాధనే లక్ష్యంగా తాను 33 జిల్లాలు, 119 నియోజకవర్గాల్లో పర్యటిస్తున్నానని.. సమాజంలోని అన్ని వర్గాలకు సమాన అవకాశాలు దక్కే వరకు తన పోరాటం కొనసాగుతుందని కవిత స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ప్రస్తుత ప్రభుత్వంపై కూడా ఆమె విమర్శలు చేశారు. 'తెలంగాణ తల్లి విగ్రహం చేతిలోంచి బతుకమ్మను తీసేశారు. తిరిగి తెలంగాణ తల్లి చేతిలో బతుకమ్మను పెట్టే వరకు పోరాడదాం' అని పిలుపునిచ్చారు. పాత మనస్పర్థలను పక్కనపెట్టి జాగృతి మాజీ సభ్యులందరూ తిరిగి కలిసి రావాలని, సామాజిక తెలంగాణ కోసం ఐక్యంగా పోరాడాలని కోరారు.

# బిసి బిడ్డ పిఎం మోడీ బిసి రిజర్వేషన్‌కు అనుకూలంగా రావాలి

## మాజీ ఎంపి వి.హనుమంతరావు

**హైదరాబాద్, అక్టోబరు 25, ప్రభాతవార్త:** వెనుకబడిన తరగతుల బిడ్డ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కూడా బిసిలకు 42శాతం రిజర్వేషన్‌కు అనుకూ లంగా వ్యవహరిస్తే అన్ని రకాలుగా లబ్ధి జరుగుతుంది మాజీ ఎంపి మాజీ పిసిసి అధ్యక్షుడు వి. హనుమంతరావు ఆశా భావం వ్యక్తంచేశారు. గాంధీభవన్‌లో శనివారం మీడియాతో మాట్లాడుతూ బిసి లకు రిజర్వేషన్ల విషయంలో రాహుల్ గాంధీ పాదయాత్రలో స్పష్టంగా ప్రకటించారని గుర్తుచేశారు. రాష్ట్రంలో అధికారంలో కి వచ్చాక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని రకాలుగా బిసి రిజర్వేషన్లు గురించి చిత్తశుద్ధితో పనులు చేశారు. ఇప్పుడు బిసి రిజర్వే షన్ల కేసు కోర్టులో పెండింగ్ ఉంది. పార్లమెంట్ లో తెలంగాణ బిసి బిల్లు పెట్టి 9వ షెడ్యూల్ లో పెట్టాలి. తెలంగాణ ప్రభుత్వం కూడా రాజకీయ పక్షాల సమావేశం పెట్టి ఈ విషయం మాట్లాడాలని కాంగ్రెస్ ఒబిసిల కన్వీనర్ గా కోరారు . కేంద్రంలో ఐఐటీ, ఐఐఎం విషయం లో నేను గతంలో సోనియాగాంధీ కోరుతే అప్పుడు అమలు అయ్యిందని అన్నారు. బిజెపి నాయ కులు, ఎంపిలు ప్రధానమంత్రి ని కోరి బిసి రిజర్వేషన్లు అమలు అయ్యేలా చూడాలి ఇదే మంచి సమయం ఇప్పుడు కాకపోతే ఎప్పుడు కాదని ఆయన చెప్పారు. అగ్రవర్ణ నాయకులు రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి, బిసి రిజర్వేషన్లు అనుకూలంగా ఉన్నారని తెలిపారు. అన్ని రాజకీయ పార్టీలు బిసి రిజర్వేషన్ల విషయంలో సహకరించి అమలు అయ్యేలా చూడాలని నేను ఒబిసి కన్వీనర్‌గా అన్ని రాజకీయ పార్టీలను కోరుతున్నా అని ఆయన అన్నారు.

# అద్దంలాంటి రోడ్లు వేస్తామంటే బిఆర్ఎస్ గుండెలదురుతున్నాయి

**కవిత వేరే కుంపటి పెట్టుకుంది.. హరీశ్‌రావు కొత్త పార్టీ కోసం చూస్తున్నాడు**

**సిఆర్ఐఎఫ్ రోడ్లకు, హ్యామ్‌రోడ్లకు తేడా మాజీ మంత్రికి తెలియకపోవడం బాధాకరం**

**ప్రశాంత్‌రెడ్డి ఆరోపణలపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ధ్వజం**

**హైదరాబాద్, అక్టోబరు 25 ప్రభాతవార్త:** హ్యామ్ విధానంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టబోయే రోడ్లలో 8వేల కోట్ల స్కాం జరుగుతుందని మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి చేసిన ఆరోపణలపై రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఒక పత్రికా ప్రకటనలో తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ప్రశాంత్‌రెడ్డి ఆరోపణలపై మంత్రి తనదైన శైలిలో సమాధాన మిచ్చారు. ఇటీవల బిఆర్ఎస్ నేతల అసహనంతో మాట్లాడుతుంటే జాలేస్తుందని పేర్కొన్నారు. గతంలో రోడ్లు వేయాలంటే మనసు రాలేదు.ఇప్పుడు అద్దం లాంటి రోడ్లు వేస్తామంటే బిఆర్ఎస్ వాళ్ల గుండెలు అదురుతున్నాయనీ అన్నారు. పచ్చకామెర్లోడికి లోకమంతా పచ్చగానే కనిపిస్తుందన్నట్లు అన్నిట్లోస్కాం లు చేసిన మీకు ఏది చూసిన స్కామే కన్పిస్తుందనీ ఎద్దేవా చేశారు. కాళేశ్వరం స్కాం,యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం స్కాం,ధరణి స్కాం,గొర్రెల స్కాం ఇలా చెప్పుకుంటూ పోతే పదేళ్ల కాలంలో మీరు చేసిన స్కాంలకు అంతే లేదని మండిపడ్డారు. కవిత వేరే కుంపటి పెట్టుకుంది, ఇవాళ్టి నుండి జనాల్లోకి అంటూ వెళ్తున్నదీ, మరోవైపు హారీశ్‌రావు కొత్త పార్టీ కోసం చూస్తున్నట్లు తెలుస్తోంది అని మంత్రి ఆరోపణలు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ గ్రాఫ్ రోజు రోజుకు పెరుగుతుండడంతో ఆ పార్టీ నేతలు చెట్టుకొకరు, పుట్టకొక్కరు అవడం చూసి చోటామోటా బిఆర్ఎస్ నేతలు అయోమయంలో పడి ఆగంఆగం అవుతున్నారనీ విమర్శించారు. సిఆర్ఐఎఫ్ రోడ్లకు హ్యామ్ రోడ్ల విధానికి చాలా తేడా ఉంటుంది ఆర్ అండ్ బిశాఖ మంత్రిగా పనిచేసిన ఆయనకు ఇది తెలియకపోవడం బాధాకరమన్నారు. సి ఆర్ ఐ ఎఫ్ లో కి. మీ1.75 కోట్లు అవుతుందన్నది సింపుల్ వైడెనింగ్ కోసం మాత్రమే,అదే హ్యామ్ మోడల్ లో చేస్తున్నది డబుల్ లేన్ బలోపేతం అది కూడా జాతీయ రహదారుల విధానం ప్రకారం చేస్తున్నాం. కి.మీ రోడ్డు మెయింటెనెన్స్ కోసం 2కోట్లు అదనంగా ఖర్చు చేస్తున్నారు. ఒక్క కి.మీ రోడ్డు కోసం 6 కోట్లు అవుతుందని అసత్యాలు మాట్లాడాడని, నిజానికి 15 సంవత్సరాల్లో ఒక్క కి.మీ మెయింటెనెన్స్ కోసం ఖర్చు చేసేది కేవలం 20లక్షల లోపే అని మొత్తం ఒక్క కి.మీ మీద మొత్తం కాలానికి 2కోట్ల90లక్షలు మాత్రమే అవుతుందని వివరించారు. 'కళ్లద్దాలు పెట్టుకొని కూడా.. 0.4శాతం ను 4శాతం అని చదివావంటే నీ ఆరోగ్యం పై నాకు ఆందోళన కలుగుతుంది మిత్రమా' అని మంత్రి తన స్టైల్ సెటైర్ వేశారు.మెయింటెనెన్స్ కోసం మొదటి సంవత్సరం ప్రభుత్వం ఏమి ఖర్చు చేయదనీ..రెండో సంవత్సరం నుండి ఐదు సంవత్సరాల వరకు 0.4శాతం మాత్రమే చేస్తుందని,6వ సంవత్సరంలో 0.8శాతం ,7వ సంవత్సరంలో రోడ్ రెన్యువల్ కు 2.4శాతం , తర్వాత 8 నుండి 12 సంవత్సరాల వరకు 0.4శాతం,13 నుండి 0.8శాతం శాతం అని ఇలా మొత్తం 15 సంవత్సరాల్లో మెయింటెనెన్స్ కోసం అయ్యే ఖర్చు కేవలం 20 లక్షల లోపే అని మంత్రి స్పష్టం చేశారు. మొబైలైజేషన్ అడ్వాన్స్ అని ప్రజల్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారు,కానీ కేంద్ర ప్రభుత్వం రూపొందించిన హ్యామ్ మోడల్ నిబంధనల ప్రకారం ఇంట్రెస్ట్ తో కూడిన మొబైలైజేషన్ అడ్వాన్స్ ఇచ్చి..నిర్మాణ సమయంలోనే వడ్డీతో సహా సంబంధిత నిర్మాణ సంస్థ బిల్లుల నుండే రికవరీ చేస్తామని మంత్రి తెలిపారు. 'ఈ హ్యామ్ విధానం తెలంగాణలో కొత్తగా తెచ్చింది కాదు ఇది వరకే కర్ణాటక రాష్ట్రంలో 20 ఏళ్ల నుండి అమలవుతుందని అట్లాగే మధ్యప్రదేశ్, మహారాష్ట్ర,రాజస్థాన్,ఉత్తర ప్రదేశ్, తమిళనాడు లాంటి రాష్ట్రాల్లో గత ఐదేళ్లుగా అమలులో ఉంది.' అని తెలిపారు.ఈ టెండర్లలో చిన్న కాంట్రాక్టర్లు పాల్గొన వచ్చు అని ఇది వరకే నేను పిలుపునిచ్చాను. మీరు ఎగ్గొట్టి పోయిన బకాయిలు మేము చెల్లిస్తున్నాం. చిన్న కాంట్రాక్టర్లకు భరోసాగా నిన్ననే 100 కోట్ల పెండింగ్ బిల్లులు రిలీజ్ చేశాం' అని మంత్రి చెప్పారు.అవినీతి ఆరోపణలపై మంత్రి కోమటి రెడ్డి 'నేను 6 సార్లు ప్రజల ఆశీర్వాదంతో చట్టసభలకు ఎన్నికైన ప్రజా ప్రతినిధిని ఈ సుదీర్ఘ రాజకీయ జీవితంలో చిన్న మచ్చ(ఆరోపణ) కూడా నాపై లేదు.నేను అవినీతిని ప్రోత్సహించే వ్యక్తిని కాదు. అవినీతి జరిగితే చూస్తూ ఊరుకోను. తెలంగాణ కోసం మంత్రి పదవికి రాజీనామా చేసి,ఆమరణ దీక్షతో ప్రాణ త్యాగానికి సిద్ధ పడ్డోడిని,నా చివరి శ్వాస వరకు తెలంగాణ ప్రజల మేలు కోసమే పనిచేస్తానని" మంత్రి స్వోత్కర్షలతో ప్రకటన చేశారు.మీరు ఎంత అరిచి గీ పెట్టినా.. దేశానికి రోల్ మోడల్ రోడ్లు నిర్మించి తీరుతామని తేల్చి చెప్పారు.అద్దం లాంటి రోడ్లు గనుక పూర్తయితే వచ్చే ఎన్నికల్లో బిఆర్ఎస్ 10 సీట్లకే పరిమితం అవుతుందనే భయం మీకు పట్టుకుందనీ, పసలేని ఆరోపణలతో పదే పదే అబద్ధాలు చెప్పి..అవి నిజం అవుతాయనుకోవడం మీ భ్రమ అన్నారు. 'చింత చచ్చినా.. పులుపు చావలేదన్నట్లు..' ప్రజలు మీ అహంకారాన్ని ఇంకా గమనిస్తున్నారంటూ బిఆర్ఎస్ కు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు.



## నేరాలు, వాటి కారణాలను విశ్లేషించాలి

**సిఐడి విభాగం పనితీరును సమీక్షించిన డిజిపి శివధర్‌రెడ్డి**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,అక్టోబరు25:** క్రైమ్ ఇన్వెస్టిగేటివ్ డిపార్ట్మెంట్ (సిఐడి) విభాగపు పనితీరును రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి .శివధర్ రెడ్డి శనివారం నాడు తన కార్యాలయంలో సమీక్షించారు. సిఐడి అడిషనల్ డిజిపి చారుసిన్హా , డిఐజి నారాయణ నాయక్, సిఐడి విభాగపు ఎస్పీలు, సంబంధిత అధికారులు డిజిపి సమీక్ష సమావేశానికి హాజరయ్యారు. సిఐడి విభాగంలో ఉన్న ఎస్సిఆర్బి, పిసిఆర్, సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్, సీసీటీఎన్ఎస్, విమెన్ సేఫ్టీవింగ్‌ల పనితీరును సమీక్షించడంతో పాటు ఐదు సంవత్సరాల నేరాల వివరాలను పరిశీలించారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల్లో జరుగుతున్న నేరాలు, స్థానికంగా ఉన్న పరిస్థితుల గురించి అధికారులతో చర్చించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో జరుగుతున్న నేరాలను, వాటికి గల కారణాలను విశ్లేషించాలని డిజిపి సూచించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో ఎక్కువగా జరుగుతున్న నేరాలను,ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్న సంఘటనలపై సిఐడి దృష్టిసారించి వాటిని అరికట్టేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని డిజిపి పేర్కొన్నారు. రానున్న సంవత్సరంలో సిఐడి దృష్టి పెట్టె నేరాన్ని ఆ సంవత్సరపు ప్రధాన లక్ష్యంగా పరిగణించాలని, దానిని నియంత్రించడంతో పాటు ఇతర నేరాలను అరికట్టాలన్నారు. వివిధ విభాగాల అధికారులు నేరాలను విశ్లేషించి సమర్థంగా పనిచేస్తే కిందిస్థాయి సిబ్బంది కూడా మరింత నైపుణ్యంగా పనిచేసే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న నేరాలను రికార్డు చేసే సందర్భంలో వాటిని క్షుణ్ణంగా విశ్లేషించాలని, హత్యలు, ఆత్మహత్యలు, దొంగతనాలు,దాడులు, మోసాలు, వంటి నేరాలలో అవి ఏ రకమైనవో రికార్డు చేయడం ద్వారా నియంత్రించే మార్గాలను అన్వేషించవచ్చని చెప్పారు. దొంగతనాలకు పాల్పడే గ్యాంగ్‌ల వివరాలను సేకరించాలన్నారు.రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు డ్రైవర్ల తప్పిదం ఏమైనా ఉంటే కారణాలు తెలుసుకోవాలని, పోలీసు డ్రైవర్ల విషయంలో కంటి చూపు కారణంగా ప్రమాదాలు జరిగితే వారికి కంటి పరీక్షలు చేసే విధంగా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని డిజిపి సూచించారు. సిఐడి ఎస్పీలు విశ్వజిత్ కంపాటి, సంగ్రామ్ సింగ్ జి.పాటిల్, మద్దిపాటి శ్రీనివాస్, వెంకటలక్ష్మీ, రామిరెడ్డి, శ్రీనివాస్ తదితరులు సమీక్ష సమావేశానికి హాజరయ్యారు.

## బాలీవుడ్ ప్రముఖ కమెడియన్ సతీష్‌షా కన్నుమూత



**ముంబయి, అక్టోబరు 25:** బాలివుడ్ ప్రముఖ కమెడియన్ సీనియర్ నటుడు సతీష్‌షా 74వ యేట కన్నుమూసారు. మూత్రపిండాల వ్యాధితో బాధపడుతున్న ఆయన గత కొంతకాలంగా చికిత్స పొందుతున్నారు. చికిత్సలో ఉండగానే కన్నుమూసినట్లు ఆయన కుటుంబసభ్యులు చెప్పారు. సారాభాయ్ వర్సస్ సారాభాయ్, బివి సల్లారెసల్లా వంటి టివిషోలతో ఆయన బహు ముఖ ప్రాచుర్యం పొందారు. జానేభిదోయారో, యే జోహైజిందగీ, కల్‌హో నాహో, ఫనా, ఓంశాంతిఓమ్ వంటిచిత్రాలతో మంచి పేరుతెచ్చుకున్నారు. ఫిలిం టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్‌బోర్డు సభ్యునిగా కూడా పనిచేసారు. రమేష్ కడతాల షాకు వ్యక్తిగత సహాయకునిగా 30 యేళ్లుగా పని చేస్తున్నారు. బాంద్రా ఈస్ట్‌లో ఉన్న ఆయన నివాసంలో విషాదఛాయలు అలు ముకున్నా యన్నారు. బాలీవుడ్‌నిర్మాత అశోక్‌పండిట్ కూడా షా మృతిని ధృవీకరించారు. ఆయన ఆత్మకు శాంతిచేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యం ప్రసాదించాలని ఆభగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు పండిట్ పేర్కొన్నారు.

## వరల్డ్ ట్రావెల్ మార్కెట్ సదస్సుకు ఎపి మంత్రి కందుల దుర్గేష్

**విజయవాడ,అక్టోబరు 25,ప్రభాతవార్తప్రతినిధి:**వరల్డ్ ట్రావెల్ మార్కెట్ సదస్సులో ఏపీ పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ పాల్గొననున్నారు. లండన్‌లో నవంబర్ 4 నుంచి 6వ తేది వరకు ఈ సదస్సు జరుగుతుంది. వరల్డ్ ట్రావెల్ మార్కెట్ (డబ్ల్యుటిఎం)2025 సదస్సులో పర్యాటక శాఖమంత్రి కందుల దుర్గేష్ పాల్గోనున్నారు. ఈ మేరకు రాష్ట్రప్రభుత్వం అను మతులు జారీ చేసింది. మంత్రితో పాటు ఈ పర్యటనలో పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ పాల్గొంటారు. రాష్ట్రంలో అత్యంత పర్యాటక ఆకర్షణీయ ప్రాంతాలు, సముద్రతీర, టెంపుల్ టూరిజం.. చారిత్రక, పురాతన సందర్శన క్షేత్రాల గురించి దుర్గేష్ వివరిస్తారు. అతిథేయ రంగంలో ఇప్పటి పరిస్థితులు తెలిపారు.

## త్వరలో 14వేల అంగన్‌వాడీ టీచర్ల హెల్పర్ల నియామకం

**సూపర్‌వైజర్లకు నియామకపత్రాలను అందజేసిన మంత్రి సీతక్క**



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, అక్టోబరు 25:** త్వరలో 14వేల అంగన్వాడీ టీచర్ల హెల్పర్ల నియామకాన్ని చేపట్టబోతున్నామని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. మహిళా శిశు సంక్షేమాన్ని తమ ప్రభుత్వం ప్రాధాన్యతగా ఎంచుకుందని మంత్రి సీతక్క వ్యాఖ్యానించారు. ఎన్నో సవాళ్లు ఉన్నా ఆకాశాన్ని చీల్చుకొని అంతరిక్షం వరకు మహిళలు చేరుకుంటున్నారని ఉద్ఘాటించారు. ఐసీడీఎస్ సేవలకు భారతదేశంలో దివంగత మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ ప్రాణం పోశారని నొక్కిచెప్పారు. మహిళా శిశు సంక్షేమ శాఖలో గ్రేడ్ వన్ సూపర్‌వైజర్లుగా నియమితులైన అభ్యర్థులకు నియామక పత్రాలని శనివారం మంత్రి సీతక్క అందజేశారు. ఈ సందర్భంగా గ్రేడ్ వన్ సూపర్‌వైజర్లుగా నియమితులైన అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారితో ముచ్చటించారు. 181 మంది సూపర్‌వైజర్లుగా నియామక పత్రాలు అందుకు న్నారని చెప్పుకొచ్చారు. వేల మందితో పోటీ పడి మీరు ఈ కొలువులు సాధించారని తెలిపారు. మీ నిరీక్షణలు ఫలించాయని అన్నారు. మీ ఉద్యోగ కలలను సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం నెరవేర్చిందని ఉద్ఘాటించారు. ప్రజల ఆశలు, అవసరాల మేరకు మీ వృత్తి ధర్మం ఉండాలని సూచించారు. ఉక్కు మహిళ ఇందిరాగాంధీ ప్రతి మహిళకు గౌరవం, ప్రతి చిన్నారికి సంరక్షణ ఉండాలనే లక్ష్యంతో ఐసీడీఎస్ సేవలను, అంగన్వాడీ కేంద్రాలను ప్రారంభించారని గుర్తుచేశారు. అంగన్వాడీ కేంద్రాలకు తెలంగాణ లోనే మొదటిసారిగా ప్రారంభించారని వివరించారు. 1970లో మహబూబ్‌గర్ జిల్లాలో ప్రయోగాత్మకంగా అంగన్వాడీ సేవలను ప్రారంభించారని తెలిపారు. అక్కడ సక్సెస్ కావడంతో దేశవ్యాప్తంగా అంగన్వాడీ సేవలను ఇందిరా గాంధీ విస్తరించారని పేర్కొన్నారు.

## 'రైజింగ్ తెలంగాణ'లో భాగస్వామ్యం కండి

**పెట్టుబడులతో రాష్ట్ర పురోగతిలో పాలుపంచుకోండి**

**ఇండియన్ సిఇఒలకు మంత్రి శ్రీధర్‌బాబు పిలుపు**

**ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా ప్రత్యేక భేటీ**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,అక్టోబరు25:** రైజింగ్ తెలంగాణ లక్ష్య సాధనలో భాగస్వామ్యం కావాలని ఆస్ట్రేలియాలోని పలు కంపెనీల ఇండియన్ సీఈవోలకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పిలుపునిచ్చారు. పెట్టుబడులు పెట్టి రాష్ట్ర పురోగతిలో పాలు పంచుకోవాలని కోరారు. ఆ దేశ పర్యటనలో భాగంగా శనివారం సిడ్నీలో ది సెంటర్ ఫర్ ఆస్ట్రేలియా - ఇండియా రిలేషన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన బిజినెస్ కాంక్లేవ్ లో వారితో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలలో 'తెలంగాణ' ముందు



వరుసలో ఉందని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. తక్కువ సమయంలో పటిష్ఠమైన ఆర్థిక వ్యవస్థ, స్థిరమైన పాలన, సమర్థవంతమైన నాయకత్వం కారణంగా రాష్ట్రం అంతర్జాతీయ పెట్టుబడులకు అత్యంత సురక్షితమైన గమ్యస్థానంగా మారిందన్నారు. తెలంగాణలో పారిశ్రామికాభివృద్ధికి అనుకూలించే అంశాలు, పెట్టుబడి అవకాశాలు, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, ప్రగతిశీల విధానాలు, ఎకో సిస్టం, సింగిల్ విండో అనుమతుల వ్యవస్థ తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అంతర్జాతీయ, జాతీయ దిగ్గజ సంస్థల భాగస్వామ్యంతో పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా ఇండస్ట్రీ రెడీ వర్క్ ఫోర్స్ ను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా తీసుకుంటున్న చొరవను వివరించారు. ఏఐ, డేటా అనలిటిక్స్, మెషిన్ లెర్నింగ్, గేమింగ్, యానిమేషన్, వీఎఫ్ఎక్స్, సెమీకండక్టర్లు, ఏరోస్పేస్, డిఫెన్స్, అడ్వాన్స్డ్ మాన్యుఫ్యాక్చరింగ్, గ్రీన్ ఎనర్జీ, ఈవీల తయారీ తదితర రంగాల్లో తెలంగాణలో అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని, పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని రకాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ది సెంటర్ ఫర్ ఆస్ట్రేలియా - ఇండియా రిలేషన్స్ ఛైర్ పర్సన్ స్వాతి దవే, ఆస్ట్రేలియా - ఇండియా బిజినెస్ కౌన్సిల్ నేషనల్ అసోసియేట్ ఛైర్మన్ ఇర్ఫాన్ మాలిక్, ఈటీపీఎల్ డైరెక్టర్ సౌరవ్ బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.

## హ్యామ్ టెండర్లపై సిబిఐ దర్యాప్తు చేయించాలి

**బిఆర్ఎస్ నేత, మాజీమంత్రి ప్రశాంత్‌రెడ్డి**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, అక్టోబరు 25:** ఇందిరమ్మ రాజ్యంలో రోజుకో అవినీతి, పూటకో కుంభకోణం బయటపడుతున్నా యని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి విమర్శించారు. ఓ పని టెండర్‌కు సంబంధించి మంత్రుల మధ్య వివాదం తలెత్తితే సీఎం ఇద్దరినీ కూర్చో బెట్టి వాటాలు పంచారని ధ్వజమెత్తారు. డెక్కన్ సిమెంట్స్ కంపెనీ వారిని గన్ పెట్టి బెదిరించారని, ఇందులో సీఎం పాత్ర ఉందని మంత్రి కూతురే ఆరోపించారన్నారు. శనివారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. మద్యం సీసాల హాలోగ్రాం కుంభకోణంలో సీఎం, మంత్రి మధ్య తలెత్తిన వివాదంలో అధికారిని బలి చేశారని మండిపడ్డారు. అవినీతి, ముడుపుల మీద మంత్రులు రోజూ కొట్లాడుకుంటున్నారని చెప్పారు. తెలంగాణలో రోడ్లకు మహర్దశ అని మంత్రులు అంటున్నారని, రూ.27 వేల కోట్లతో రోడ్లు వేయబోతున్నామని మంత్రులు చెప్పారని, ఇందులో వేల కోట్ల కుంభకోణం ఉందని ఆరోపించారు. హ్యామ్ కాదు.. అది ఒక పెద్ద స్కామ్ అని, రోడ్డు బాగుచేసే ముసుగులో దోపిడీకి రంగం సిద్ధమైందన్నారు. హైబ్రిడ్ అన్యుటీ మోడ్ (హ్యామ్) టెండర్లలో రూ.8 వేల కోట్ల కుంభకోణం జరిగింది. హ్యామ్‌లో కిలోమీటర్‌కు 85 శాతం అంచనా వ్యయం పెంచారు. రూ.9 వేల కోట్లతో పూర్తయ్యే రోడ్లకు రూ.17 వేల కోట్లకు టెండర్లు పిలిచారు. ఇందులో రూ.8 వేల కోట్ల ప్రజాధనాన్ని ప్రభుత్వం లూటీ చేస్తున్నది. సీఆర్ఎఫ్ కింద కిలోమీటర్‌కు రూ.కోటి 75 లక్షలు ఖర్చు అవుతుంది. హ్యామ్ కింద ఇచ్చిన టెండర్లలో కిలోమీటర్‌కు రూ.3కోట్ల 30 లక్షల వ్యయం అవుతుంది. సీఆర్ఎఫ్ కింద ఇచ్చిన రోడ్ల పనుల టెండర్ల జీవో, హ్యామ్ జీవో కేవలం పది రోజుల తేడాలో వచ్చాయి. సీఆర్ఎఫ్ కింద ఇచ్చిన జీవోలో కిలో మీటర్‌కు ఓ రేటు, హామ్ జీవోలో మరో రేటు ఎలా ఉంటుంది. హ్యామ్ రోడ్ల టెండర్లు దక్కించుకున్న వారికి 10 శాతం మొబిలైజేషన్ అడ్వాన్సుల కింద ప్రభుత్వం చెల్లిస్తోంది. ఈ రూ.17 వేల కోట్ల మొబిలైజేషన్ అడ్వాన్సులు ఎవరి జేబుల్లోకి వెళ్తాయో అందరికీ తెలుసు. హ్యామ్ కింద కిలోమీటర్ రోడ్డుకు మెయింటెనెన్సుకు మరో రూ.2.5 కోట్లు కేటాయిస్తున్నారు. అంటే కిలోమీటర్ రోడ్డుకు హామ్ కింద రూ.6 కోట్లు ఖర్చవుతుంది. హ్యామ్‌లో 40 శాతం ప్రభుత్వం, 60 శాతం ప్రైవేటు సంస్థలు భరిస్తాయని అంటున్నారు. ప్రైవేటు సంస్థలు బ్యాంకుల నుంచి తెచ్చే అప్పులకు ప్రభుత్వమే వడ్డీ కట్టాల్సి ఉంటుంది. మొత్తం మీద హ్యామ్ మోడల్ ప్రజల మీద పెను భారం మోపేదిగా ఉంది. ఈ టెండర్లను తక్షణమే రద్దు చేయాలి. హ్యామ్ రోడ్లలో పాలు పంచుకుంటున్న ఇంజినీర్లు, అధికారులు, బడా కాంట్రాక్టర్లు ప్రభుత్వ దోపిడీలో భాగస్వామ్యం కావద్దని మనవి. ఇందులో పెద్ద అవినీతి జరుగుతున్నందున కేంద్ర దర్యాప్తు సంస్థలు తక్షణమే జోక్యం చేసుకోవాలి. ఇద్దరు కేంద్రమంత్రులు రాష్ట్రం నుంచి ఉన్నారు. కిషన్ రెడ్డి, బండి సంజయ్‌కి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా హ్యామ్ టెండర్లపై సీబీఐ దర్యాప్తు చేయించాలి. దోచుకునే విషయంలోనే తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం దేశానికి రోల్ మోడల్ అయ్యింది. ఢిల్లీకి మాటి మాటికీ సీఎం వెళ్లేది తన అవినీతి నుంచి కాపాడుకునేందుకే. పనులు చేసిన కాంట్రాక్టర్లకు డబ్బులు ఇవ్వరు కానీ హ్యామ్ కింద మొబిలైజేషన్ అడ్వాన్సులు ఎలా చేస్తారు?. హ్యామ్ రోడ్ల నిబంధనలు చిన్న కాంట్రాక్టర్లకు హానిచేసే విధంగా ఉన్నాయ్. రూ.8 వేల కోట్ల ప్రజా ధనాన్ని లూటీ చేసే విధంగా ఉన్న హామ్ రోడ్ల టెండర్లపై ప్రతి వేదిక మీద మా గొంతు ఎత్తుతాం' అని చెప్పారు.

## కంటి పరీక్షతో వృద్ధాప్యం, గుండెజబ్బుల స్కాన్!



**టొరంటో, అక్టోబరు 25:** సాధారణ కంటి పరీక్షతో ఒక వ్యక్తికి గుండె జబ్బులు వచ్చే ప్రమాదాన్ని, వారి శరీరం ఎంత వేగంగా వృద్ధాప్యం చెందుతుందో అంచనా వేయవచ్చని కెనడా పరిశోధకులు తమ తాజా అధ్యయనంలో కనుగొన్నారు. కంటిలోని రెటీనాలో ఉండే సూక్ష్మ రక్తనాళాలను స్కాన్ చేయడం ద్వారా శరీరంలోని మొత్తం రక్త ప్రసరణ వ్యవస్థ ఆరోగ్యాన్ని, జీవసంబంధమైన వృద్ధాప్య స్థితిని తెలుసుకోవచ్చని ఈ పరిశోధన తేల్చింది. ఈ అధ్యయన వివరాలు "సైన్స్ అడ్వాన్సెస్" అనే జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. మెక్‌మాస్టర్ యూనివర్సిటీకి చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ మేరీ పిగెర్ మాట్లాడుతూ శరీరంలోని రక్త ప్రసరణ వ్యవస్థను బయటి నుంచి నేరుగా చూసేందుకు కళ్ళు ఒక ప్రత్యేకమైన, సులువైన మార్గాన్ని అందిస్తాయి. రెటీనాలోని రక్తనాళాల్లో వచ్చే మార్పులు, శరీరంలోని ఇతర చిన్న రక్తనాళాల్లో జరిగే మార్పులను ప్రతిబింబిస్తాయని వివరించారు. ఈ అధ్యయనం కోసం పరిశోధక బృందం 74,000 మందికి పైగా వ్యక్తుల రెటీనా స్కాన్‌లు, జన్యుపరమైన డేటా, రక్త నమూనాలను విశ్లేషించింది. రెటీనాలో తక్కువ శాఖలతో సరళంగా ఉండే రక్తనాళాలు కలిగిన వ్యక్తులలో గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదం ఎక్కువగా ఉన్నట్లు, వారిలో వృద్ధాప్య ఛాయలు కూడా వేగంగా కనిపిస్తున్నట్లు గుర్తించారు. ప్రస్తుతం గుండె జబ్బులు, స్ట్రోక్, డిమెన్షియా వంటి వయసు సంబంధిత వ్యాధులను నిర్ధారించడానికి అనేక రకాల పరీక్షలు అవసరమవుతున్నాయి. భవిష్యత్తులో కేవలం ఒక రెటీనా స్కాన్‌తోనే ఈ ముప్పును సులభంగా, వేగంగా అంచనా వేయవచ్చని పరిశోధకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అయితే, ఈ విధానం పూర్తిస్థాయిలో అందుబాటులోకి రావడానికి మరింత పరిశోధన అవసరమని వారు స్పష్టం చేశారు. ఈ పరిశోధనలో భాగంగా రక్తంలోని బయోమార్కర్లను విశ్లేషించి, కంటి రక్తనాళాల్లో మార్పులకు కారణమవుతున్న రెండు కీలక ప్రొటీన్లను కూడా గుర్తించారు. ఎంఎంపి12, ఎల్జీజీ-ఎఫ్‌సి, రెసెప్టార్‌ఐఐబి అనే ఈ ప్రొటీన్లు వాపు, రక్తనాళాల వృద్ధాప్యానికి కారణమవుతాయని తేల్చారు. మా ఆవిష్కరణలు రక్తనాళాల వృద్ధాప్యాన్ని నెమ్మదింప జేయడానికి, గుండె జబ్బుల భారాన్ని తగ్గించడానికి, చివరికి ఆయుష్షును మెరుగు పరచడానికి కొత్త మందుల తయారీకి మార్గం చూపుతున్నాయని మేరీ పిగెర్ తెలిపారు.

# నిరుపేద కుటుంబాల్లో వెలుగులు నింపడమే లక్ష్యం



జాబ్ మేళాలో ఉద్యోగం పొందిన వారికి నియామకపత్రాలు అందజేస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**గ్రామీణప్రాంత యువత లక్ష్యంగా జాబ్‌మేళా : మంత్రి ఉత్తమ్**

**పాల్గొన్న 275 కంపెనీలు, 40 వేలకుపైగా అభ్యర్థులు దరఖాస్తుల నమోదు**

**ప్రభుత్వరంగంతోపాటు ప్రైవేట్‌రంగంలోనూ ఉపాధి కల్పిస్తాం**

**హుజూర్‌నగర్ (గరిడేపల్లి), హుజూర్నగర్ రూరల్ :** నిరుపేదల కుటుంబాల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. హుజూర్ నగర్ పట్టణంలో ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళా కార్యక్రమాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో, మీడియా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నిరుపేదలైన ఎస్సీ ఎస్టీ బీసీతోపాటు ఆర్థికంగా వెనుకబడిన ఈ బీసీ కుటుంబాల కళ్ళల్లో వెలుగులు నింపడమే ప్రభుత్వం ముందున్న కర్తవ్యం అని పేర్కొన్నారు. గోండుగూడెంలో, దళిత వాడల్లో, బీసీ బస్తీలలో ఉన్న నిరుపేదల కోసమే ఈ జాబ్ మేళా కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. దేశంలోనే కాక రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పరంగా ఇటువంటి జాబ్ మేళా కార్యక్రమం ఇంతకుముందు ఎన్నడు నిర్వహించలేదని తెలిపారు. పట్టణాల్లో ఉండే యువతతో పాటు వారికి సమానంగా గ్రామీణ ప్రాంత యువతకు కూడా ఉద్యోగ ఉపాధి కల్పన జరగాలని ఉద్దేశంతో ఈ మెగా జాబ్ మేళా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదట ఒకరోజు మాత్రమే జాబ్ మేళాను నిర్వహించాలని అనుకోగా, కార్యక్రమానికి లభించిన విశేష స్పందనకు అనుగుణంగా రెండు రోజులు జాబ్ మేళా కార్యక్రమాలు నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. మారుమూల ప్రాంతంలో జాబ్ మేళా నిర్వహించి యువతకు ఉపాధి కల్పించాలని లక్ష్యంతో 300 కిలోమీటర్ల దూరంలో ఉన్న హైదరాబాదు తో పాటు వివిధ ప్రాంతాల నుంచి 275 కంపెనీలు ఈ జాబ్ మేళాలో పాల్గొన్నాయని తెలిపారు. ఎంతో పకడ్బందీగా నిర్వహించ తలపెట్టిన ఈ జాబ్ మేళాకు భారీ స్పందన రావటం విశేషం అన్నారు. సుమారు 40,000 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఇంతటి భారీ జాబ్ మేళా కార్యక్రమాన్ని నిర్వహించేందుకు రాష్ట్ర ఉన్నతాధికారులు, సింగరేణి కాలరీస్, రాష్ట్ర పరిశ్రమల శాఖ, దాని అనుబంధం శాఖ డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ, ఉమ్మడి నల్గొండ జిల్లా అధికార యంత్రాంగం, జిల్లా కలెక్టర్లు, పోలీస్ శాఖ తో పాటు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు పూర్తిస్థాయిలో సహకరించడంతో ఈ జాబ్ మేళా కార్యక్రమం నిర్వహించే అవకాశం ఏర్పడిందన్నారు. జాబ్ మేళా నిర్వహించడమే కాకుండా కార్యక్రమంలో పాల్గొన్న కంపెనీల ద్వారా ఎంత మందిని ఎంపిక చేశారు అనే విషయం కూడా పరిగణలోకి తీసుకొని తప్పనిసరిగా గ్రామీణ ప్రాంత యువతకు ఉద్యోగ ఉపాధి కల్పించే దిశగా కృషి చేస్తామని ఆయన తెలిపారు. మొదటి రోజు కేవలం మూడు గంటల వ్యవధిలో 250 మంది నిరుద్యోగ యువత వివిధ కంపెనీలలో ఎంపికయ్యారని తెలిపారు. ఎంపికైన యువతకు వేదికపై నియామక పత్రాలను ఆయన అందజేశారు. సమాజానికి సవాల్ గా మారిన నిరుద్యోగ సమస్య నిర్మూలన కోసం కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చిత్తశుద్ధితో కట్టుబడి ఉందని చెప్పారు. అధికారంలోకి వచ్చిన 20 నెలల వ్యవధిలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క సారథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ రంగంలో 70 వేల నుంచి 75 వేల ఉద్యోగాలను భర్తీ చేసినట్లు ఆయన గుర్తు చేశారు. ఇటీవల గ్రూప్1, గ్రూప్2 ఉద్యోగాల భర్తీ కూడా అందులో భాగమేనని తెలిపారు. పట్టణ ప్రాంత యువతకు సమానంగా గ్రామీణ ప్రాంత యువతి యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్న దృఢ సంకల్పంతో ఈ జాబ్ మేళా కార్యక్రమాన్ని మారుమూల ప్రాంతం అయిన హుజూర్ నగర్ లో నిర్వహించినట్లు తెలిపారు. స్థానిక పరిశ్రమలతో పాటు జాతీయ, అంతర్జాతీయ స్థాయి పరిశ్రమలతో తానే స్వయంగా సంప్రదించి జాబ్ మేళాలో పాల్గొనేందుకు అంగీకారం చేసుకున్నట్లు తెలిపారు. అర్హులైన వారందరినీ ఎంపిక చేయడంతో పాటు జాబ్ మేళాలో హాజరైన వారికి శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించాలని ఆయా కంపెనీలకు సూచించినట్లు వివరించారు. ప్రస్తుతం ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళా మొదటి అడుగు మాత్రమేనని, అనుకున్న ఫలితాలు సాధిస్తే మరోసారి కోదాడ కేంద్రంగా మరో మెగా జాబ్ మేళాను నిర్వహిస్తామని ఆయన ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఎదురైన అనుభవాలను పూర్తిస్థాయిలో సమీక్షించుకుని మరింత పురోహితుని సాధించేందుకు ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా హుజూర్నగర్, కోదాడు నియోజకవర్గాలు తోపాటు ఉమ్మడి నల్లగొండ జిల్లా నిరుద్యోగులకు ఎంతో మందికి ఉద్యోగ అవకాశాలు వచ్చాయని, కంపెనీలు అక్కడికక్కడే ఉద్యోగాలలో నియమిస్తూ ఆఫర్ లెటర్ కూడా అందించారని తెలిపారు. కార్యక్రమంలో మిర్యాలగూడ, నకిరేకల్ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, వేముల వీరేశం, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, రామ్ రెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, డి ఐ జి ఎల్ ఎస్ చౌహాన్, సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందు లాల్‌పవార్, ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్, సూర్యాపేట, నల్గొండ జిల్లాల ఎస్పీలు నరసింహ, శరత్ చంద్ర పవార్, డీట్ డైరెక్టర్ రాజేశ్వరరెడ్డి, అడిషనల్ కార్పొరేట్ రిలేషన్ డైరెక్టర్ వంశీధర్ రెడ్డి, సింగరేణి కాలరీస్ ప్రతినిధి చంద్ర, వివిధ శాఖల సిబ్బంది, పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 'డ్యూడ్'100 కోట్లు క్రాస్‌చేయడం హ్యాపీగా ఉంది

## ఈవెంట్‌లో.. హీరో ప్రదీప్ రంగనాథన్



యూత్ సెన్సేషన్ ప్రదీప్ రంగనాథన్ లేటెస్ట్ దీపావళి బ్లాస్ట్ డ్యూడ్. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రంతో కీర్తిశ్వరన్ డైరెక్టర్ గా పరిచయం అయ్యారు. మమిత బైజు నటించగా, శరత్ కుమార్ కీలక పాత్ర పోషించారు. అక్టోబర్ 17న విడుదలైన ఈ చిత్రం అద్భుతమైన రెస్పాన్స్ తో బ్లాక్ బస్టర్ సక్సెస్ అందుకొని హౌస్ ఫుల్ కలెక్షన్స్‌తో రన్ అవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ డ్యూడ్ బ్లాక్ బస్టర్ 100 జర్నీ ఈవెంట్ ని నిర్వహించారు. డ్యూడ్ బ్లాక్ బస్టర్ 100 జర్నీ ఈవెంట్ లో హీరో ప్రదీప్ రంగనాథన్ మాట్లాడుతూ,డ్యూడ్ సినిమా 100 కోట్లు కలెక్షన్స్ ని క్రాస్ చేసింది. తెలుగు ఆడియన్ కి కృతజ్ఞతలు తెలపడానికి ఈవెంట్ ని నిర్వహించడం జరిగింది. ఆడియన్స్ లేకపోతే ఇది సాధ్యమయ్యేది కాదు. లవ్ టు డే. డ్రాగన్ చిత్రాలకు ఎంత ఆదరణ ఇచ్చారో ఈ చిత్రానికి కూడా అంతకంటే ఎక్కువ ఆదరణ అందించారు. మీ సపోర్ట్‌కి ఎప్పుడూ కృతజ్ఞతలు ఉంటాను. మీ అందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు. మా టీమ్ అందరికీ ధన్యవాదాలు.

నిర్మాత ఎస్కేఎన్ మాట్లాడుతూ,మైత్రి మూవీ మేకర్స్ 2000 కోట్ల సినిమాని చూసిన నిర్మాతలు. వారికి ప్రతి నెల ఒక బ్లాక్ బస్టర్ వస్తుంటుంది. దీపావళికి వచ్చిన ఈ సినిమా పాన్ సౌత్ బ్లాక్ బాస్టర్ కావడం చాలా ఆనందంగా ఉంది. మైత్రి మూవీ మేకర్స్ నవీన్ రవివిజన్ వేరు. వాళ్ళ కిరీటంలో మరో మైలురాయి చేరినందుకు అభినందనలు. తొలి సినిమా విజయం సాధించడం చాలా స్పెషల్ అందులో 100 కోట్ల సినిమా సాధించిన డైరెక్టర్ కీర్తికి కంగ్రాజులేషన్స్. ఈ సినిమా చూస్తున్నప్పుడు ఒక సుకుమార్ సినిమా చూస్తున్నంత ఇంటెన్సిటీ ఫీల్ అయ్యాను. మమిత లక్కీ హ్యాండ్. అద్భుతంగా నటించారు. తనకు మరెన్నో విజయాలు రావాలని కోరుకుంటున్నాను. సినిమా విషయానికొస్తే తెలుగు తమిళ్ ఒకే స్టేట్. తమిళ్ స్టార్స్ కూడా మా స్టార్స్ గానే ఫీల్ అవుతాము. కమల్ హాసన్, రజినీకాంత్ ,సూర్య, అజిత్ ధనుష్, విజయ్ సేతుపతి ఇలా ఎవరొచ్చినా సరే మా సొంత సినిమాలానే ప్రేమిస్తాం. ప్రదీప్ కూడా ఇప్పుడు ఈ ఎలైట్ క్లబ్ లో జాయిన్ అయ్యారు. మూడుసార్లు ఇండస్ట్రీని షేక్ చేసి వరుసగా మూడు వంద కోట్ల సినిమాలు ఇచ్చారు. ప్రదీప్ కేవలం హీరో మెటీరియల్ కాదు యాక్టర్ మెటీరియల్ స్టార్ మెటీరియల్. ప్రదీప్ ఇంకా ఎన్నో విజయవంతమైన సినిమాలు చేయాలని, మైత్రి మూవీ మేకర్స్ ఎప్పుడూ కళకళలాడుతూ ఉండాలని కోరుకుంటున్నాను.

హీరోయిన్ మమిత బైజు మాట్లాడుతూ, ఈ సక్సెస్ ని సెలబ్రేట్ చేసుకోవడం చాలా ఆనందంగా ఉంది. సినిమా 100 కోట్లు కలెక్షన్స్ క్రాస్ చేసింది. ఇది మరింత స్పెషల్ మూమెంట్. అడియన్స్ సపోర్టుకి థాంక్యూ. వారి సపోర్ట్ లేకపోతే ఇది సాధ్యం కాదు. ఈ సినిమాకి ఆడియన్స్ నుంచి వచ్చిన రెస్పాన్స్ చాలా ఆనందాన్ని ఇచ్చింది. మై కోస్టార్ ప్రదీప్ కి, డైరెక్టర్ కీర్తికి థాంక్యూ సో మచ్ ఇంత ప్రేమనిచ్చిన తెలుగు ఆడియన్స్‌కి థాంక్యూ.

డైరెక్టర్ కీర్తి ఈశ్వర్ మాట్లాడుతూ,అందరికి నమస్కారం. ప్రదీప్ రంగనాథన్ కి ఇది హ్యాట్రిక్ మూవీ. ఇది నాఫస్ట్ సినిమా. ఇలాంటి కొలబరేషన్లో అద్భుతమైన విజయం వచ్చినందుకు చాలా ఆనందంగా ఉంది. సినిమాని ఇంత గొప్పగా ఆదరించిన తెలుగు ఆడియన్స్‌కి కృతజ్ఞతలు.ఈ సినిమాలో గగన్ క్యారెక్టర్ రాయడానికి చాలా తెలుగు సినిమాల ఇన్స్పిరేషన్ ఉంది. తెలుగు రాష్ట్రాల్లో సినిమా అద్భుతంగా రన్ కావడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. నాకు ఈ అవకాశం ఇచ్చిన ప్రదీప్, మమిత మా టీమ్ అందరికీ థాంక్యు వెరీ మచ్.రైటర్ కృష్ణ మాట్లాడుతూ ,కథ రాసిన కీర్తికి చేసిన ప్రదీప్ కి థాంక్యూ. ఈ క్యారెక్టర్ ని యాక్సెప్ట్ చేసినందుకు మమతకి థాంక్యూ. మైత్రి మూవీ మేకర్స్ అద్భుతంగా తీశారు. డైలాగులు రాస్తున్నప్పుడే ఖచ్చితంగా 100 కోట్లు కొడుతుందని అనుకున్నాను. ఇది డ్యూడ్ దివాళి ఈ అవకాశం ఇచ్చిన రవికి నవీన్‌కి థాంక్యూ.

# సి.వి. కుమార్ దర్శకత్వంలో

## రాబోతోన్న చిత్రం 'ఎక్స్ వై'మోషన్ పోస్టర్ విడుదల..

శ్రీ క్రిష్ పిక్చర్స్, శ్రీ ఇంటర్నేషనల్ బ్యానర్లపై రతిక ప్రధాన పాత్రలో సి.వి. కుమార్ తెరకెక్కించిన చిత్రం'ఎక్స్ వై. డిఫరెంట్ కంటెంట్‌తో రాబోతోన్న ఈ మూవీకి సంబంధించిన మోషన్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఈ మోషన్ పోస్టర్ చూస్తుంటే ఇదొక ప్రయోగాత్మక చిత్రమని అర్థం అవుతోంది. కథ ఏంటి? బ్యాక్ డ్రాప్ ఏంటి? అన్న విషయాల్ని రివీల్ చేయకుండా అందరిలోనూన ఆసక్తిని పెంచేలా మోషన్ పోస్టర్‌ను విడుదల చేశారు. సి.వి. కుమార్ ఎప్పుడూ కూడా పిజ్జా, సూదు కవ్వుమ్, అట్టకత్తి, శరభం, ఇరుది సుట్రు, మాయావన్ లాంటి ప్రయోగాత్మక చిత్రాలు చేస్తూనే ఉంటారు. దర్శక, నిర్మాతగా సి.వి. కుమార్ మరోసారి'ఎక్స్ వై అంటూ ఆడియెన్స్ ముందుకు రాబోతోన్నారు. తాజాగా రిలీజ్ చేసిన మోషన్ పోస్టర్‌లో కనిపించిన టీ పోసే బౌల్, కెమెరా, మెదడు, డీఎన్ఏ, ఆ తరువాత రాక్షసుడిలా ఓ రూపాన్ని చూపించడం, ఆపై హీరోయిన్ లుక్ చూపించడం, అక్కడ చుట్టూ గర్భంలో ఉన్న శిశువుల్ని చూస్తుంటే ఇదొక డిఫరెంట్ అండ్ న్యూ కంటెంట్ మూవీ అని అర్థం అవుతోంది.తెలుగు, తమిళ్, మలయాళం ఇలా అన్ని భాషల్లో ఈ మూవీని రిలీజ్ చేయనున్నారు. ఈ చిత్రానికి శ్రీకాంత్ కృష్ణ సంగీతాన్ని అందిస్తున్నారు. ఈ సినిమాకి హరిహరణ్ ఆనందరాజ కెమెరామెన్‌గా పని చేస్తున్నారు. త్వరలోనే చిత్రానికి సంబంధించిన ఇతర వివరాల్ని ప్రకటించనున్నారు.



# చార్మింగ్ స్టార్ శర్వా 36వ మూవీ 'బైకర్'

బైకర్ కోసం చార్మింగ్ స్టార్ శర్వా జాడ్రాపింగ్ ఫిజికల్ ట్రాన్స్‌ఫర్మేషన్ చార్మింగ్ స్టార్ శర్వా తన 36వ మూవీ 'బైకర్'తో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యారు. స్పోర్ట్స్ ఫ్యామిలీ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి అభిలాష్ కంకర దర్శకత్వం వహిస్తుండగా, ప్రతిష్టాత్మకమైన యూవీ క్రియేషన్స్ సంస్థ నిర్మిస్తోంది. దీపావళి సందర్భంగా విడుదలైన టైటిల్ ఫస్ట్ లుక్ పోస్టర్‌తో సినిమా మీద భారీ అంచనాలు ఏర్పడ్డాయి.



ప్రొఫెషనల్ మోటార్‌సైకిల్ రేసర్ పాత్రలో కనిపించబోతున్న శర్వా తన పాత్ర కోసం జాడ్రాపింగ్ ఫిజికల్ ట్రాన్స్‌ఫర్మేషన్ అయ్యారు. తాజాగా విడుదలైన ఫోటోషూట్ స్టిల్స్ లో ఆయన ఫిజిక్, కాన్ఫిడెన్స్ అంతా కలిపి కొత్త శర్వా ప్రజెంట్ చేశాయి. షర్ట్‌లెస్ లుక్స్‌లో షార్ప్ అబ్స్‌తో, ఫైరీ గేజ్‌తో రేసర్ స్పిరిట్‌ను అద్భుతంగాచూపించారు. శర్వాతన పాత్రకు సరిపడేలా లీన్ అండ్ అథ్లెటిక్ బాడీని తీర్చిదిద్దుకున్నారు. నెలల తరబడి వర్కౌట్స్, డైట్, డెడికేషన్ తో ట్రాన్స్‌ఫర్మేషన్ సాధించారు. ఇంత ఫిట్‌గా, ఎనర్జీగా శర్వా కనిపించడం అభిమానులకు పండుగలా మారింది.ఈ చిత్రంలో మాళవిక నాయర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, బ్రహ్మాజీ, అతుల్ కులకర్ణి కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ సినిమాకి సినిమాటోగ్రఫీకి జె. యువరాజ్, మ్యూజిక్‌కు జిబ్రాన్, అనిల్ కుమార్ పి ఎడిటర్. రాజీవన్ ప్రొడక్షన్ డిజైనర్. ఎ పన్నీర్ సెల్వం ఆర్ట్ డైరెక్టర్ గా వ్యవహరిస్తున్నారు, ఎన్ సందీప్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్. శర్వా కొత్త లుక్, కథ కాన్సెప్ట్, టాప్ టెక్నికల్ టీమ్ ఇవన్నీ కలిసి'బైకర్'ని సినిమాను ఒక థ్రిల్లింగ్ ఎమోషనల్ రైడ్ గా మార్చబోతున్నాయి. అభిమానులు ఇప్పుడు శర్వా కొత్త అవతార్ ని థియేటర్స్‌లో చూడటానికి ఎదురుచూస్తున్నారు

# 'ఎ కప్ ఆఫ్ టీ 'వాట్‌హాపెండ్ ప్రమోషనల్ సాంగ్ విడుదల

గీతా సుబ్రమణ్యం ఫేమ్ మనోజ్ కృష్ణ తన్నీరు హీరోగా నటిస్తోన్న లేటెస్ట్ మూవీ ఎ కప్ ఆఫ్ టీ . నేటి యువతకు నచ్చే కథాంశంతో తెరకెక్కిన ఈ చిత్రం ద్వారా ఎప్పీ రోజర్స్, నిఖిత రావు దర్శకులుగా పరిచయమవుతున్నారు. ఆర్టిస్ట్ క్రియేషన్స్ పతాకంపై మనోజ్ కృష్ణ, నవీన్ కృష్ణ నిర్మించారు. జయ శ్రీ హీరోయిన్‌గా నటిస్తోన్న ఈ మూవీలో నటుడు రాకేష్ ఒక కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ మూవీ నుండి వాట్ హాపెండ్ అనే ప్రమోషనల్ సాంగ్ ని రిలీజ్ చేశారు. డైస్ ఆర్ట్స్ ఫిల్మ్స్ ఈ ఈవెంట్‌ని గ్రాండ్ గా నిర్వహించింది. ఈ కార్యక్రమంలో

హీరో మనోజ్ మాట్లాడుతూ మా సినిమాను జనాల్లోకి తీసుకెళ్లడానికి మేము ఎంచుకున్న మార్గమే ఈ ప్రమోషనల్ సాంగ్..ఈ పాటతో మా సినిమాని ప్రమోట్ చేసి థియేటర్స్ వరకూ తీసుకెళ్లాలి అన్నదే మా టీమ్ ఉద్దేశ్యం..ఎద్ద సినిమాల వల్ల చిన్న సినిమాలు ఎలా ఎఫెక్ట్ అవుతున్నాయి అన్నది ఈ పాటలో ఫన్నీగా చూపించే ప్రయత్నం చేశాం. ఈ సినిమా ఒక యంగ్‌స్టర్ జర్నీఒక కాలేజ్ యువత జర్నీ ఎలా స్టార్ట్ అవుతుంది.

అది ఎలా డీవియేట్ అవుతుంది దాని వల్ల వచ్చే పరిణామాలు ఏంటి అన్నది ఈ సినిమాలో చూపించాం. నేటి యువత తప్పక చూడాల్సిన సినిమా..డైరెక్టర్ ఎప్పీ రోజర్స్ వచ్చి ఈ కథ చెప్పగానే చాలా నచ్చింది. గీత సుబ్రమణ్యం తర్వాత మళ్లీ నాకు అంత హై ఇచ్చిన ఫిల్మ్ ఇది. ఈ సినిమా మీద నేను, మా టీమ్ అందరం చాలా కాన్ఫిడెన్స్‌గా ఉన్నాం. మా టీమ్ అందరికీ మీ సపోర్ట్ ఉండాలని కోరుకుంటున్నాను అన్నారు.మ్యూజిక్ డైరెక్టర్ కార్తిక్ రోద్రవిజ్ మాట్లాడుతూ ,మాది చిన్న సినిమా అయినా మ్యూజిక్, మేకింగ్‌కి మనోజ్ చాలా ఖర్చు పెట్టారు. పాటలు, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ చాలా బాగా వచ్చింది. దర్శకులు మంచి ఔట్‌పుట్ తీసుకువచ్చారు. ఆదిత్య ఒక మంచి క్యారెక్టర్లో కనిపిస్తారు. ట ఒక బ్యూటిఫుల్ లవ్ స్టోరీ..ఒక లైఫ్ స్టోరీ అని చెప్పొచ్చు. యువతరం అందరికీ తప్పకుండా కనెక్ట్ అవుతుందని నమ్మకం ఉంది. మా ఫస్ట్ సాంగ్‌కి మంచి రెస్పాన్స్ రావడం హ్యాపీ అన్నారు.నటుడు రాకేష్ మాట్లాడుతూ, నేను మనోజ్‌కి చాలా పెద్ద ఫ్యాన్.. గీత సుబ్రమణ్యం సిరీస్ టైమ్‌లో తన క్రేజ్ ఏంటో..ఏ రేంజ్లో ఉండేవాడో నాకు తెలుసు.లఆర్టిస్ట్‌గా ఈ సమాజానికి మంచి చేయాలనే ఈ కథ ఎంచుకున్నాడు. ఎలాంటి వల్గారిటీ లేని ఒక బ్యూటిఫుల్ లైఫ్ స్టోరీ..ఈ కథలో తనతో పాటు ట్రావెల్ చేసే క్యారెక్టర్..ఈ పాత్ర నాకు రావడానికి కారణమైన మనోజ్ కి థ్యాంక్స్..ఈ సినిమా పెద్ద హిట్ అవ్వాలి..హీరోగా మనోజ్ బాగా బిజీ అవ్వాలని కోరుకుంటున్నానని అన్నారు.



# కృష్ణచైతన్య చేతుల మీదుగా 'దేవ్‌పారు' సాంగ్‌లాంచ్



డైరెక్టర్ కృష్ణ చైతన్య చేతుల మీదుగా' దేవ్ పారు' సినిమా నుంచి నా ప్రాణమంత సాంగ్ లాంచ్

ఏకే ప్రొడక్షన్స్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న దేవ్ పారు చిత్రం నుంచి ఈ రోజు నా ప్రాణమంత అనే పాట విడుదల అయింది. సింగర్ కాలభైరవ పాడిన ఈ పాట డైరెక్టర్ కృష్ణ చైతన్య చేతుల మీదుగా ఈ విడుదల అయింది. ఈ పాట ఆదిత్యమ్యూజిక్ లో శ్రోతలను ఆకట్టుకుంటుంది. ఈ సందర్భంగా డైరెక్టర్ కృష్ణ చైతన్య మాట్లాడుతూ, కాలభైరవతో కలిసి పనిచేశాను. ఈ టీమ్ అందరికీ ఆల్ ది బెస్ట్. సినిమా గొప్ప విజయం సాధించాలని కోరుకుంటున్నాను అని అన్నారు. దేవ్ పారు మూవీ ఒక ఫ్రెష్, ఎమోషనల్ లవ్ స్టోరీ అని యూత్‌ను ఆకట్టుకుంటుందని చెప్పారు. సినిమాకు అందరూ రిలేట్ అవుతారని చెప్పారు. పాట కూడా చాలా బాగుంది. ఆడియెన్స్ సపోర్ట్ తో సినిమా పెద్ద విజయం సాధిస్తుందని చెప్పారు. దర్శకుడు అంజి మాట్లాడుతూ, ఈ చిత్రం యూత్‌ను బాగా ఆకట్టుకుంటుందని, అఖిల్ రాజు దర్శకుడిగా గొప్ప భవిష్యత్తు ఉందని ప్రశంసించారు. అందరూ కొత్తవారే అయినప్పటికీ హీరో, హీరోయిన్‌లు అద్భుతంగా నటించారని, వారి మధ్య కెమిస్ట్రీ ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని అంజి తెలిపారు. హీరో మిహాస్ రోమి మాట్లాడుతూ, జగ్గయ్యపేట నుంచి హైదరాబాద్ వరకు తన సినీ ప్రయాణంలో ఎన్నో అవమానాలు, అడ్డంకులు ఎదురైనా, తన పాషన్‌తో ఈ స్థాయికి చేరానని ఎమోషనల్‌గా తెలిపారు. ఈ సినిమా రిలీజ్ అయిన తర్వాత తనకు మంచి పేరు వస్తుందని చెప్పారు. మా టీమ్ పాషన్, ప్రొడ్యూసర్ అలీ, డైరెక్టర్ అఖిల్, డీఓపీ అశ్విన్ సపోర్ట్‌తో ఈ సినిమా గొప్ప విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.. లవర్స్ ఈ సినిమాతో రిలేట్ అవుతారు అని అన్నారు. మ్యూజిక్ డైరెక్టర్ ఓషో వెంకట్ అందించిన సంగీతం సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని,అఖిల్ మాట్లాడుతూ, మా డాడీ ఎప్పుడూ నన్ను ముందుకు నడిపించేవారు. ఈ సినిమాకు అద్భుతమైన సంగీతాన్ని అందించారు. ఈ సాంగ్ ప్రతి ఒక్కరి ప్లేలిస్ట్‌లో ఉండాల్సిన ఎమోషనల్ ట్రాక్. అందరూ విని, స్ప్రెడ్ చేయాలని కోరుకుంటున్నాం అని అఖిల్ తెలిపారు.

# కమల్, రజిని ప్రాజెక్ట్ కోసం క్రేజీ డైరెక్టర్?



ఈ మధ్య సెన్సేషనల్ బజ్ ని క్రియేట్ చేసిన భారీ మల్టీస్టారర్ కాంబినేషన్ ఏదన్నా ఉంది అంటే అది సూపర్ స్టార్ రజినీకాంత్ అలాగే యూనివర్సల్ హీరో కమల్ హాసన్ ల కలయిక అని చెప్పాలి. అయితే వీరి కాంబినేషన్ కోసం చాలా మంది దర్శకుల పేర్లు వినిపించాయి కానీ ఇప్పుడు మరో క్రేజీ డైరెక్టర్ పేరు వైరల్ గా మారింది కానీ. మరి ఆ దర్శకుడు ఎవరో కాదు సూపర్ స్టార్ తో ఆల్రెడీ జైలర్ లాంటి భారీ సక్సెస్ కొట్టిన దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ అట. ఇప్పుడు జైలర్ 2 చేస్తున్న ఈ దర్శకుడు నెక్స్ట్ ప్రాజెక్ట్‌గా ఆ భారీ కాంబినేషన్ టేకాఫ్ చేయనున్నట్టుఇప్పుడురూమర్స్ వినిపిస్తున్నాయి.

# 'జటాధర' నుంచి జో లాలి జో సాంగ్ రిలీజ్



సుధీర్ బాబు, జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా 'జటాధర' నుంచి జో లాలి జో సాంగ్ రిలీజ్‌నవ దళపతి సుధీర్ బాబు, బాలీవుడ్ పవర్‌హౌస్ సోనాక్షి సిన్హా ప్రధాన పాత్రలలో నటిస్తున్న మోస్ట్ ఎవైటెడ్ సూపర్ నేచురల్ మైథలాజికల్ థ్రిల్లర్ జటాధర. అద్భుతమైన సినిమాటిక్ అందించే ఈ పాన్‌ఇండియా ద్విభాషా చిత్రానికి వెంకట్ కళ్యాణ్, అభిషేక్ జైస్వాల్ దర్శకత్వం వహించారు. హైఆక్టేన్ విజువల్స్, పౌరాణిక ఇతివృత్తాలతో ఈ చిత్రం గ్రేట్ సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ అందించబోతుంది.ఇటీవల రిలీజ్ అయిన టీజర్, ట్రైలర్ నేషనల్ వైడ్‌గా వైరల్ అయ్యింది. సోల్ ఆఫ్ జటాధార, ధన పిశాచి సాంగ్స్ చార్ట్ బస్టర్ హిట్ అయ్యాయి.తాజాగా మేకర్స్ జోలాలిజోసాంగ్ రిలీజ్ చేశారు. రాజీవ్ రాజ్ ఈ పాటని అద్భుతమైన లాలి పాటగా కంపోజ్ చేశారు. శ్రీమాన్ కీర్తి లిరిక్స్, పావని వాసా, రాజీవ్ రాజ్ వోకల్స్ ఆకట్టుకున్నాయి.ఈ చిత్రంలో దివ్య ఖోస్లా, శిల్పా శిరోధ్కర్, ఇంద్రకృష్ణ, రవి ప్రకాష్, నవీన్ నేని, రోహిత్ పాఠక్, ఝాన్సీ, రాజీవ్ కనకాల, సుభలేఖ సుధాకర్‌తో పాటు ప్రముఖ నటులు కనిపించనున్నారు. జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా సమర్పిస్తున్న ఈ చిత్రాన్ని ఉమేష్ కుమార్ బన్సల్, శివిన్ నారంగ్, అరు ణ అగర్వాల్, ప్రేరణ అరోరా, శిల్పా సింగ్‌హాల్,నిఖిల్ నందా నిర్మించారు. అక్షయ్ కేజ్రీవాల్, కుస్సుమ్ అరోరా సహ నిర్మాతలుగా వ్యవహరించారు.ద్యా విజయ్ క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా, భావిని గోస్వామి సూపర్వైజింగ్ ప్రొడ్యూసర్‌గా ఉన్నారు. సినిమాకి పవర్ ఫుల్ సౌండ్‌స్కేప్‌ను జీ మ్యూజిక్ కో అందిస్తోంది.జటాధర నవంబర్ 7న హిందీ, తెలుగు భాషల్లో విడుదల కానుంది.

# 'ది గర్ల్ ఫ్రెండ్' రశ్మిక నటనకు బెస్ట్ యాక్టర్ అవార్డ్ వస్తుంది

## ట్రైలర్ లాంచ్‌ఈవెంట్ లో ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్

నేషనల్ క్రష్ రశ్మిక మందన్న, టాలెంటెడ్ హీరో దీక్షిత్ శెట్టి జంటగా నటిస్తున్న సినిమా "ది గర్ల్ ఫ్రెండ్". ఈ సినిమాను ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్ టైన్ మెంట్



బ్యానర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఇంటెన్స్, ఎమోషనల్ లవ్ స్టోరీతో దర్శకుడు రాహుల్ రవీంద్రన్ రూపొందిస్తున్నారు. ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మాతలుగా వ్యవహిస్తున్నారు. సరికొత్త ప్రేమ కథగా తెరకెక్కుతున్న ఈ సినిమా నవంబర్ 7న హిందీతో పాటు తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. ఈ రోజు "ది గర్ల్ ఫ్రెండ్' సినిమా ట్రైలర్ రిలీజ్ ఈవెంట్ ను హైదరాబాద్‌లో గ్రాండ్ గా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీవోపీ కృష్ణన్ వసంత్ మాట్లాడుతూ, "ది గర్ల్ ఫ్రెండ్" సినిమా టీమ్ తో వర్క్ చేయడం ఎంతో ఇన్స్ పైర్ చేసింది. ఒక ఇంటెన్స్, ప్యాషనేట్ కంటెంట్ ను ఈ చిత్రంలో చూపించబోతున్నాం. మీరంతా మా మూవీని సపోర్ట్ చేస్తారని, మా సినిమా గురించి మిగతా వారికి చెబుతారని కోరుకుంటున్నా అన్నారు. డైరెక్టర్ రాహుల్ రవీంద్రన్ మాట్లాడుతూ నేను స్టూడెంట్ గా హాస్టల్లో ఉండే రోజుల్లో ఈ స్టోరీ ఐడియా వచ్చింది. దాన్ని కొన్నేళ్ల క్రితం స్టోరీగా రాసుకున్నా. మీరు ఇప్పుడు ట్రైలర్‌లో ఏం చూశారో అదే సినిమా. ఇంటెన్స్ ఎమోషన్ తో ఉంటుంది. రిలేషన్ షిప్ ట్రై చేయాలనుకునే వారు ఈ సినిమాకు బాగా కనెక్ట్ అవుతారు. అమ్మాయిలైనా, అబ్బాయిలైనా "ది గర్ల్ ఫ్రెండ్" సినిమా చూసి ఆ ఎమోషన్ తో బయటకు వస్తారు. మూవీ రియల్ గా, రూటెడ్‌గా, ఇంటెన్స్‌గా, ఎమోషనల్ గా ఉంటుంది. నా టీమ్ అందరూ ప్యాషనేట్ గా వర్క్ చేశారు. హీరో దీక్షిత్, హీరోయిన్ రశ్మికతమ పర్ ఫార్మెన్స్‌తో కథకు లైఫ్ ఇచ్చారు. ట్రైలర్ చూశాక మీకు అర్థమై ఉంటుంది ఇదొక డిఫరెంట్ లవ్ స్టోరీ. ప్రతి ఒక్క ప్రేక్షకుడి మనసుకు హత్తుకునేలా మూవీ ఉంటుంది. ఇలాంటి మంచి కథ తీసుకొచ్చిన రాహుల్ కు థ్యాంక్స్. ఈ క్యారెక్టర్ ను రశ్మిక తప్ప మరో హీరోయిన్ ఇంత బాగా పర్ ఫార్మ్ చేయలేరు. ఆమె గురించి మరో సందర్భంలో మాట్లాడుతా. తను మమ్మల్ని ఇన్స్ పైర్ చేసేది. దీక్షిత్, రశ్మిక తమ పర్ ఫార్మెన్స్‌లతో ఈ కథకు లైఫ్ ఇచ్చారు. నవంబర్ 7న మీ అందరినీ థియేటర్స్ లో కలుస్తాను అన్నారు. రశ్మిక లేకుంటే "ది గర్ల్ ఫ్రెండ్' సినిమానే లేదు. దీక్షిత్ మాకు దొరికిన గొప్ప నటుడు. ఆయన టాలీవుడ్ లో "ది గర్ల్ ఫ్రెండ్" తర్వాత మరో పదేళ్లు వరుసగా సినిమాలు చేస్తారు. వీళ్లిద్దరు తమ పర్ ఫార్మెన్స్ తో ఆకట్టుకుంటారు. అల్లు అరవింద్ గారు లేకుంటే నేను లేను. ఆయన మాకు గాడ్ ఫాదర్. అన్నారు.నిర్మాత బన్నీ వాస్ మాట్లాడుతూ, "ది గర్ల్ ఫ్రెండ్" సినిమా నేను'చూశాను. చివరి 30 నిమిషాల సినిమాను మర్చిపోలేక పోతున్నాను. రశ్మిక మా గీతా ఆర్ట్స్ గీత.ఈ సినిమాలో తను అద్భుతంగా పర్ ఫార్మ్ చేసింది. ఈ సినిమా చూశాక దీక్షిత్ ను కూడా మర్చిపోలేము. థియేటర్స్ లో కూర్చున్న అమ్మాయిల్లో 60 పర్సెంట్ ఈ కథకు బాగా కనెక్ట్ అవుతారు. ఇది మీరు బాగా కనెక్ట్ అయ్యే కథ. తమ గర్ల్ ఫ్రెండ్ తో ఈ సినిమాకు వెళ్లే అబ్బాయిలు జాగ్రత్తగా ఉండండి. ప్రొడ్యూసర్స్ విద్యా, ధీరజ్ ఈ చిత్రంతో మంచి పేరు తెచ్చుకుంటారు.

# వరుణ్ తేజ్, మేర్లపాక గాంధీ,యువి క్రియేషన్స్‌తో శరవేగంగా జరుగుతున్నషూటింగ్




వరుణ్ తేజ్, మేర్లపాక గాంధీ, యువి క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్టైన్మెంట్, ఎస్ థమన్ విటి15 హైదరాబాదులో శరవేగంగా జరుగుతున్న షూటింగ్

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ మోస్ట్ ఎవైటెడ్ మూవీ విటి15, టాలెంటెడ్ డైరెక్టర్ మేర్లపాక గాంధీ డైరెక్షన్‌లో, యువి క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్లపై భారీ బడ్జెట్‌తో గ్రాండ్‌గా రూపొందుతోంది.

ప్రస్తుతం ఈ సినిమా షూటింగు హైదరాబాదులో శరవేగంగా జరుగుతోంది మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్, ముఖ్య తారాగణం పాల్గొంటున్న ఈ కృషియల్ షెడ్యూల్లో చాలా ఇంపార్టెంట్ సీన్స్ చిత్రీకరిస్తున్నారు.

ఈ సినిమా వరుణ్ కెరీర్‌లోనే వెరీ స్పెషల్, ఎక్సయిటింగ్ ప్రాజెక్ట్‌గా ఉండబోతోంది. హారర్-కామెడీ, ఇండియన్ కొరియన్ బ్యాక్డ్రాప్, యూనిక్ కాన్సెప్ట్‌తో తెరకెక్కుతోంది. ఇప్పటికే ఇండియా, విదేశాల్లో మూడు మేజర్ షెడ్యూల్స్ కంప్లీట్ చేసి, గ్రాండ్ విజువల్స్‌ని క్యాప్చర్ చేశారు.ఈ చిత్రానికి థమన్ సంగీతం అందిస్తున్నారు. తొలిప్రేమ తర్వాత వరుణ్ - థమన్ కాంబో మరోసారి అదరగొట్టే ఆల్బమ్ ఇవ్వబోతోంది. త్వరలోనే మేకర్స్ ఎక్సైటింగ్ అప్డేట్స్‌తో అలరించబోతున్నారు.

తారాగణం: వరుణ్ తేజ్, రితికా నాయక్, సత్య
రచన, దర్శకత్వం : మేర్లపాక గాంధీ
నిర్మాతలు: గీజు క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్
సంగీతం: ఎస్ థమన్
పీఆర్వో: వంశీశేఖర్ మార్కెటింగ్: హాష్‌ట్యాగ్ మీడియా.

# సంగీత యువరాణులు



**మ్యూజిక్ బ్యాండ్లు అనగానే చాలావరకూ మగవాళ్లే గుర్తిస్తారు. అమ్మాయిలు ఉన్నా ఒకరో ఇద్దరో! కానీ ఈ బ్యాండ్లులు అలాకాదు...** ఇవి ఏర్పడింది మొత్తం అమ్మాయిలతోనే!

'రిధమ్ ప్రిన్సెస్' ఒడిశాలో తొలి అమ్మాయిల మ్యూజిక్ బ్యాండ్, ప్రియాన్సీ మొహాపాత్ర, సౌమ్య శీతల్, ఐరా కిషోరీ, అనన్య, స్మృతి ఈ బృందంలో సభ్యులు. వీళ్లంతా విద్యార్థులే. వయసూ 16 నుంచి 18 ఏళ్ల మధ్యే ఉంటుంది. వీళ్లలో ఇద్దరు కీబోర్డు ప్లేయర్లు, ఒక్కొక్కరుగా గిటారిస్టు, శాక్సా పోనిస్ట్, ఆక్టాపాడ్ వాద్యకారిణులు ఉన్నారు. నిజానికి వీళ్లంతా విడివిడిగా సంగీత సాధన చేసేవాళ్లు. ఓ వ్యక్తి కారణంగా టీమ్‌గా మారారు. తాజాగా బ్రహ్మపురంలో ఓ స్టేజ్ షో చేసి.... అందరికీ పరిచయమయ్యారు. 'మా కళను ఇంత పెద్ద స్టేజీ మీద ప్రదర్శించడం చాలా ఆనందంగా ఉంది. వ్యక్తిగతంగా చాలా ప్రదర్శనలే ఇచ్చా. కానీ ఓండ్‌గా మారి ఇంతమంది ప్రేక్షకుల ముందు బ్యాండ్ ఇవ్వడం కొత్తగా ఉంది. భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నాం అంటోంది ఆక్టాపాడ్ వాద్యకారిణి సౌమ్య శీతల్. ఇక, ఐరా కిషోరీ 'ఒడిశాలో నేనే తొలి మహిళా షాక్‌ను మా అయిదుగురికీ సంగీతమంటే ప్రాణం. ప్రదర్శనలంటే భయం లేదు. దీంతో ఎక్కడికైనా ధైర్యంగా వెళ్లగలం' అంటోంది. లఖ్‌నవూకు చెంది 'మేరీ జిందగీ' రాక్ బ్యాండ్ కూడా ఐదుగురు మహిళలతోనే ఏర్పాటైంది. అయితే వీళ్లు మెరిసే దుస్తుల్లో కాదు.. సంప్రదాయ చీరకట్టులో కన్నిసూనత సరికొత్త ట్రెండ్‌నీ సృష్టించారు. 2010లో ప్రారంభమైన ఈ బ్యాండ్‌కు రేడియో జాకీ జయ తివారీ నాయకత్వం వహిస్తున్నారు. మహిళలు ఇంట్లో, పని విషయంలో, బంధువుల మధ్య ఎదుర్కొంటునన వివక్షపై గళమెత్తాలనే ఉద్దేశంతో ఈ విమెన్ రాక్ బ్యాండ్‌ని ప్రారంభించారీమె. లింగ సమానత్వం కోసం వీళ్ల చేస్తున్న కృషికీ అభిమానులెక్కువే. □

## తెలుసుకుందాం..

★ కొబ్బరి ఎక్కువ రోజులు బయట నిల్వ ఉండదు కదా.. కానీ చిన్నచిన్నగా తరిగి ఒక పాలిథిన్ కవర్‌లో పెట్టి ఫ్రీజర్‌లో ఉంచితే తొందరగా పాడవ్వదు. చట్నీ, ఇంకా కొబ్బరితో ఏమైనా చేయాలనుకునే ముందు కొద్దిసేపు చల్లని నీటిలో నానబెడితే అది సాధారణ స్థితికి వచ్చేస్తుంది. ఇలా చేయడం వల్ల కొబ్బరి ఎక్కువ కాలం తాజాగా ఉంటుంది. ★. బంగాళాదుంపను ఇతర కాయగూరలతో కలిపి వండేటప్పుడు ఒక చిట్కా పాటించాలి. అవి నిజానికి ఇతర కూరగాయల కంటే నెమ్మదిగా ఉడుకుతాయి. ఎందుకంటే వీటిలోపల స్టార్చ్ ఉంటుంది. తరిగినప్పుడు దాని ప్రభావంతో వేడి నెమ్మదిగా ముక్కలోకి వెళ్లి కూర ఉడకడం ఆలస్యం అవుతుంది. అందుకే ఆలూని కట్ చేశాక చల్లని నీళ్లలో కొద్దిసేపు నాననివ్వాలి. □

# ప్రధాని ప్రశంసించిన యువ బాక్సర్



**పేదరికానికి పంచ్ ఇచ్చి.. ఛాంపియన్‌గా నిలిచింది! ప్రతిభకు ప్రోత్సాతే.. అనుకున్నది సాధించడం పెద్ద కష్టమేమీ కాదు. ఇదే విషయం నిరూపించింది బాక్సర్ మీనాక్షీ హుడా. ఇటీవలే లివర్‌పూల్ వేదికగా జరిగిన 'ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్స్'లో స్వర్ణ పతకం గెలుచుకుంది. పేదరికాన్ని జయించి.. సమాజపు ఒత్తిళ్లకు తలొగ్గకుండా ఆమె సాధించిన ఈ విజయాన్ని ప్రధాని మోదీజీ కూడా ప్రశంసిం చారు. దీంతో ఈ యువ బాక్సర్ స్టోరీ తెలుసుకుందాం.**

నాన్న ఒప్పుకోలేదు! ... ఆడపిల్లలపై ఆంక్షలు ఉండే హరియాణా రాష్ట్రంలో పుట్టి పెరిగిందిమీనాక్షి. అక్కడి రోహ్‌తక్ జిల్లాలోని రూర్కీ గ్రామం. తండ్రి ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు.నలుగురు తోబుట్టువుల్లో చిన్నదైన మీనాక్షి చిన్నతనం నుంచి బాక్సింగ్ క్రీడాకారిణి కావాలని కలలుకంది. సులభం కాదు. అసలే పేదరికం.. దానికి తోడు ఆడపిల్ల ఆటల్లోకొస్తానంటే నలుగురూ నానా రకాలుగా అనుకుంటారు. పైగా బాక్సర్ ప్రత్యేకమైన ఆహార నియమాలు పాటించాల్సి ఉంటుంది.' ఇలా ఆలోచించి తన తండ్రి వెనకడుగు వేశాడంటోంది మీనాక్షి. నేను బాక్సింగ్ నేర్చుకోవడం మొదట మా నాన్నకు ఇష్టం లేదు. ఎందుకంటే ఈ ఆటలో శిక్షణ ఇప్పించడం ఖర్చుతో కూడుకున్నదని ఆయన భావించేవాడు. అంతేకాదు.. మా బంధువులు, ఇరుగుపొరుగు వారు 'నీ కూతురు బాక్సింగ్‌లో కొస్తే రేపు ఆమెను ఎవరు పెళ్లిచేసుకుంటారు? అనేవారు ఇవన్నీ నాన్నను ఎంతో బాధపెట్టేవి. ఇలాంటి పరిస్థితుల్లో అమ్మే నా వెన్నుతట్టింది. నీ ప్రతిభతోనే అందరికీ సమాధానం చెప్పాలి..' అంటూ నాలో ప్రోత్సాహం నింపింది. అని చెబుతూ తన చిన్ననాటి సంగతుల్ని గుర్తు చేసుకుంది యువ బాక్సర్.

**కిట్, శిక్షణ ఉచితంగానే..!** ఇలా తన తల్లి ప్రోత్సాహంతో ఓరోజు స్థానిక బాక్సింగ్ అకాడమీకి వెళ్లింది మీనాక్షి. అక్కడి కోచ్ విజయ్ హుడా ఆమెలోని ప్రతిభను, ఆట పట్ల తనకున్న అంకితభావాన్ని పరీక్షించి చూశారు. దీంతో ఆయనే తనకు ఉచితంగా కోచింగ్ ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు చెబుతోందామె. 'నా కోచ్ విజయ్ సర్ నాకు బాక్సింగ్ కిట్ ఇచ్చారు. ఉచిత శిక్షణ ఇచ్చారు. శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకోవాలంటే ఎలాంటి ఆహారం తీసుకోవాలో నాకు సూచించారు. రోజూ రింగ్‌లో సాధన చేయడమే కాదు.. ఇంటికొచ్చాక ప్రాక్టీస్ చేసేదాన్ని. ఇలా ఆటపై నాకున్న మక్కువను చూసి ఓరోజు మా నాన్న మనసు కూడా మారిపోయింది. ఎలాగైనా నేను ఆ రాణించేలా ప్రోత్సహించాలను కున్నాడు. తన సంపాదనలో కొంత వరకు వెచ్చించి కోచ్ సూచించిన ప్రత్యేకమైన డైటిని నాకు అందించేవాడు. అప్పు చేసి నన్ను పోటీలకు పంపించేవాడు. మ్యాచ్‌లకూ హాజరవుతూ నా చీర్ లీడర్‌గా మారిపోయాడు.. అంటోన్న మీనాక్షి .. ఆయా పతకాలు సాధిస్తూ ఇంతింతై అన్నట్లుగా మెట్టు ఎక్కుతూ ముందుకు సాగింది.



**మోదీజీ ఫోన్ కాల్ ... !**

తొలుత సబ్ జూనియర్ స్థాయిలో, ఖేలో ఇండియా స్కూల్ గేమ్స్‌లో పతకాలు ఒడిసిపట్టిన మీనాక్షి. 2019లో యూత్ నేషనల్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్స్' స్వర్ణ పతకం సాధించింది. ఆపై 'సీనియర్ నేషనల్ ఛాంపియన్విప్స్', 'ఏషియన్ అమెచ్యూర్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్స్'లో వరుసగా రజత పతకాలు కైవసం చేసుకున్న ఈ యంగ్ బాక్సర్.. ఈ క్రమంలో మేటి క్రీడాకారుల్ని ఓడించి శభాష్ అనిపించుకుంది. ముందుగా 52 కిలోల ఫ్లైవెయిట్ పోటీ కిలోల ఫ్లైవెయిట్ విభాగంలో పోటీపడిన మీనాక్షి.. ఆపై 48 కిలోలల మారింది. ఇటీవల ఇంగ్లండ్‌లోని లివర్‌పూల్ వేదికగా జరిగిన 'ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్స్-2025' పోటీల్లోనూ ఇదే విభాగంలో పోటీ పడిన ఆమె.. పసిడి పతకం తన ఖాతాలో వేసుకంఉది. ఈ గేమ్‌లో పలుమార్లు ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన, ఒలింపిక్స్ తక విజేత అయిన కజకిస్థాన్ క్రీడాకారిణి నాజిమ్‌ను మీనాక్షి 4-1 స్కోర్‌తో ఓడించడం విశేషం. ప్రపంచ ఛాంపియన్ కావాలనేది నా కళ. నేడు అది కాకారమైంది. అయితే ఇది ఆరంభం మాత్రమే! భవిష్యత్తులో ఇలాంటి విజయాలు మరెన్నో సాధించా లని, దేశానికి గర్వకారణంగా నిలవాలన్న లక్షనయంతో ముందుకు సాగుతున్నా. ఇక ఈ విజయానికి మరో ప్రత్యేకత ఉంది. అదేంటంటే.. స్వయంగా ప్రధాని మోదీజీ నాకు ఫోన్ చేసపి అభినందనలు తెలిపారు. నువ్వు ఎంతోమంది యువతకు స్ఫూర్తి అంటూ కితాబిచ్చారు. ఆ ప్రశంస ఎప్పటికీ మర్చిపోను. ఎప్పటికైనా నాన్న గర్వపడేలా చేయాలనుకున్నా..చేశా! అంటోన్న మీనాక్షి.. 2021 నుంచి 'ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్'గానూ విధులు నిర్వర్తిస్తోంది. □

# ముఖాన్ని మెరిపించాలంటే ..



ముఖంమీద ఉన్న మచ్చల్ని పోగొట్టి చర్మాన్ని మృదువుగా చేస్తాయి. లేదా రెండు టేబుల్‌స్పూన్ల సెనగపిండిలో నాలుగు టేబుల్‌స్పూన్ల రోజ్‌వాటర్ పోసి పేస్టులా చేసి ముఖానికి పట్టించి 20 నిమిషాల తరవాత గోరువెచ్చని నీటితో కడిగేయాలి. ఇది చర్మం మీదున్న టాక్సిన్లనీ మృతకణాలనీ తొలగించి మెరిసేలా చేస్తుంది.

టేబుల్‌స్పూను బేకింగ్‌సోడాలో ఒకటిన్నర టీస్పూన్ల నీళ్లు పోసి పేస్టులా కలిపి ముఖంమీద మర్దన చేసినట్లుగా రుద్ది ఐదు నిమిషాల తరవాత గోరువెచ్చని నీళ్లతో కడిగేసినా మచ్చలన్నీ పోయి తేటగా అవుతుంది.

బొప్పాయిపండు ముక్కని తీసుకుని దానికి టీస్పూను నిమ్మరసం, టీస్పూను పాలు జోడించి మిక్సీలో మెత్తగా రుబ్బాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి 20 నిమిషాల తరవాత కడిగేసినా ఫలితం ఉంటుంది. ఇందులోని నిమ్మరసం, బొప్పాయి కలిసి చర్మాన్ని బ్లీచ్ చేస్తే, పాలు మృదువుగా మెరిసేలా చేస్తాయి. □

**అరటిపండు, టీస్పూను నిమ్మరసం, టీస్పూను తేనె తీసుకుని అన్నీ మిక్సీలో వేసి మెత్తగా చేయాలి.** ముఖాన్ని శుభ్రంగా కడిగి పొడి టవల్‌తో తుడిచి ఆ మిశ్రమాన్ని పట్టించి పావుగంట తరవాత గోరువెచ్చని నీళ్లతో కడగాలి. అరటిపండులోని ఎ, బి, ఇ విటమిన్లూ పొటాషియం అన్నీ కలిసి

## నట్‌మెగ్ గ్రేటర్

మసాల కూరలు, ఫ్రైడ్ రైస్, బిర్యానీల్లో జాజికాయ వాడతాం. కూడా. మరి జాజి కాయను దాన్ని ముక్కలు చేసేకంటే పొడి చేసి వేస్తే మరింత రుచిగానూ ఉంటుంది. కొద్ది పరిమాణమే సరిపోతుంది సులువుగా పొడి చేయాలంటే నట్‌మెగ్ గ్రేటర్ అనువుగా ఉంటుంది. ఈ చిన్న సాధనంతో అల్లం, శొంఠి మొదలైనవాటిని కూడా తురుముచ్చు. □



# పోషకాల ఉసిరి రుచులు

కార్తీకమాసం వచ్చిందంటే.. ఉసిరి వంటకాలకి రెడ్‌కార్పెట్ పరిచేస్తాం కదా! ఈసారి కూడా వగరు ఉసిరికి కాసనత తీపి, మరికాస్త ఘాటు, ఇంకాస్త కమ్మదనం కలిపేసి భిన్నమైన వంటకాలు చేసేద్దాం.



### ఉసిరికాయ నువ్వుల పచ్చడి..

**కావాల్సినవి:** ఉసిరికాయలు 500గ్రా, పచ్చిమిర్చి 150గ్రా, నువ్వులు 50గ్రా, జీలకర్ర చెంచా, ఆవాలు చెంచా, ఉప్పు 100గ్రా, పసుపు తగినంత, మెంతులు పావుచెంచా, వెల్లుల్లిపాయ ఒక ఇంగువ పావుచెంచా, 200 గ్రా.



**తయారీ:** ఉసిరికాయల్ని శుభ్రం చేసి తడిలేకుండా తుడుచుకోవాలి. జీలకర్ర, మెంతులు, ఆవాలు, నువ్వులని పొడిగా వేయించుకుని, చల్లారాక మిక్సీలో మెత్తగా పొడికొట్టుకోవాలి. పచ్చిమిర్చి, వెల్లుల్లిపాయ రెబ్బల్ని విడిగా, విడిగా మిక్సీలో మెత్తగా రుబ్బుకోవాలి. వెడల్పాటి పాన్‌లో నూనె పోసి.. వేడెక్కాక ఉసిరికాయల్ని వేసి చిన్నమంట మీద ఎక్కడా పచ్చిలేకుండా మగ్గించుకుని పక్కన పెట్టుకోవాలి. అదే నూనెలో ముందుగా చేసి పెట్టుకున్న నువ్వుల పొడి, పచ్చిమిర్చి పేస్ట్, వెల్లుల్లి పేస్ట్, ఇంగువ, ఉప్పు వేసుకుని నూనెలో మగ్గించుకోవాలి. గరిటెతో కలుపుతూ ఉంటే కాసేపటికి నూనె వేరవుతూ ఉంటుంది. అప్పుడు వేయించి పెట్టుకున్న ఉసిరికాయల్ని కూడా వేసి మరో పదినిమిషాలన్నా మగ్గించుకుంటే పచ్చడి సిద్ధం. ఇది నెలరోజులు నిల్వ ఉంటుంది. ఫ్రిజ్‌లో పెడితే మూడునెలల వరకూ ఉంటుంది.

### కొబ్బరి పచ్చడి..

**కావాల్సినవి:** ఉసిరికాయలు ఐదు, కొబ్బరికోరు కప్పు, పచ్చిమిర్చి నాలుగు, జీలకర్ర అరచెంచా, నూనె తగినంత, ఉప్పు తగినంత, నిమ్మరసం చెంచా, ధనియాలు అరచెంచా తాలింపు కోసం: ఆవాలు, శనగపప్పు, మినపప్పు, జీలకర్ర, పసుపు పావుచెంచా చొప్పున, కరివేపాకు, కరివేపాకు రెబ్బ, ఎండుమిర్చి ఒకటి, ఇంగువ పావుచెంచ

**తయారీ:** ఉసిరికాయల్లో తడిలేకుండా చేసి వాటిల్లోని గింజలని తీసేయాలి. స్టౌపై పాన్ పెట్టి వేడెక్కాక... చెంచాన్నర నూనె పోసుకోవాలి. వేడెక్కాక పచ్చిమిర్చి, ధనియాలు, జీలకర్ర వేసి వేయించి పక్కన పెట్టుకోవాలి. అదే పాన్లో మరో చెంచాన్నర వేసుకొని అందులో ఉసిరిముక్కల్ని తక్కువ మంట మీద ఐదునిమిషాలు వేయించుకోవాలి. రోటిలో లేదా మిక్సీలో వేయించి పెట్టుకున్న పచ్చిమిర్చి, జీలకర్ర, ధనియాలని కచ్చాపచ్చాగా దంచుకోవాలి. అందులో వేయించిన ఉసిరిముక్కలు ఉప్పు కూడా వేసి రుబ్బుకోవాలి. అవన్నీ నలిగాక అప్పుడు కొబ్బరికోరు వేసి మళ్లీ రుబ్బుకోవాలి. పాన్లో ఇంగువ తాలింపు వేసి స్టౌ కట్టేసి, అందులో రుబ్బిన కొబ్బరి మిశ్రమాన్ని వేసి బాగా కలపాలి. ఈ ఉసిరి కొబ్బరి పచ్చడిలో కాస్త నెయ్యి వేసుకుంటే అన్నంలోకి భలే రుచిగా ఉంటుంది.



### సాల్ట్ క్యాండీలు ..

**కావాల్సినవి:** ఉసిరికాయలు అరకెజీ, పంచదార రెండు చెంచాలు, ఉప్పు తగినంత

తయారీ: ఉసిరికాయల్ని కడిగి శుభ్రం చేసి, తడిలేకుండా తుడిచిక్ కవర్‌లో ఉంచి డీప్ ఫ్రిజ్‌లో పెట్టాలి. ఒక రోజు తర్వాత వీటిని తీస్తే పెద్దగా శ్రమ లేకుండా చాకుతో క్యాండీలకు కావాల్సిన విధంగా ముక్కలు చేసుకోవచ్చు. ఇప్పుడా ఆమ్లా ముక్కలపై మనకి కావాల్సిన పరిమాణంలో ఉప్పు వేసుకోవాలి. ఉప్పు మరీ ఎక్కువగా ఉన్నా తినలేం. కాబట్టి కాస్త తగ్గించి వేసుకుంటే మేలు. ఆపై పంచదారని కూడా వేసుకుని బాగా కలపాలి. మరుసటిరోజుకి ఈ ముక్కలు బాగా ఊరతాయి. ఆ తర్వాత నాలుగు రోజులు ఎండలో ఉంచితే సాల్ట్ క్యాండీస్ సిద్ధమవుతుంది. ఈ ముక్కలతో ఉసిరి పులిహోరచేసుకోవచ్చు. దధ్యోజనంలో వేసుకున్నా రుచిగా ఉంటాయి.



### మురబ్బా..

**కావాల్సినవి:** ఉసిరికాయలు20, పంచదార రెండున్నర కప్పులు, యాలకులపొడి పావుచెంచా, కుంకుమపువ్వు ఐదు పలుకులు

**తయారీ:** ఉసిరికాయల్ని కడిగి శుభ్రం చేసి వాటికి ఫోర్క్ గాట్లు పెట్టాలి. స్టౌ వెలిగించి ఒక పాత్రలో నీళ్లు తీసుకుని ఉసిరికాయల్ని ఉడికించి, నీళ్లు వార్చుకుని పెట్టుకోవాలి. ఇప్పుడు పాన్లో మూడుకప్పుల నీళ్లు తీసుకుని పంచదార వేసి కరిగించుకోవాలి. ఇందులోనే ఉసిరికాయల్ని కూడా వేసి మెత్తగా అయ్యేలా అరగంటపాటు ఉడికించుకోవాలి. ఈపాకాన్ని రెండు రోజులు పాటు ఉంచితే ఉసిరికాయలు బాగా ఊరతాయి. ఆ తర్వాత పాకం నుంచి ఉసిరికాయల్ని వేరుచేసి మరోసారి పొయ్యిమీద పాకాన్ని పెట్టి యాలకులపొడి, కుంకుమపువ్వు కూడా చేసి తీగపాకం రానివ్వాలి. తిరిగి ఉసిరికాయల్ని కలిపితే మురబ్బా సిద్ధం. ఇవి పాటు ఏడాది నిల్వ ఉంటుంది.



### ఉసిరి కారం ..

**కావాల్సినవి:** ఉసిరికాయలు మూడు, ఉల్లిపాయలు ఒకటి(చిన్నది), వెల్లుల్లి రెబ్బలు మూడు, నూనె మూడు చెంచాలు, కారం రెండు చెంచాలు, ఉప్పు తగినంత, తాలింపు కోసం: ఆవాలు పావుచెంచా, జీలకర్ర పావుచెంచా. కరివేపాకు ఒక రెబ్బ



**తయారీ:** ఉసిరికాయల్ని శుభ్రం చేసుకోవాలి. తర్వాత వాటిని ముక్కలు చేసి గింజలు తీసి ఉల్లిపాయముక్కలు, వెల్లుల్లితో కలిపి మిక్సీ పట్టుకోవాలి. స్టౌపై పాన్పెట్టి మూడు చెంచాల నూనె పోసి వేడెక్కాక జీలకర్ర, ఆవాలు, కరివేపాకు వేసి తాలింపు వేసుకోవాలి. ఇందులో రుబ్బి పెట్టుకున్న ఉసిరిముద్దను చేసుకుని పచ్చివాసన పోయేవరకూ వేయించుకోవాలి. ఆ తర్వాత కారం, ఉప్పు వేసి కాసేపు ఉడకనివ్వాలి. మరి కాసేపటికి నూనె వేరవుతుంది. అప్పుడు దింపేయాలి. ఇది టిఫిన్లలోకి, అన్నంలోకి కూడా బాగుంటుంది. □

## ఆయన నామంలోనే 'రక్షణ' ఉంది

'యెహోవా నామము బలమైన దుర్గము. నీతిమంతుడు అందులోనికి పరుగెత్తి సురక్షితముగా నుండును' (సామెతలు 18:10). 'ఎవనివలనను రక్షణ కలుగదు, ఈ నామముననే మనము రక్షణ పొందవలెను గాని, ఆకాశము క్రింద మనుష్యులలో ఇయ్యబడిన మరి ఏ నామమున రక్షణ పొందలేము అనెను' (అపొస్తలుల కార్యములు 4:12). ఈలోకంలో దేవతలు, దేవుళ్ల అనేవారు చాలామంది ఉన్నారు. ఎవరి విశ్వాసం వారిది, ఎవరి నమ్మకం వారిది. కానీ 'యేసుక్రీస్తు' నామంలోనే తప్ప మరొక నామంలో 'రక్షణ' అనేది లేదు. ఎందుకంటే ఆయన మాత్రమే సర్వమానవాళి కోసం మరణించాడు. ఆయన ఏ పాపం చేయలేదు, ఆయన పుట్టుకే పరిశుద్ధమైనది. ఆయన పరిశుద్ధంగా జీవించాడు. మనందరి పాపాన్ని తనపై వేసుకుని మరణించాడు. అందుకే యేసుక్రీస్తు స్వయంగా చెబుతున్నాడు 'కుమారుని చూచి ఆయన యందు విశ్వాసముంచు ప్రతివాడును నిత్యజీవము పొందుటయే నా తండ్రి చిత్తము, అంత్యదినమున నేను వానిని లేపుదును' (యోహాను 6:40). యేసుప్రభువును విశ్వసించేవారు మాత్రమే నిత్యజీవాన్ని పొందుతారు. అంటే పరలోకానికి ప్రవేశించి, సదా ఆయనను స్తుతించగలరు. ప్రభువు తన ప్రాణాన్ని మనకోసం ఇచ్చాడు కాబట్టి, తను మాత్రమే నిజమైన దేవుడని చెప్పాడు. అందుకే యేసుక్రీస్తు బలమైన దుర్గము, నీతిమంతుడు అందులో పరుగెత్తి సురక్షితంగా ఉంటాడు. అంటే ఆయనను విశ్వసించేవారు పరలోకంలో ఉంటారు. లేకపోతే నిత్యనరకమే. ఇదే విషయాన్ని పేతురు నొక్కిచెప్పాడు. అలాగని ఆయన ఎవరిని బలవంతం చేసేవాడు కాదు. తన ప్రేమను రుచిచూసి తెలుసుకుని, తనను వెంబడించమని దేవుడు చెబుతున్నాడు. గుడ్డిగా నమ్మి, వెంబడించమని చెప్పేవాడు కాదు. రుచి చూసి, ప్రేమను అనుభవించి, వెంబడించడమే ధన్యత. నిత్యనరకం నుంచి తప్పించబడతారు. చాలామంది మతానికి, ఆచారసాంప్రదాయాలకు ప్రాధాన్యత ఇస్తారు. ఇందులో తప్పు లేదు. కానీ ఇదే రక్షణకు అనువైనమార్గమని భ్రమపడుతున్నారు. రక్షణ అనేది దేవుడికి మనకు మధ్య ఉండే అనుబంధానికి హేతువు. 'యేసు ప్రభువని నీ నోటితో ఒప్పుకొని, దేవుడు మృతులలోనుండి ఆయనను లేపెనని నీ హృదయమందు విశ్వసించినయెడల, నీవు రక్షింపబడుదువు' (రోమా 10:9) నోటితో ఒప్పుకుని, హృదయంతో విశ్వసిస్తే, రక్షణ అనేది వస్తుంది. ఈ అనుభవం గుండా పయనిద్దామా!

-పి.వాణిపుష్ప



అంతర్వాణి

## చెలి చిట్కాలు

★ కాకర కాయ రసము రోజూ ఒక చెంచా సేవించటం వలన చర్మం నున్నగా వుండి మొటిమలు రాకుండా అరికడుతుంది.

★ కొంచెం వేపాకు మెత్తగానూరి దానికి చందనంపొడి కలిపి మొటిమల మీద పూసి గంటతర్వాత స్నానం చేయండి. మొటిమలు పోతాయి.

★ పుదీనా ఆకులను మెత్తగానూరి ప్రతిరోజు రాత్రిపూట ముఖానికి రాసి ప్రొద్దుట గోరు మెచ్చని నీటితో కడిగివేయాలి.

ఈ విధముగా చేయడం వలన మొటిమలు మచ్చలు పోతాయి.

★. మందుల షాపులలో లభించే క్లియరాసిల్ అయింట్‌మెంట్ ప్రతీరోజూ రాత్రిపూట రాసుకొని ఉదయం గోరుమెచ్చని నీటితో కడగండి. మొటిమలు నివారణ అవుతాయి. □

## వరల్డ్ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్..
## నేహా, పుల్కిత్, సృష్టి, నిషు
# కాంస్యాలు
### భారత్ ఖాతాలో నాలుగు పతకాలు

**న్యూఢిల్లీ:** అండర్ 23 ప్రపంచ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో నేహా శర్మ, పుల్కిత్, సృష్టి, నిషు కాంస్య పతకాలను సాధించారు. ఇదే సమయంలో హన్సిక లాంబా, సరిక మహిళల 53 కిలోలు మరియు 59 కిలోల బంగారు పతక పోటీలలో ప్రవేశించారు. సెర్బియాలో జరిగిన ఛాంపియన్‌షిప్ లో భారత మహిళల ఫ్రీస్టైల్ రెజ్లర్లు నాలుగు కాంస్య పతకాలను గెలుచుకుని తమ ప్రతిభను కనబరిచారు.



నిషు (55 కిలోలు), నేహా శర్మ (57 కిలోలు), పుల్కిత్ (65 కిలోలు), సృష్టి (68 కిలోలు) అద్భుతమైన విజయాల తర్వాత కాంస్య పతకాలను గెలుచుకుని భారత పతకాల సంఖ్యను ఆరుకు చేర్చారు. అలాగే హన్సిక లాంబా (53 కిలోలు) సరిక (59 కిలోలు) ఫైనల్‌కు చేరుకున్నారు. ఇక 53 కిలోల ఫైనల్‌కు చేరుకునే మార్గంలో వర్ధమాన క్రీడాకారిణి హన్సిక లాంబా వరుస ప్రదర్శనలు ఇచ్చింది. ఆమె విక్టోరియా వోక్‌పై 11-0 టెక్నికల్ సుపీరియారిటీ విజయంతో ప్రారంభించి, ఆ తర్వాత కజకిస్తాన్‌కు చెందిన జైనెప్ బయానోవాపై 8-2 విజయంతో, ఉజ్బెకిస్తాన్‌కు చెందిన దిల్షోడా మట్నుజరోవాపై 10-0 విజయంతో తన సెమీఫైనల్ స్థానాన్ని ఖాయం చేసుకుంది. మరోవైపు సరికా తన ప్రత్యర్థులను అధిగమించింది, యుఎస్ఎ కి చెందిన అలెక్సిస్ జానక్ పై 4-2 విజయంతో ప్రారంభించి, ఆపై నార్వేకి చెందిన ఒథెలీ హోయీపై 5-2తోను, ఆ తర్వాత సెమీఫైనల్స్‌లో పోలాండ్‌కు చెందిన ఓల్గా పడోషిక్‌పై 12-6 తేడాతో విజయం సాధించి ఫైనల్స్‌లో తన స్థానాన్ని బుక్ చేసుకుంది.




## ఆస్ట్రేలియాతో ఆఖరి వన్డే..
# దుమ్ములేపిన రోహిత్, కోహ్లీ జోడీ

ఆట

### 9 వికెట్ల తేడాతో భారత్ ఘన విజయం

**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా తొలి రెండు వన్డేల్లో ఓటమి పాలైన టీమిండియా చివరిదైన మూడో వన్డేలో మాత్రం అదరగొట్టింది. సిడ్నీ వేదికగా శనివారం జరిగిన ఈ మ్యాచలో అగ్రశ్రేణి బ్యాటర్లైన రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీల పవర్‌ప్యాక్డ్ ప్రదర్శనతో భారత్ ఈ మ్యాచ్‌ను వన్ సైడ్ చేసి 9 వికెట్ల తేడాతో గెలిచి, సిరీస్‌ను విజయంతో ముగించింది. యువ ఫాస్ట్ బౌలర్ హర్షిత్ రాణా నాలుగు వికెట్లతో ఆస్ట్రేలియాను 236 పరుగులకే కట్టడి చేయగా, రోహిత్ సెంచరీ, కోహ్లీ హాఫ్ సెంచరీతో టీమిండియాకు అఖండ విజయాన్ని అందించాయి. ఈ వన్డేలో టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న ఆస్ట్రేలియా భారత బౌలర్ల ధాటికి 50 ఓవర్లు కూడా ఆడలేకపోయింది. కేవలం 46.4 ఓవర్లలోనే 236 పరుగులకు ఆలౌట్ అయ్యింది. భారత్ తరఫున యువ ఫాస్ట్ బౌలర్ హర్షిత్ రాణా అత్యధికంగా 4 వికెట్లు పడగొట్టి ఆసీస్ పతనాన్ని శాసించాడు. వాషింగ్టన్ సుందర్ 2 వికెట్లు తీయగా, కుల్దీప్ యాదవ్, మహ్మద్ సిరాజ్, ప్రసిధ్ కృష్ణ, అక్షర్ పటేల్‌లకు చెరో వికెట్ లభించింది. ఆస్ట్రేలియా బ్యాటర్లలో మాట్ రెన్షా ఒక్కడే 56 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. 237 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో భారత్‌క శుభ్‌మన్ గిల్ రూపంలో 69 పరుగుల వద్ద తొలి ఎదురుదెబ్బ తగిలింది. గిల్‌ను జోష్ హేజిల్‌వుడ్ అవుట్ చేశాడు. ఆ తర్వాత క్రీజ్‌లోకి వచ్చిన విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మతో కలిసి ఆస్ట్రేలియా బౌలర్లకు ఏ మాత్రం అవకాశం ఇవ్వలేదు. ఈ ఇద్దరు దిగ్గజాలు కలిసి 168 పరుగుల మ్యాచ్ విన్నింగ్ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఈ భాగస్వామ్యం కారణంగా భారత్ కేవలం ఒక్క వికెట్ కోల్పోయి 38.3 ఓవర్లలోనే లక్ష్యాన్ని చేరుకుంది, ఇంకా 69 బంతులు మిగిలి ఉండగానే విజయం సాధించింది. రోహిత్ శర్మ 125 బంతుల్లో 13 ఫోర్లు, 3 సిక్సర్ల సాయంతో 121 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. విరాట్ కోహ్లీ 81 బంతుల్లో 7 ఫోర్లతో 74 పరుగులు చేసి జట్టును విజయతీరాలకు చేర్చాడు. ఆస్ట్రేలియా తరఫున జోష్ హేజిల్‌వుడ్ ఒక్క వికెట్ మాత్రమే తీయగలిగాడు.




## స్టార్ కంటెండర్‌లో
# మనికా విజయం
### దియా, జ్ఞానశేఖరన్ ఔట్

**న్యూఢిల్లీ:** డబ్ల్యూటిటిస్టార్ కాంటెండర్ లండన్-2025లో మొదటి రోజున భారత టేబుల్ టెన్నిస్ ఆటగాళ్లకు మిశ్రమ ఫలితాలు వచ్చాయి. ఇద్దరు తదుపరి రౌండ్‌కు చేరుకోగా, మరో ఇద్దరు రౌండ్ ఆఫ్ 32 లో నిష్క్రమించారు. పురుషుల సింగిల్స్‌లో హర్మీత్ దేశాయ్ దక్షిణ కొరియాకు చెందిన హ్వాన్ బేను వరుస గేమ్‌లలో 11-8, 13-11, 11-4తో ఓడించి రౌండ్ ఆఫ్ 16కి చేరుకున్నాడు. తోటి భారత ఆటగాడు మానవ్ ఠక్కర్ కూడా తదుపరి దశలో తన స్థానాన్ని బుక్ చేసుకున్నాడు. కానర్ గ్రీన్‌ను నాలుగు గేమ్‌లలో 11-5, 8-11, 11-7, 11-9తో ఓడించాడు. అలాగే గట్టి పోటీ పడిన మ్యాచ్‌లో సత్యన్ జ్ఞానశేఖరన్ ముందుకు సాగలేకపోయాడు. జపాన్‌కు చెందిన సోరా మత్సుషిమా చేతిలో 6-11, 10-12, 9-11 తేడాతో ఓడిపోయి పురుషుల సింగిల్స్‌లో తన ప్రచారాన్ని ముందుగానే ముగించాడు. ఇక మహిళల సింగిల్స్‌లో, మానికా బాత్రా తన ప్రత్యర్థి మరియా జియావోపై అద్భుతమైన పునరాగమనం చేసింది. ఉత్కంఠ భరితమైన ఐదుసెట్ల మ్యాచ్‌ను 19-17, 8-11, 2-11, 11-8, 11-6తో గెలుచుకుని తదుపరి రౌండ్‌లోకి ప్రవేశించింది. మరోపక్క దియా చిటాలే జపాన్‌కు చెందిన మివా హారిమోటో చేతిలో32వ రౌండ్‌లో తన టోర్నమెంట్ పరుగును ముగించింది. ఈ ఫలితాలతో, భారత్‌కు చెందినముగ్గురు ఆటగాళ్ళు సింగిల్స్ ఈవెంట్లలో ముందుకు సాగుతున్నారు.

## మహిళల వరల్డ్ కప్‌లో..
# ఒక్క విజయం లేని పాక్
### అవమానంతో నిష్క్రమణ.. శ్రీలంక ఆశలు కూడా అడియాసలే

**న్యూఢిల్లీ:** మహిళల ప్రపంచ కప్-2025 నుండి పాకిస్తాన్ జట్టు చివరి మ్యాచ్ అడకుండానే అవమానం భారం, బాధతో నిష్క్రమించింది. దీంతో పాక్ అడిన ఏడు మ్యాచ్‌ల్లోనూ ఒక్క విజయం కూడా లేకుండా పోయింది. శ్రీలంకతో జరగాల్సిన పాకిస్తాన్ ఫైనల్ మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది, ఫలితంగా పాక్ ఓటమితో టోర్నమెంట్‌ను ముగించింది. కొలంబోలోని ఆర్ ప్రేమదాస స్టేడియంలో వర్షం కారణంగా రద్దు చేయబడిన ఈ టోర్నమెంట్‌లోని ఐదవ మ్యాచ్ ఇది. దీంతో నిర్వాహకుల ప్రణాళికపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.
శుక్రవారం కొలంబోలో నిరంతర వర్షం కారణంగా శ్రీలంక, పాకిస్తాన్ మధ్య జరగాల్సిన మ్యాచ్ రద్దు చేయబడింది. మొదట బ్యాటింగ్ చేసిన పాకిస్తాన్ 4.2 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 18 పరుగులు చేసిన సమయంలో వర్షం కురవడంతో మ్యాచ్ రద్దయింది. మరోవైపు శ్రీలంక జట్టు ఆశలు కూడా అడియాసలయ్యాయి. ఈ సమయంలో ఈశాన్య రుతుపవనాలు ఈ ప్రాంతంలో చురుగ్గా ఉంటాయనేది రహస్యం కాదు. అయినప్పటికీ, నిర్వాహకులు షెడ్యూల్‌ను కొనసాగించాలని నిర్ణయించుకున్నారు. మ్యాచ్‌ల రద్దు కూడా శ్రీలంక సెమీఫైనల్స్‌కు చేరుకోవాలనే ఆశలను దెబ్బతీసింది. ఎనిమిది జట్ల పట్టికలో ఆతిథ్య శ్రీలంక ఐదవ స్థానంలో నిలిచిం, ఒక విజయం, మూడు ఓటములు మరియు వర్షం కారణంగా రద్దు చేయబడిన మూడు మ్యాచ్‌లతో సహా ఐదు పాయింట్లు సాధించింది. ఈ తుది ఫలితం లేని చివరి గ్రూప్ మ్యాచ్‌లో, దశాబ్ద కాలంగా జట్టుకు నాయకత్వం వహించిన శ్రీలంక కెప్టెన్ చమరి ఆటపట్టుపై అందరి దృష్టి ఉంది.
35 ఏళ్ల ఆమె చివరి ప్రపంచ కప్ ఇదే కావడం విశేషం. ఆమె తన సుదీర్ఘమైన మరియు అద్భుతమైన కెరీర్‌లో అనేక విజయాలు సాధించింది. ఇక పాకిస్తాన్ ఏడు మ్యాచ్‌ల్లో కేవలం రెండు పాయింట్లు మాత్రమే సాధించింది. నాలుగు ఓటములు, మూడు ఫలితాలు రాలేదు. దీంతో టోర్నమెంట్‌లో ఒక్కటి కూడా గెలిచే అవకాశం లేకుండా పోయింది.



# వాణిజ్యం




## రిలయన్స్‌మెటా జాయింట్ వెంచర్
# ఎఐ ప్రాజెక్ట్
### రూ.855 కోట్లతో అవగాహనకు వచ్చిన రెండు సంస్థలు

**ముంబయి, అక్టోబరు 25:** రిలయన్స్ ఇండస్ట్రీస్ సంస్థ కొత్త జాయింట్ వెంచర్‌ను ఏర్పాటుచేస్తోంది. రిలయన్స్ ఎంటర్‌ప్రైజ్ ఇంటెలి జెన్స్ ఫేస్‌బుక్ ఓవర్సీస్ ఇంక్ సంస్థతో కలిసి ఒప్పందంచేసుకుని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సేవలు భారత్‌లో అందించేందుకు సిద్ధం అయింది. రిలయన్స్ ఇంటెలిజెన్స్ ఇందుకోసం 2కోట్లు ప్రాథమిక చందాగా పెట్టుబడిపెట్టింది. రెండు మిలియన్ల ఈక్విటీ వాటాలు కొనుగోలుచేసింది. కొత్తకంపెనీ ఆర్ఐఎల్ రిలయన్స్ ఇంటెలిజెన్స్‌కు అనుబంధంగా కొనసాగుతుంది. ఆ తర్వాత ఫేస్‌బుక్‌తో కలిసి జాయింట్ వెంచర్‌సంస్థగా వస్తుంది. ఈ జాయింట్ వెంచర్‌లో మొత్తం పెట్టుబడులు 855 కోట్లుగా ఉంటాయి. రిలయన్స్ ఇంటెలిజెన్స్ 70శాతం వాటాతోను, ఫేస్‌బుక్ మిగిలిన 30శాతం వాటాతోను కొనసాగుతాయి. రెండుకంపెనీలు కూడా సంయుక్తంగా ముందు 855 కోట్లు ఈప్రాజెక్టుకోసం పెట్టుబడులు కేటాయించాయి. అయితే ఇందుకు ఎలాంటి చట్టపరమైన అనుమతులు అవసరం లేదని చెపుతున్నాయి. ఈ లావాదేవీ పార్టీ లావాదేవీ కిందకు రాదని, ఈ వెంచర్‌లో ప్రమోటర్లు లేదా గ్రూప్‌కంపెనీలకు కానీ ఎలాంటి ఆర్థిక ఆసక్తి లేకపోవడంతో చట్టపరంగా ఎలాంటి అనుమతులు అవసరం లేదని చెపుతున్నారు. అంతేకాకుండా ఆర్ఐఎల్ విలీనానికి ఎలాంటి అనుమతులు కూడా అవసరంలేదని పేర్కొంటున్నాయి.

## అదానీ పెట్టుబడులపై
# ఎలాంటి ఒత్తిళ్లులేవు
### మాదే ఫైనల్ నిర్ణయం.. అదానీ గ్రూప్ వెల్లడి






**ముంబయి, అక్టోబరు 25:** ప్రభుత్వ రంగానికి చెందిన అతిపెద్ద జీవిత బీమా సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అదానీ గ్రూప్ కంపెనీల్లోని తమ పెట్టుబడులపై వస్తున్న ఆరోపణలపై వివరణ ఇచ్చింది. ఈ పెట్టుబడులపై ఎవరి నుంచి ఎలాంటి ఒత్తిళ్లు లేవని ఇది తమ స్వతంత్ర నిర్ణయమేనని స్పష్టం చేసింది ఎల్ఐసీ. ఈ ఏడాది ప్రారంభంలో అప్పులు, అమెరికా సంస్థల నుంచి ఒత్తిళ్లు ఎదుర్కొంటున్న సమయంలో అదానీ గ్రూప్ కంపెనీల్లో ఎల్ఐసీ పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టిందన్న మీడియా కథనంపై ఎల్ఐసి స్పందించింది. ఆరోపణలపై తాజాగా స్పందించిన ఎల్ఐసీ ఆకథనం తీవ్రంగా ఖండించింది.
ఈ మేరకు దానికి బదులుగా ట్విట్టర్‌లో ఒక పోస్ట్ చేసింది. ఇక్కడ ఆ కథనం పూర్తిగా నిరాధారం అని తెలిపింది. పెట్టుబడులపై తమదే తుది నిర్ణయం అని ఎల్ఐసీ బోర్డు ఆమోదించిన నిర్ణయాలకు అనుగుణంగానే తాము స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకుంటామని స్పష్టం చేసింది. దేశంలోని టాప్ 500 కంపెనీల్లో పెట్టుబడులు కొనసాగిస్తోంది ఎల్ఐసీ. 2014లో ఈ పెట్టుబడుల విలువ రూ. 1.56 లక్షల కోట్లుగా ఉండగా.. అది 2025 నాటికి 10 రెట్లు పెరిగి రూ. 15.6 లక్షల కోట్లకు చేరడం విశేషం. ఇక్కడ అదానీ గ్రూప్‌లో 4 శాతం వాటా కలిగి ఉంది. దీని విలువ సుమారు రూ. 60 వేల కోట్లుగా ఉంది. అదానీ గ్రూప్ మాత్రమే కాదు దిగ్గజ పారిశ్రామిక వేత్త ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ సహా టాటా గ్రూప్, ఐటీసీ ఇలా చాలా కంపెనీల్లో వాటాలు ఉన్నాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్‌లో 6.94 శాతం వాటాకు సమానమైన రూ. 1.34 లక్షల కోట్ల పెట్టుబడులు ఉన్నాయి. ఐటీసీలో 15.86 శాతం (రూ. 82,800 కోట్లు), బీదీనీది బ్యాంకులో రూ. 64,725 కోట్లు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో రూ. 79,361 కోట్ల పెట్టుబడి ఉంది. ఇదే సమయంలో ఒక్క టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్‌లోనే 5.02 శాతం వాటాకు సమానమైన రూ. 5.7 లక్షల కోట్ల పెట్టుబడులు ఎల్ఐసీకి ఉండటం విశేషం.

## రష్యాచమురు దిగుమతులపై అగ్రదేశాల
# ఆంక్షలు పాటిస్తాం
### రిలయన్స్ ఇండస్ట్రీస్ వెల్లడి




**ముంబయి, అక్టోబరు 25:** రష్యా ముడి చమురు దిగుమతులపై అమెరికా, బ్రిటన్, యూరోపియన్ యూనియన్ దేశాలు విధించిన ఆంక్షలను పాటిస్తామని రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ప్రకటించింది. రిఫైనరీ ఉత్పత్తుల దిగుమతి విషయంలో ఈయూ మార్గదర్శకాలకు అనుగుణంగా వ్యవహరిస్తామని సంస్థ స్పష్టం చేసింది. అంతర్జాతీయ చట్టాలు, ఆంక్షల నిబంధనలు, నియంత్రణ మార్గదర్శకాలను ఎటువంటి ఉల్లంఘన లేకుండా పాటిస్తాం. ప్రస్తుతం అమెరికా, బ్రిటన్, ఈయూ ప్రకటించిన ఆంక్షల ప్రభావాన్ని సమీక్షిస్తున్నామని రిలయన్స్ వెల్లడించింది. ఉక్రెయిన్‌పై రష్యా చేస్తున్న యుద్ధ చర్యలకు ప్రతిస్పందనగా అమెరికా తాజాగా రష్యా చమురు దిగుమతులపై కఠిన ఆంక్షలు విధించింది. రష్యా చమురు దిగ్గజ సంస్థలు 'రాస్‌నెఫ్ట్', 'లుకాయిల్'తో ఏ దేశం, కంపెనీ వ్యాపారం చేయరాదని హెచ్చరించింది. ఈ కంపెనీలతో కొనసాగుతున్న లావాదేవీలను నవంబర్ 21 నాటికి పూర్తిగా ముగించాలని అమెరికా స్పష్టం చేసింది. భారతదేశం రష్యా నుంచి రోజుకు సగటున 1.7 మిలియన్ బ్యారెళ్ల (ఎండీబీ) ముడి చమురు దిగుమతి చేసుకుంటోంది. అందులో దాదాపు 1.2 ఎండీబీ రాస్‌నెఫ్ట్, లుకాయిల్ సంస్థల నుంచే వస్తున్నట్లు అంచనా. ఇందులో రిలయన్స్, నయారా ఎనర్జీ వంటి ప్రైవేట్ రిఫైనరీలు ప్రధానంగా దిగుమతులు చేస్తున్నాయి. పాశ్చాత్య దేశాల ఆంక్షలు కఠినతరమవుతుండటంతో, భారతీయ కంపెనీలు ఇప్పుడు పశ్చిమాసియా దేశాల వైపు ముడి చమురు కొనుగోళ్లను మళ్లిస్తున్నాయి. పరిశ్రమ వర్గాల ప్రకారం, భవిష్యత్‌లో రష్యా చమురు దిగుమతులపై దేశీయ రిఫైనరీల వ్యూహం మారే అవకాశం ఉంది.

## చిన్న బ్యాంకుల్లోనే
# డిపాజిట్లపై వడ్డీలు ఎక్కువ!



**న్యూఢిల్లీ, అక్టోబరు 25:** ప్రైవేటురంగ పెద్దబ్యాంకులకంటే అదేరంగంలోని చిన్న బ్యాంకులు ఫిక్సెడ్ డిపాజిట్లపై వడ్డీరేట్లతో ఊరిస్తున్నాయి. 0.25 శాతంనుంచి 0.75శాతం వరకూ వీరికి వడ్డీ అధికంగా అందిస్తున్నాయి. దీనివల్ల ఎక్కువ డిపాజిట్లను కూడా రాబడుతున్నట్లు అంచనా. ఇఎస్ఎఫ్ స్మాల్‌ఫైనాన్స్ బ్యాంకు 444 రోజులకు 8.10శాతం ఆఫర్‌చేస్తుంటే జన స్మాల్‌ఫైనాన్స్ బ్యాంకు 8శాతం అందిస్తోంది. మూడేళ్ల ఆపై ఐదేళ్ల డిపాజిట్లకుఈ వడ్డీలు ఇస్తోంది. సూర్యోదయ్ స్మాల్‌ఫైనాన్స్ బ్యాంకు కూడా 8.10శాతం సీనియర్ సిటిజన్లకు ఇస్తోంది. ఇక ఉత్కర్ష్ స్మాల్ ఫైనాన్స్‌బ్యాంకు 8.15శాతం వడ్డీ ఆఫర్‌చేస్తోంది. అయితే రెండుమూడేళ్ల కచ్చితంగా డిపాజిట్లు కొనసాగించాలి. ఇక ప్రైవేటురంగంలో మరికొన్ని బ్యాంకులు బంధన్‌బ్యాంకు రెండుమూడేళ్ల డిపాజిట్లపై 7.70శాతం, డిసిబి బ్యాంకు 37 నుంచ4 38 నెలల డిపాజిట్లకు 7.70శాతం, 70 ఏళ్లపైబడినవారికి అదనంగా 0.05శాతం అందిస్తోంది. సూపర్ సీనియర్లకు 0.25శాతం అదనపు ఆఫర్ అని చెపుతోంది. యెస్‌బ్యాంకుపరంగా చూస్తే 7.75శాతం డిపాజిట్లపై వడ్డీ ఇస్తోంది. ఇక ప్రభుత్వరంగంలోని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర 7.20శాతం 366 రోజుల డిపాజిట్లపై వడ్డీ ఇస్తోంది. సెంట్రల్‌బ్యాంకు 2222 లేదా 3333 రోజుల డిపాజిట్లపై 7.25శాతం ఇస్తోంది. ఇండియన్ బ్యాంకు 444 రోజుల డిపాజిట్లపై 7.20శాతం అదనంగా సూపర్‌సీనియర్లకు 0.25శాతం ఇస్తోంది. ఇక ఇండియన్ ఓవర్సీస్‌బ్యాంకు మాత్రం 444 రోజుల డిపాజిట్‌పై 7.20శాతం వడ్డీఇస్తోంది. 80ఏళ్లపైబడినవారికి 0.25శాతం ఇస్తోంది. మొత్తంగాచూస్తే చిన్న ఫైనాన్స్ బ్యాంకులే డిపాజిటర్లకు ఎక్కువ వడ్డీ ఎరవేస్తున్నట్లు తెలుస్తోంది.




## కోటక్‌బ్యాంకు నికర లాభం
# రూ.4468.27 కోట్లు!

**ముంబయి, అక్టోబరు 25:** ప్రైవేటురంగంలోని కోటక్ మహీంద్ర బ్యాంకు రెండోత్రైమాసికంలో 11.4శాతం లాభాల్లో క్షీణత నమోదుచేసింది. గత ఏడాది ఇదే కాలంఓ 5044.05 కోట్లు రాగా ఈ ఏడాది రెండోత్రైమాసికంలో 4468.27 కోట్లు ఆర్జించింది. ఇతర ఆదాయవనరులు, కేటాయింపుల్లో పెరుగుదలకారణంగా లాభాల్లో తగ్గుదలనమోదయిందని బ్యాంకు చెపుతోంది. ఏకీకృత విధానంలో బ్యాంకు నికరలాభం వార్షికపద్ధతిలోచూస్తే మూడుశాతం క్షీణించి 3253 కోట్లుగా ఉంది. కేటాయింపులు ఎకునకవని బ్యాంకు చెపుతోంది. నికరలాభం తొలిత్రైమాసికంలో 3282 కోట్లు ఆర్జించింది. బ్యాంకు నికరవడ్డీ ఆదాయం 4.15శాతం పెరిగి 7311 కోట్లుగా ఉంది. ఇతర ఆదాయవనరులపరంగా 3.5శాతం క్షీణించి 2589 కోట్లుగా ఉందని బ్యాంకు ప్రకటించింది. నికరవడ్డీమార్జిన్ 37 బేసిస్ పాయింట్లు క్షీణించి 4.54 శాతంగా ఉంది. బ్యాంకు నికరవడ్డీ మార్జిన్ తొలిత్రైమాసికంలో 4.65శాతంగా ఉంది. బ్యాంకు లాభదాయకతను నిర్ణయించేంది నికరవడ్డీ మార్జినే. ఇక తక్షణ కేటాయింపులు 43.5శాతంపెరిగాయి. 947 కోట్లుగా బ్యాంకు చూపించింది. ఏడాది క్రితం ఈ కేటాయింపులు 660 కోట్లుగా ఉన్నాయి. ఇక కేటాయింపులు, తక్షణవ్యయాలకింద మొత్తం 1208 కోట్లుగా తన నివేదికల్లో పొందుపరిచింది. ఇక నిరర్థక ఆస్తులపరంగా అడ్వాన్సుల్లో 1.39శాతంగా ఉన్నాయి.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.